ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY




శుక్రవారం 14 ఆగస్టు 2026 | సంపుటి: 28 సంచిక: 126
Friday 14 August 2026 | Vol.No 28 Issue No .126
హైదరాబాద్ | Hyderabad
పేజీలు: 12+12
వెల: రూ.1.00
PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
www.visionandhra.in

# మైనార్టీ రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే

- కొందరు 4శాతం రిజర్వేషన్లపై కోర్టు మెట్లెక్కారు
- ఇంటింటికీ వెళ్లి ఓట్ల గల్లంతును పరిశీలించండి
- మైనార్టీల ప్రతిభా సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,ఆగస్ట్13 : ముస్లిం మైనారిటీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ముస్లింలకు కాంగ్రెస్ 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, వీటిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్ల రద్దు కోసం అత్యున్నత న్యాయస్థానాల వరకూ వెళ్లారని ముఖ్యమంత్రి విమర్శించారు. అయినా చిత్తశుద్ధితో కాంగ్రెస్ అమలు చేసిందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మైనారిటీల ప్రతిభా సదస్సుకు సీఎం



రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన పలువురు మైనారిటీలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మైనారిటీ రిజర్వేషన్లకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యతిరేకమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ నేతృత్వంలోనే మైనారిటీలకు సంక్షేమం అందుతోందని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే సెక్యులర్ పార్టీ అని, హిందూ, ముస్లింలను రెండుకళ్లలా

మిగతా 2లో..




## పదేళ్ల బిఆర్ఎస్.. రెండేళ్ల కాంగ్రెస్ పాలనను

# బేరీజు వేయండి

- గత పథకాలకు తోడు సంక్షేమాన్ని రెట్టింపు చేసాం
- రాష్ట్రం ఎండిపోవాలని కుట్రలు చేశారు
- వారు చేసిన చేతబడి తిరగబడింది
- నగరంలో పేదలకు లక్ష ఇళ్లు నిర్మిస్తున్నాం
- ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపనలో సిఎం రేవంత్



హైదరాబాద్,ఆగస్ట్13 : పదేళ్ల బీఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. గతంలో ఉన్న పథకాలకు అదనంగా సంక్షేమాన్ని అందిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలో క్యూర్



పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి సీఎం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదల రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందని.. ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై సీఎం విమర్శలు చేశారు. రాష్ట్రం ఎండిపోవాలని కుట్ర చేశారని ఆరోపించారు. చేతబడుల కోసం కొందరు కర్ణాటక వెళ్లారు. అన్నీ ఉన్నా అల్లుడి

మిగతా 2లో..

# పంద్రాగస్టు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

- ప్రోటోకాల్‌ను తప్పక పాటించాలి
- విద్యుత్, త్రాగునీరు, ఇతర సదుపాయాలు సమకూర్చాలి
- అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలి
- అధికారులకు దిశానిర్దేశం చేసిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్

హైదరాబాద్,ఆగస్టు13 : రవాణా, ఆర్ అండ్ బి శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ పంద్రాగస్టు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శనివారం గోల్కొండ కోటలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగే ప్రాంతాన్ని గురువారం సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి ఆయన పరిశీలించి, ఏర్పాట్లపై దిశానిర్దేశర చేశారు. వర్షాకాలం నేపథ్యంలో కార్యక్రమంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా వాటర్‌ప్రూఫ్ షామియానాలు, వాటర్‌ప్రూఫ్ జనరేటర్, నిరంతర విద్యుత్ సరఫరా,




త్రాగునీరు, బారికేడింగ్, గ్యాలరీలు, వచ్చే అతిథులు, విద్యార్థులు, ప్రజల సీటింగ్ సామర్థ్యం, సౌండ్ సిస్టమ్ తదితర ఏర్పాట్లను ఉన్నతస్థాయి అధికారులతో కలిసి ఆయన సమీక్షించారు. కార్యక్రమ నిర్వహణలో ఎక్కడా ప్రోటోకాల్‌కు ఇబ్బంది కలగకుండా అధికారులు నిబద్ధతతో వ్యవహరించాలని ఆయన సూచించారు. అదేవిధంగా స్టేజీ ఏర్పాటుతో పాటు సుందరీకరణ పనులను వేగవంతంగా చేపట్టాలని సూచించారు. జిల్లాలోని

మిగతా 2లో..

# త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు

- దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర,
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



న్యూఢిల్లీ,ఆగస్టు13 : దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దీనివల్ల విద్యుత్ ఉత్పత్తి వ్యయం తగ్గి వినియోగదారులకు తక్కువ ధరకు విద్యుత్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2018 నుంచి బొగ్గు ధరలను పెంచలేదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అదే విధంగా సిమెంట్, స్టీల్ వంటి రంగాలకు సంబంధించిన ధరల విషయంలోనూ పెరుగుదలను నియంత్రించే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మినరల్స్ అంశంలో రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం పెత్తనం చేయబోదని కిషన్‌రెడ్డి

మిగతా 2లో..

# వచ్చే ఏడాది ఇందిరమ్మ టవర్స్ నుంచే బోనాలు ఎత్తిస్తాం

- ఎటువంటి లాలూచీ లేకుండా పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు.
- గత ప్రభుత్వం పేదలను దోచుకుంటే ... మేం ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్,ఆగస్ట్13 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నేడు శంకుస్థాపన చేసుకున్న ఇందిరమ్మ టవర్స్ నుంచి వచ్చే ఏడాది బోనాలు ఎత్తిస్తామని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. గురువారం సాయంత్రం కూకట్‌పల్లిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన సభకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆనాటి ప్రభుత్వం కమిషన్లు రావన్న కారణంగా పేదలకు ఇళ్ళు కట్టలేదని, కమిషన్లు వచ్చే కాళేశ్వరం ప్రాజెక్టుపైనే దృష్టి సారించిందని ఆరోపించారు. దీనికి భిన్నంగా ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ఎకరా 200 కోట్ల రూపాయల వరకు ఉన్నప్పటికీ

మిగతా 2లో..

# ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

- వందేమాతరం గీతాలాపనతో లోక్‌సభ వాయిదా



న్యూఢిల్లీ,ఆగస్టు13 : పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిశాయి. గురువారం ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. లోక్‌సభ

మిగతా 2లో..

# సమగ్ర ఏనుగు సంరక్షణ ప్రణాళిక

- ఏనుగుల సంరక్షణతో పాటు జీవనోపాధి
- ఏనుగులతో పంటనష్టం, ప్రాణనష్టంపై ఆందోళన
- కేంద్ర పర్యావరణ సహాయక శాఖ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్

విశాఖపట్నం,ఆగస్ట్13 : ఏనుగుల సంరక్షణతో పాటు ప్రజల ప్రాణాలు, జీవనోపాధి రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర పర్యావరణ సహాయక శాఖ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ తెలిపారు. విశాఖలో జరిగిన ప్రపంచ ఏనుగుల దినోత్సవం-2026 ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పాల్గొని ప్రసంగించారు. మానవ-ఏనుగు మధ్య ఘర్షణలు తీవ్రమైన సమస్యగా మారాయన్నారు. దీనికి తాత్కాలిక చర్యలకంటే శాస్త్రీయ పరిశోధన ఆధారిత సమగ్ర ప్రణాళిక అవసరమని తెలిపారు. ఏనుగుల సంరక్షణలో పురోగతి సాధించినప్పటికీ పంట నష్టం, ప్రాణనష్టం, అలాగే ఏనుగుల మృతి వంటి ఘటనలు పెరుగుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సమగ్ర ఏనుగు సంరక్షణ




ప్రణాళికను రూపొందించిందని కేంద్ర మంత్రి వెల్లడించారు. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని పెంపొందిస్తూ బందీ ఏనుగుల డీఎన్ఏ డేటాబేస్‌తో పాటు ఏనుగుల కదలికలను పర్యవేక్షించే 'గజ సూచన' యాప్‌ను వినియోగిస్తున్నామని తెలిపారు. ఘర్షణలను

మిగతా 2లో..

# గ్రూప్-1 పరీక్షల్లో అక్రమాలు

- జగన్ హయాంలో అనుయాయులకు పోస్టులు
- అక్రమాలపై ఎక్కడికక్కడ నిలదీయండి
- మంత్రులకు చంద్రబాబు దిశానిర్దేశం



అమరావతి,ఆగస్ట్13 : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 మూల్యాంకనంతో వైసీపీ అడ్డంగా దొరికిపోయిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. తమ వారికి ఉద్యోగాలు ఇప్పించుకునేందుకు అర్హులను బలి చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయంలో అందుబాటులో ఉన్న మంత్రులతో సీఎం చంద్రబాబు గురువారం మధ్యాహ్నం లంచ్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రూప్-1 అంశం చర్చకు వచ్చింది. గ్రూప్-1

మిగతా 2లో..

# రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది

- అక్రమాలపై నిలదీస్తే కేసులతో జైళ్లకు పంపుతున్నారు
- ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టే ఇందుకు నిదర్శనం
- వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం



కర్నూలు,ఆగస్ట్13 : రాష్ట్రంలో అమలవుతున్న 'రెడ్ బుక్ రాజ్యాంగం'పై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్ట్, జైలుకు పంపిన తీరు రాష్ట్రంలో బాధితులే నిందితులుగా మారుతున్న దారుణ పరిస్థితికి అద్దం పడుతోందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ అన్యాయాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు

మిగతా 2లో..

## రాజధాని నిర్మాణంలో

# మరో కీలక ఘట్టం

- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ టవర్లు ప్రారంభించిన చంద్రబాబు



అమరావతి,ఆగస్ట్13 : అమరావతి రాజధాని నిర్మాణంలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. రాజధానిలో

మిగతా 2లో..

# అమరావతి రైతులది త్యాగమే కాదు.. స్ఫూర్తి కూడా

- వారే లేకుంటే అమరావతే లేదన్నది సత్యం
- రైతులను భాగస్వాములను చేసేందుకే ల్యాండ్ పూలింగ్
- గ్రాఫిక్స్ అన్నవారికి చెంపపెట్టులా నిర్మాణాలు
- సైబరాబాద్ స్ఫూర్తితో అమరవాతి నిర్మాణానికి అడుగు
- అమరావతి నిర్మాణం రాష్ట్ర భవిష్యత్‌కు ప్రతీక
- స్టీల్ బ్రిడ్జ్ ప్రారంభంలో సిఎం చంద్రబాబు

అమరావతి,ఆగస్ట్13 : అమరావతి రైతులది త్యాగమే కాదు.. స్ఫూర్తి అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వారు ముందుకు రాకుంటే ఇవాళ రాజధాని నిర్మాణాన్ని ఊహించలేమని అన్నారు. గత ప్రభుత్వం వారిని కేసులతో అనేక ఇబ్బందులకు గురిచేసినా, రాజధాని కోసం త్యాగాలకు వెరవలేదని అన్నారు. రాజధాని అమరావతిని కలిపే ప్రధాన రహదారి సీడ్ యాక్సెస్ రోడ్డు ఈ-3ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. సీడ్ యాక్సెస్ రోడ్డును అనుసంధానించే స్టీల్ బ్రిడ్జీల ప్రారంభానికి సూచికగా ఉండవల్లి వద్ద శిలాఫలకాన్ని




చంద్రబాబు ఆవిష్కరించారు. అనంతరం కాలినడకన వెళ్లి స్టీల్ బ్రిడ్జిలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు హాజరైన రైతులు, స్థానికులను ఉద్దేశించి సీఎం మాట్లాడారు. రాష్ట్ర విభజన తర్వాత ఏమవుతుందో తెలియని స్థితిలో అందరం ఉన్నామని, రాజధాని ఎక్కడ నిర్మించాలో అర్థం

మిగతా 2లో..

## వచ్చే ఏడాది ఇందిరమ్మ టవర్స్ నుంచే బోనాలు ఎత్తిస్తాం

హైదరాబాద్ మహానగరంలో పెద్ద పెద్ద టవర్స్ పక్కనే పేదలకు కూడా ఇళ్లు నిర్మించాలని నిర్ణయించి ఆచరణలోకి తెచ్చిందన్నారు. హస్తం పార్టీ రాష్ట్ర ప్రజలకు నేస్తమని మంత్రి గుర్తుచేస్తూ ఈ ప్రభుత్వం తల తాకట్టు పెట్టి అయినా పేదలకు ఇళ్ల నిర్మాణం నిరంతర పక్రియగా చేపడుతుందన్నారు. తొలివిడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి సంకల్పించామని దీనికి సంబంధించి ఇప్పటి వరకు 51 వేల దరఖాస్తులు వచ్చాయని, మరో రెండు రోజుల్లో దరఖాస్తులు స్వీకరణ గడువు ముగుస్తుందని అన్నారు. ఆ కార్యక్రమం తర్వాత అందరి సమక్షంలో ఎటువంటి లాలూచీలు లేకుండా పారదర్శకంగా మంత్రులతో సైతం ఎవరి సిఫార్సులు లేకుండా అందరి ముందు లక్కి డిప్ తీసి ఇళ్లను కేటాయిస్తామని చెప్పారు. లబ్దిదారులకు ముందే ఇళ్ల వివరాలను అందిస్తాం కాబట్టి వారు దగ్గరుండి కాంట్రాక్టర్ తో నాణ్యంగా తమ ఇళ్ళను కట్టించుకోవచ్చునని సూచించారు .ఇటువంటి బృహత్తర కార్యక్రమాన్ని గత ప్రభుత్వ పాలకులు జీర్ణించుకోలేక కక్షపూరితంగా గుడ్డ కాల్చి నెత్తిన వేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల ఇళ్ల గృహప్రవేశాలు పూర్తయ్యాయని గుర్తు చేస్తూ గత ప్రభుత్వం పదేళ్లలో నిర్మించిన ఇళ్ల కంటే మరో రెండున్నర ఇళ్లలో మూడింతలు ఎక్కువగా ఇళ్లు నిర్మిస్తామని ,అది చేయకపోతే తాను శాసనసభకు పోటీ చేయనని మరోసారి మంత్రి పొంగులేటి ప్రకటించారు. గతంలోనే ఈ ఛాలెంజ్ విసిరినప్పటికీ కిందర్ కింగ్ దీన్ని స్వీకరించలేదని, ఆయన నుంచి ఎటువంటి స్పందన లేదని అన్నారు. అంతేగాక సొల్లు పురాణం సొల్లు కథలు చెబుతూ పేదలను పేదల ఆత్మగౌరవాన్ని కించపరుస్తున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో కొన్ని భూములు నిషేధిత జాబితాలో ఉన్నట్లు శాసనసభ్యులు తమ దృష్టికి తీసుకువచ్చారని అవి ప్రభుత్వ భూములు కాకపోతే రెండు రోజుల్లోనే ఆ భూములపై నిషేధం తొలగిస్తామని మంత్రి హామీ ఇచ్చారు

## ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

ప్రారంభమైన తర్వాత సభ్యులంతా కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ సమావేశానికి ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్‌తోపాటు సభ్యులంతా హాజరయ్యారు. జాతీయ గేయంలోని ఆరు చరణాలను పూర్తిగా ఆలపించిన అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేశారు. దీంతో వర్షాకాల సమావేశాలు ముగిసినట్లు అయింది. వందేమాతరం గేయాన్ని చట్టపరంగా రక్షణ కల్పించే శాసనానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేసిన కొన్ని రోజులకే లోక్‌సభలో ఈ పరిణామం చోటు చేసుకుంది. జాతీయ గేయాన్ని ఆలపించడాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా నిరోధించడం శిక్షార్హమైన నేరమని ఈ చట్టం స్పష్టం చేస్తోంది. తద్వారా దీనికి జాతీయ గీతం 'జనగణమన'తో సమానమైన చట్టపరమైన హోదా లభించినట్లైంది. రాష్ట్రపతి రాక, త్రివర్ణ పతాకావిష్కరణ, గవర్నర్ల ప్రసంగం వంటి సందర్భాల్లో వందేమాతరంలోని ఆరు చరణాలను ఆలపించాలని జనవరి 28వ తేదీన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20వ తేదీన ప్రారంభమై.. ఆగస్టు 13వ తేదీతో ముగిశాయి. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్య శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతోపాటు విద్యావ్యవస్థలో సంస్కరణలు తేవాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళన చేపట్టింది. జులై 20వ తేదీన వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో ఆ రోజు చలో పార్లమెంట్ యాత్రకు సీజేపీ పిలుపునిచ్చింది. ఈ ఘటనతో చోటు చేసుకున్న తీవ్ర పరిణామాలతో మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. అదే విధంగా పార్లమెంట్ సమావేశాల్లో యాంటీ పేపర్ లీక్ బిల్లుతోపాటు పలు బిల్లులు ఆమోదం పొందాయి. అయితే.. ఢిల్లీలో యువతపై జరిగిన లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశాలు ఇచ్చారో సభలో ప్రకటన చేయాలంటూ కేంద్రాన్ని ప్రతిపక్షం కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో సభలో దాదాపుగా వాయిదాల పర్వం కొనసాగింది. చివరకు ఈ రోజు ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి.

## సమగ్ర ఏనుగు సంరక్షణ ప్రణాళిక

తగ్గించడంలో ఏనుగుల ప్రవర్తనపై అధ్యయనానికి ఈ యాప్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఏనుగుల మృతిని నివారించేందుకు రైల్వే శాఖతో సమన్వయంగా ప్రమాదకర ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు, ఫెన్సింగ్, హెచ్చరిక వ్యవస్థలు ఏర్పాటు చేస్తున్నామని కేంద్ర మంత్రి తెలిపారు. విద్యుత్ లైన్ల కారణంగా జరిగే ప్రమాదాలను తగ్గించేందుకు కూడా అవసరమైన చర్యలు చేపడుతున్నామని అన్నారు. సిక్కిం, తమిళనాడు, ఉత్తరప్రదేశ్‌లో మూడు కొత్త ఏనుగు రిజర్వులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఘర్షణలకు ఒకే విధమైన పరిష్కారం ఉండదని, ప్రాంతాలవారీగా కారణాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. తాత్కాలిక చర్యలకు పరిమితం కాకుండా ముందస్తు అంచనా ఆధారిత వ్యవస్థ అవసరమని చెప్పుకొచ్చారు. వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సేకరించిన డేటా ఆధారంగా ప్రమాద ప్రాంతాలను గుర్తిస్తున్నామని కేంద్ర మంత్రి అన్నారు. రాష్ట్రాల మధ్య అనుభవాలను పంచుకోవడం ద్వారా మరింత సమర్థవంతమైన పరిష్కారాలు సాధ్యమవుతాయన్నారు. ఏనుగుల సంరక్షణ, ఘర్షణల నివారణ కోసం రూ.500 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధుల ద్వారా శాస్త్రీయ చర్యలను విస్తృత స్థాయిలో అమలు చేయవచ్చన్నారు. ఏనుగులు, ప్రజల ప్రాణాలు, జీవనోపాధి రక్షణ ప్రభుత్వాల బాధ్యత అని, కేంద్ర–రాష్ట్ర సమన్వయంతోనే దీర్ఘకాలిక పరిష్కారాలు సాధ్యమవుతాయని కేంద్ర పర్యావరణ సహాయక శాఖ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ పేర్కొన్నారు.

## గ్రూప్-1 పరీక్షల్లో అక్రమాలు

మూల్యాంకనంలో 97 శాతం జవాబు పత్రాలు దిద్ది ఉండటంపై సీఎం చంద్రబాబు, మంత్రులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లతో జవాబు పత్రాలు దిద్దించడంపై పలు పత్రికలు, ఛానళ్లలో వచ్చిన వార్తలను చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారని సీఎంకు మంత్రులు వివరించారు. ఈ సందర్భంగా త్వరలో జరుగనున్న అసెంబ్లీ సమావేశాల్లోనూ గ్రూప్–1 వ్యవహారంపై వైసీపీని ఎండగట్టాలని సీఎంను కోరారు. సిట్ ఇచ్చిన నివేదిక ఆధారంగా గత వైసీపీ ప్రభుత్వం, అప్పటి ఏపీపీఎస్సీ కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనేయులు పాత్రపై మరింత లోతైన దర్యాప్తు చేయాలని మంత్రులు పేర్కొన్నారు. మరికొంతమంది అధికారుల పాత్రా ఉందని, దీనిపైనా దర్యాప్తు జరపాలని చంద్రబాబుకు మంత్రులు విజ్ఞప్తి చేశారు. 2011లో మహారాష్ట్రలోనూ ఇలానే జరిగితే అక్కడ అభ్యర్థులు పోరాటం చేశారని మంత్రులు గుర్తు చేశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి.. సిట్ నివేదిక కోర్టు పరిధిలో ఉందని, న్యాయస్థానం నిర్ణయం ఏమిటో చూద్దామని మంత్రులకు సూచించారు. ఏపీపీఎస్సీ గ్రూప్–1 పరీక్షల వ్యవహారంలో ఎవరెవరి పాత్ర ఉందనే అంశంపై సమాచారం సేకరించేందుకు కొంతమంది పోలీస్ శాఖ అధికారులకు ప్రభుత్వం టాస్క్ ఇచ్చిందన్నారు. తమకు అన్యాయం జరిగిందని కోర్టుకు వెళ్లిన గ్రూప్–1 అభ్యర్థులతో మాట్లాడితే పూర్తి సమాచారం వస్తుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ వివరించారు. వారితో వెంటనే మాట్లాడాలని, సమాచారం సేకరించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. అలాగే, డీఎస్సీలో ఎటువంటి అవకతవకలు జరగలేదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ అంశాన్ని శాసన మండలిలో వైసీపీ లేవనెత్తితే దీటుగా సమాధానం చెబుదామని పేర్కొన్నారు. వైసీపీ చేసే ప్రతి ఆరోపణకు సాక్ష్యాధారాలతో సహా అగ్రెసివ్‌గా కౌంటర్ ఇవ్వాల్సిందేనని మంత్రులకు స్పష్టం చేశారు. పొలిటికల్ ఎటాక్ స్టాం÷–రగ్‌గా ఉండాలన్నారు. కౌన్సిల్‌లో డీఎస్సీపై చర్చకూ సిద్ధమని, ఆరోపణలు చేసే వారు ఆధారాలు తీసుకురావాలని సవాల్ చేయాలని మంత్రులకు సీఎం సూచించారు. ఇప్పటికే అధికారులు అన్ని విషయాలు చెప్పారని, అయినా కావాలని బురద చల్లితే మాత్రం రాజకీయంగా వదిలిపెట్టవద్దని తేల్చి చెప్పారు. రాజధాని అమరావతిలో నిర్మాణాలు ఊపందుకున్నాయని, ఇక వరుసగా ప్రారంభోత్సవాలు చేద్దామని సీఎం చెప్పారు. ఈ సందర్భంగా సైబరాబాద్ నిర్మాణం, హైదరాబాద్ ఓఆర్ఆర్, హైటెక్ సిటీ వంటి ప్రాజెక్టుల్లో తన అనుభవాలను మంత్రులతో సీఎం చంద్రబాబు షేర్ చేసుకున్నారు.

## రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది

బనాయిస్తూ, చివరకు ఎమ్మెల్యేల ఇళ్లను కూడా ధ్వంసం చేసి అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు డైరెక్షన్‌లోనే ఈ కుట్రల పాలన సాగుతోందని జగన్ విమర్శించారు. రాత్రి 2:45 గంటల సమయంలో వందల మంది పోలీసులు దొంగల్లా, బందిపోటు ముఠాలా వచ్చి ఎమ్మెల్యే విరూపాక్షి ఇంటి డోర్లు, సీసీ కెమెరాలను ధ్వంసం చేసి ఆయనను అపహరించుకుపోయారని ఆరోపించారు. పగటిపూట నోటీసులు ఇస్తే రాని ఉగ్రవాదా ఆయన అని ప్రశ్నించారు. గంటల వ్యవధిలోనే ఎమ్మెల్యేపై మూడు అక్రమ కేసులు పెట్టడమే కాకుండా ఆయన కుమారుడు, తమ్ముడు, తమ్ముడి కుమారుడిని కూడా ఈ కేసుల్లో ఇరికించారని మండిపడ్డారు. ఆగస్టు 1న సంగాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త గిరిపై దాడి జరుగు తుంటే, ఆయన రక్షణ కోసం ఎమ్మెల్యే విరూపాక్షి మానవత్వంతో అక్కడికి వెళ్లడమే నేరమన్నట్లు పోలీసులు వ్యవహరించారని జగన్ తెలిపారు. స్థానిక ఎస్సై, సీఐలకు ఫోన్ చేసినా పోలీసులు కాపాడక పోవడంతోనే ఎమ్మెల్యే స్వయంగా వెళ్లాల్సి వచ్చిందన్నారు. ఆ తర్వాత నెమకల్లు వద్ద ఎమ్మెల్యేపై దాడి చేసి, ఆయన తమ్ముడి చెయ్యి విరగ్గొట్టారని వెల్లడించారు. ఈ నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఒక టీడీపీ కార్యకర్త తన భార్య బట్టలు తానే చించి, ఆ నెపం ఎమ్మెల్యేపై నెట్టి ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. దీనికి సంబంధించిన వీడియోలు కూడా బయటకు వచ్చాయని, సదరు మహిళతో తప్పుడు మాటలు చెప్పిస్తూ ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తున్నారని, ఈ అక్రమాలపై ప్రజాస్వామ్యవాదులంతా ఆలోచించాలని జగన్ పిలుపునిచ్చారు.

## మైనార్టీ రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే

చూస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపైనా ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం గ్రూప్–1 పరీక్షలను నిర్వహించలేకపోయిందని ఎద్దేవా చేశారు. ఓ ఆర్ఎంపీ డాక్టర్‌ను టీజీపీఎస్సీ సభ్యుడిగా నియమించారని సీఎం ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఉన్నంతకాలం దేశంలో సెక్యులర్ వర్గాలకు మనుగడ ఉంటుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హిందూ, ముస్లింలను రెండు కళ్లలా కాంగ్రెస్ చూస్తోందని చెప్పారు. నగరంలోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో మైనారిటీస్ ఎక్స్‌లెన్స్ సమ్మిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ ఇచ్చింది.

వాటిని రద్దు చేయాలని కొందరు హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గుజరాత్‌లో మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేసి చూపాలని సవాల్ విసిరాం. లౌకిక వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పోరాడుతుంది. బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్‌కు గ్రూప్–1 ఉద్యోగం, రూ.3కోట్ల ప్రోత్సాహకం ఇచ్చాం. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్–1 నియామకాల ఊసే లేదు. ఒకసారి నియామకాలు చేపట్టినా పల్లీ, బఠానీల్లా ప్రశ్నపత్రాలు అమ్మారు. మా ప్రభుత్వం వచ్చాక టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశాం. అందులో విద్యావంతులను నియమించాం. టీజీపీఎస్సీ ద్వారా గ్రూప్–1 పోస్టులు భర్తీ చేశాం. గ్రూప్–1 రద్దు చేయాలని బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. అక్కడ మంచి న్యాయవాదిని పెట్టి వాదనలు వినిపించాం. తద్వారా నియామకాలు పూర్తిచేశాం. గ్రూప్ 2, 3, 4 పోస్టుల విషయంలోనూ కోర్టుల్లో పోరాడి ఉద్యోగాలు భర్తీ చేశాం'అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీని బలోపేతం చేశామని ధీమా వ్యక్తం చేశారు. రిటైర్డ్ డీజీపీని టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా నియమించామని చెప్పుకొచ్చారు. ఎంతో పారదర్శకంగా గ్రూప్–1 పరీక్షలు నిర్వహించామని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నిఖత్ జరీన్ కోసం నిబంధనలు పక్కనపెట్టి మరీ గ్రూప్–1 ఉద్యోగం ఇచ్చామని, అలాగే క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామని సీఎం రేవంత్ గుర్తు చేశారు. మైనారిటీ యువత చదువుతో పాటు నైపుణ్యం సంపాదించాలని కోరారు. జర్మనీ, జపాన్ లాంటి దేశాల్లో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు స్కిల్స్ యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. సందర్భంగా తాను అందరి సహకారంతోనే తెలంగాణ ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నట్లు రేవంత్ చెప్పుకొచ్చారు. సర్ పేరుతో ఓట్లు తొలగించాలని కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బెంగాల్‌లో గెలిచామని, ఇక తెలంగాణనే టార్గెట్ అని కొందరు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అక్కడ మమతా బెనర్జీ వదిలేశారేమో కానీ, ఇక్కడ కాంగ్రెస్ కార్యకర్తలు వదిలిపెట్టరని హెచ్చరించారు. 'గల్లీ గల్లీ తిరగండి, ఇంటింటికీ వెళ్లండి.. ప్రతీ ఒక్కరి ఓటును చెక్ చేయండి' అంటూ కార్యకర్తలకు సీఎం పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరూ ఒక రేవంత్ రెడ్డిలాగా మారి ప్రజల ఓటు హక్కును కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

## పదేళ్ల బిఆర్ఎస్.. రెండేళ్ల కాంగ్రెస్ పాలనను బేరీజు వేయండి

నోట్లో శని అన్నట్లు కేసీఆర్ పరిస్థితి ఉంది. అందుకే అల్లుడు క్షుద్రపూజలు చేశారు. మీరు చేసిన చేతబడి మీపైనే తిరగబడి అష్టదిగ్బంధనం చేస్తుంది. ఫాంహౌస్ నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి వస్తుంది. నా సంకల్పం రాష్ట్రం బాగుకోసం.. అందుకే వర్షాలు పడుతున్నాయి. పదేళ్లు అధికారంలో ఉన్నవారు చేతబడులు చేయిస్తారా? అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు అండగా ఉంటానన్నారు. కూకట్‌పల్లి ప్రజలకు కావాల్సిన పనులు చేయించాలని మంత్రులను ఆదేశిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. మహిళలకు ఉచిత బస్సు పథకం కింద రూ.12వేల కోట్లు చెల్లించాం. మహిళా సంఘాలకు రూ.65వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించాం. మహిళలకు ఉచిత బస్సు పథకం బంద్ చేయించాలని విపక్ష నేతలు ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టారు. 55 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలు అందించాం. మహిళా సంఘాలకు వెయ్యి ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేసి ఇచ్చాం అని రేవంత్ అన్నారు. ఆనాడు నేను పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేస్తే కూకట్ పల్లి ప్రజలు నన్ను ఆశీర్వదించి గల్లీ నుంచి ఢిల్లీకి పంపారని గుర్తు చేసుకున్నారు. ప్రతిపక్షంలో ఉండగా గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో మీరు ఆశించిన మేరకు అభివృద్ధి చేయలేకపోయానన్నారు. కానీ ఇప్పుడు కూకట్ పల్లిని అభివృద్ధి చేసుకునేందుకు అన్ని రకాల అధికారం ఉందన్నారు. మీకు ఎలాంటి అభివృద్ధి కావాలన్నా అడిగి చేయించుకోండి. కూకట్ పల్లి నియోజకవర్గాన్ని ప్రతీక దృష్టితో అభివృద్ధి చేయాలని శ్రీధర్ బాబు గారిని ఆదేశిస్తున్నానని అన్నారు. పదేళ్ల వారి పరిపాలన రెండేళ్ల మా పాలనను బేరీజు వేసుకోండి. తెలంగాణలో 3 కోట్ల 28 లక్షల మందికి సన్నబియ్యం అందిస్తున్నాం. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని పెంచేలా ఇందిరమ్మ చీరలను సారెగా అందించాం. పెట్రోల్ బంకులు, సోలార్ ఎ÷–లాంట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాం స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను విక్రయించుకునేందుకు శిల్పారామంలో స్టాళ్లను ఇచ్చాం ఒకవైపు గత ప్రభుత్వం చేసిన అప్పులను చెల్లించుకుంటూనే.. మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం అని సిఎం వివరించారు. డబ్బా ఇండ్లు వద్దు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామన్న వాళ్లు మీలో ఒక్కరికైనా ఇల్లు ఇచ్చారా అని ప్రశ్నించారు. పట్టణంలో పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని మా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ కు శ్రీకారం చుట్టింది. మొదటి విడతలో లక్ష ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మీ సొంతింటి కలను నిజం చేసేందుకు మీ సోదరుడిగా మీకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళుతున్నాం అని వివరించారు. ఈ సందర్భంగా 22–ఎ భూముల అంశంపై ఆయన మాట్లాడారు. మీరు కొనుగోలు చేసిన భూమి పొరపాటున 22–ఎలో పడితే ఆ భూమిని మీకే ఇప్పిస్తాను. ఈ విషయంలో నాదీ పూచీ. సమస్య ఉన్న ఒక సర్వే నంబర్‌లో 500 ఎకరాలు ఉంటే అన్నీ నిషేధిత జాబితాలో పెట్టారు. సబ్ నంబర్లు ఇచ్చి సమస్యను పరిష్కరిస్తానని సీఎం తెలిపారు.

## అమరావతి రైతులది త్యాగమే కాదు.. స్ఫూర్తి కూడా

కాని పరిస్థితి అన్నారు. శివరామకృష్ణ ఆధ్వర్యంలో కమిటీ వేశారు. మెజారిటీ ప్రజలు అమరావతినే సూచించారు. రాజధాని లేకపోతే మనం ఏమీ చేయలేమని గ్రహించి నిర్మాణానికి సంకల్పించా.. కేవలం ఓ 50 ఎకరాల్లో భవనాలు నిర్మించవచ్చని, అయితే భవిష్యత్ ఏం కావాలన్న ప్రశ్న ఉదయించడంతో అమరావతి నిర్మాణానికి పూనుకున్నామని అన్నారు. అయితే ఇందుకోసం భూములు కావాలి కదా? మహానగరంగా ఎలా చేయాలని ఆలోచిస్తే.. ల్యాండ్‌పూలింగ్ కాన్సెప్ట్ వచ్చింది. రాజధాని నిర్మాణంలో రైతులను భాగస్వాములను చేస్తే బాగుంటుందని ఆలోచించా. ఒక్కమాట చెప్పగానే.. నన్ను నమ్మి భూములిచ్చేందుకు అన్నదాతలు ముందుకొచ్చారు. నోటిఫికేషన్ ఇచ్చిన 58 రోజుల్లోనే రైతుల నుంచి విశేష స్పందన వచ్చింది. 33వేల ఎకరాలు ఇచ్చేందుకు.. 29వేల మంది రైతులు ముందుకొచ్చారు. అమరావతి రైతాంగానికి శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని నాటి సంగతులను సీఎం చంద్రబాబు వివరించారు. సింగపూర్ మోడల్‌తో అమరావతిని నిర్మిస్తున్నామని చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. తనపై ఉన్న నమ్మకంతో ఆ ప్రభుత్వం ఉచితంగా ప్లాన్ ఇచ్చారని అన్నారు. సీడ్ యాక్సెస్ రోడ్డుతో అమరావతికి కనెక్టివిటీ పెరగనుందని పేర్కొన్నారు. రాజధాని లేకపోతే మనం ఏమీ చేయలేమని గ్రహించా నని తెలిపారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన అమరావతి రైతులకు పాదాభివందనం చేస్తున్నానని అన్నారు. రైతులు లేకపోతే రాజధాని లేదని చెప్పుకొచ్చారు. ఆనాడు అమెరికాలో పర్యటించి.. సైబరాబాద్ రూపకల్పన చేశామని ప్రస్తావించారు. రూపాయి తీసుకోకుండా అమరావతి కోసం సింగపూర్ మాస్టర్ ప్లాన్ రూపొందించిందని సీఎం చంద్రబాబు కొనియాడారు. ఏపీకి గొప్ప చరిత్ర ఉందని తెలిపారు. అమరావతి రైతుల త్యాగమే కాదని.. స్ఫూర్తి కూడా చాలా గొప్పదని ప్రశంసించారు. నాడు రాజధాని ఎక్కడ కట్టాలనే సందిగ్ధత ఉండేదని తెలిపారు. శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఇందుకోసం ఓ కమిటీ వేశారని ప్రస్తావించారు. రాజధానిగా అమరావతినే మెజార్టీ ప్రజలు కోరుకున్నారని ప్రస్తావించారు. ప్రజల నిర్ణయం మేరకే రాజధాని అమరావతి నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు. ఆనాడు సైబరాబాద్‌ను నిర్మించామని చెప్పారు. హైదరాబాద్ ఆదాయం పెరగడానికి తాను చేసిన అభివృద్ధే కారణమని పేర్కొన్నారు. ప్రజల నిర్ణయం మేరకే రాజధాని అమరావతిని ఎంపిక చేశామని సీఎం చంద్రబాబు చెప్పారు. ఆనాడు హైటెక్‌సిటీ నిర్మిస్తే కొంతమంది ఎగతాళి చేశారని అన్నారు. తలసరి ఆదాయంలో తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందని వెల్లడించారు. హైటెక్‌సిటీ నిర్మాణం దశలోనూ ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నామని చెప్పారు. విమర్శలు పట్టించుకోకుండా సైబరాబాద్ నిర్మాణంపై దృష్టి పెట్టామని తెలిపారు. ఇప్పుడు హైదరాబాద్ ఎదుగుదల చూసి గర్వపడుతున్నామని అన్నారు. రాజధాని లేకపోతే మనం ఏమీ చేయలేమని గ్రహించానని చెప్పారు. హైదరాబాద్‌ను మించిన మహానగరాన్ని నిర్మించాలని తాము సంకల్పించామని అన్నారు. సింగపూర్ మోస్ట్‌లివబుల్ కంట్రీ.. అందుకే ఆ మోడల్ తీసుకున్నామని వెల్లడించారు. గ్రాఫిక్స్ అంటూ అమరావతిని వైసీపీ నేతలు ఎగతాళి చేశారని ధ్వజమెత్తారు. ఇప్పుడొచ్చి చూడండి.. అమరావతి ఎలా ఉందో అని ప్రశ్నించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా ఆనాడు అమరావతిని రాజధానిగా అంగీకరించారని ప్రస్తావించారు. 5,10 కాదు.. 40వేల ఎకరాలు కావాలని జగన్ చెప్పారన్నారు. ఆ తర్వాత రాజధాని పేరుతో జగన్ మూడు ముక్కలాట ఆడారని విమర్శించారు. జగన్ హయాంలో రాజధాని రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేది.. అమరావతి ఉద్యమమని తెలిపారు. అమరావతి చరిత్రలో రైతులకు ప్రత్యేక స్థానం ఉంటుందని అన్నారు. దేవతల రాజధాని అమరావతి.. ఇక్కడ ఇబ్బందులు ఉండవని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. సీడ్ యాక్సెస్ రహదారి ద్వారా రాజధానికి రాజమార్గం ఏర్పాటు చేసుకున్నాం. అమరావతిని ఆపడం ఇక ఎవరితరం కాదు. నీటి సమస్యలేని ఏకైక రాజధాని అమరావతి. విద్యుత్ స్తంభాలు, వైర్లు కనిపించని ఆధునిక నగరమిది. గ్యాస్‌తో సహా అన్నీ భూగర్భం నుంచే వెళ్లే రాజధాని మన అమరావతి. ఇవాళ ప్రారంభించిన రోడ్డు చిన్న ట్రైలర్ మాత్రమే. రాష్ట్రాభివృద్ధి విజన్‌కు అమరావతి నగర నిర్మాణం మొట్ట మొదటి సక్సెస్. రాష్ట్రాభివృద్ధిలో మొదటి మెట్టు ఎక్కాం. రాజధానితో పాటు రాష్ట్రం అంతటా అభివృద్ధి కావాలన్నదే నా ఆకాంక్ష. హెల్తీ వెల్తీ హ్యాపీ కావాలన్నదే అందరి సంకల్పం కావాలి. అమరావతి నిర్మాణం చేసి చరిత్ర సృష్టిస్తున్నందుకు గర్వంగా ఉందని సీఎం అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రలుఉ పి.నారాయణ, నాదెండ్ల మనోహర్, తాడికొండ శాసనసభ్యుడు తెనాలి శ్రావణ్ కుమార్, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్, ఎంపీ భాష్యం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల ఆరోగ్యంపై ఆటలొద్దు

- ఆహార పదార్థాల ప్యాకెట్లపై లేబుల్ వేయాల్సిందే
- మీతో కాకపోతే మేమే ఆ పని చేస్తాం
- కేంద్రానికి సుప్రీం కోర్టు చురకలు




న్యూఢిల్లీ,ఆగస్ట్13 : అధిక మోతాదులో ఉప్పు, చక్కెర, సంతృప్త కొవ్వులు ఉండే ఆహార పదార్థాల ప్యాకెట్‌లపై లేబుల్స్ ఏర్పాటు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గురువారం గట్టి హెచ్చరిక చేసింది. 'మీరు చేయలేకపోతే మేమే చేస్తాం' అంటూ కేంద్రానికి తేల్చి చెప్పింది. ప్రజల ఆరోగ్యానికి, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో కార్పొరేట్ ఒత్తిళ్లకు తలొగ్గకూడదని స్పష్టం చేసింది. జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఈ÷ూంఎ) వ్యవహరిస్తున్న తీరుపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వుల గురించి అవగాహన కలిగించేందుకు ప్యాకెట్‌ల ముందు భాగంలో స్పష్టమైన హెచ్చరికలు ఉండాలని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. ఈ విషయంలో ఆహార పరిశ్రమ అభ్యంతరాలను మాత్రమే ఎఫ్ఎస్ఎస్ఏఐ పరిగణనలోకి తీసుకుందన్నారు. హార ప్యాకెట్లపై హెచ్చరిక గుర్తులకు బదులుగా అదనపు చక్కెర, సంతృప్త కొవ్వులు, ఉప్పు మొదలైన వాటిని రోజుకు ఎంతో తీసుకోవచ్చో పట్టిక రూపంలో చూపించే విధానాన్ని ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచించింది. అయితే ఈ విధానం వినియోగదారులకు అవసరమైనంత అవగాహన అందించదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న చర్యలపై సుప్రీంకోర్టు ప్రశ్నలు సంధించింది. గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని, ఇప్పటివరకు ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుందని ధర్మాసనం ప్రశ్నించింది. హెచ్చరిక లేబుల్స్ వల్ల ఉత్పత్తుల విక్రయాలపై ప్రభావం పడుతుందని తయారీదారులు అభ్యంతరం వ్యక్తం చేయవచ్చని కోర్టు పేర్కొంది. అయితే తాము తినే ఆహారంలో ఎంత చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వు ఉందో తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందని స్పష్టం చేసింది. హెచ్చరిక ఉన్నప్పటికీ ఉత్పత్తిని కొనాలా, వద్దా అనే తుది నిర్ణయం వినియోగదారుడిదేనని తెలిపింది. హెచ్చరిక లేబుల్స్‌కు సంబంధించిన ప్రతిపాదనపై చర్యలు తీసుకునేందుకు కేంద్రానికి సుప్రీంకోర్టు రెండు వారాల గడువు ఇచ్చింది. తదుపరి విచారణ సమయంలో అవసరమైతే తుది ఆదేశాలు జారీ చేస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

## అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఖేలో ఇండియా క్రీడల నిర్వహణ

- కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయతో వాకిటి శ్రీహరి



న్యూఢిల్లీ,ఆగస్టు13 : కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి శ్రీ మన్‌సుఖ్ మాండవీయను తెలంగాణ క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి గురువారం న్యూఢిల్లీలో కలిశారు. ఆయనతోపాటు తెలంగాణ ప్రభుత్వ క్రీడా వ్యవహారాల సలహాదారు శ్రీ ఏపీ జితేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శ్రీ కె. శివసేన రెడ్డి ఉన్నారు. తెలంగాణకు ఖేలో ఇండియా క్రీడలను కేటాయించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి వాకిటి శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాసిన ఆహ్వాన లేఖను కేంద్ర మంత్రి మాండవీయకు అందజేశారు. డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు 12 రోజులపాటు తెలంగాణలో ఖేలో ఇండియా క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఖేలో ఇండియా క్రీడలను ఘనంగా, విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసిందని మంత్రి పేర్కొన్నారు. నిర్వహణలో ఎలాంటి లోపాలు, విమర్శలకు తావులేకుండా అత్యున్నత ప్రమాణాలతో పోటీలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమయం తీసుకుని, ఖేలో ఇండియా క్రీడల ప్రారంభోత్సవానికి హాజరుకావాల్సిందిగా ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి స్వయంగా ఆహ్వానిస్తారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నూతన క్రీడా విధానాన్ని తీసుకొచ్చి, విప్లవాత్మక నిర్ణయాలతో రాష్ట్రంలో క్రీడారంగాన్ని ముందుకు తీసుకెళ్తోందని మంత్రి వాకిటి శ్రీహరి చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రాధాన్యం కల్పిస్తున్నామని తెలిపారు. అందరి సహకారంతో ఖేలో ఇండియా క్రీడలను విజయవంతంగా నిర్వహించి తెలంగాణ ప్రతిష్ఠను మరింత పెంచుతామని పేర్కొన్నారు.

## పంద్రాగస్టు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నందున ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రతి వాహనంలో వచ్చే పిల్లలకు ఒక లైజనింగ్ అధికారి తప్పనిసరిగా ఉండేలా చూడాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పంద్రాగస్టు రోజున గౌరవ ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లు ఘనంగా ఉండాలని, ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లను పక్కాగా, వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రికి సమర్పించే పోలీసుల గౌరవ వందనం, పోలీస్ కవాతును ఆయన ఉన్నతాధికారులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, సమాచార శాఖ కమిషనర్ జి. ముకుంద రెడ్డి, అడిషనల్ డీజీపీ సంజయ్ కుమార్ జైన్, స్వాతి లక్రా, సీపీ సజ్జనార్, అడిషనల్ సీపీ తప్సీర్ ఇక్బాల్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, ఇంటెలిజెన్స్ ఓఎస్డీ కమలాసన్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ జితేందర్ రెడ్డి, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ డి.ఎస్. జగన్, చీఫ్ ఇంజనీర్ రాధా కిషన్, రీజినల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ జయ రామమూర్తి, ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్ రెడ్డి, డిస్ట్రిక్ట్ ÷ర్ ఆఫీసర్ వెంకన్న, ఆర్డీవో రామకృష్ణ, డీఈఓ యాదయ్య, ఆర్ అండ్ బి, విద్యుత్, వైద్య, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాజధాని నిర్మాణంలో మరో కీలక ఘట్టం

నిర్మాణం పూర్తయిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల భవన సముదాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. గురువారం నూతన భవన సముదాయాన్ని సీఎం చేతుల మీదుగా సాధారణ పరిపాలన శాఖ జీఏడీకి సీఆర్డీఏ అప్పగించింది. రాయపూడి వద్ద 12 టవర్లుగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాస భవన సముదాయాన్ని నిర్మించారు. ఒక్కొక్కటి 3,500 చదరపు అడుగుల వైశాల్యంతో 288 ఫ్లాట్లను సీఆర్డీఏ నిర్మించింది. అత్యాధునిక వసతులతో భవనాలను నిర్మించిన సీఆర్డీఏ.. టవర్స్ మధ్య ప్రత్యేక లాన్స్‌ను పెంచింది. అధునాతనంగా నిర్మించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఫ్లాట్లను మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్లతో కలిసి సీఎం చంద్రబాబు పరిశీలించారు. ఇక, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల భవనాల అప్పగింత అనంతరం వాటి నిర్వహణ బాధ్యతలను సాధారణ పరిపాలన శాఖ చూసుకోనుంది. అనంతరం ప్రభుత్వం నిర్ణయించే విధానానికి అనుగుణంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేటాయింపు పక్రియ చేపట్టే అవకాశం ఉంది.

## త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు

స్పష్టం చేశారు. పన్నులు, సెస్‌ల విషయంలోనూ కేంద్రం జోక్యం చేసుకోదని తెలిపారు. రాష్ట్రాలకు ఉన్న హక్కులు, అధికారాలను గౌరవిస్తూనే ఖనిజ రంగ అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందని చెప్పారు. దేశంలో మినరల్స్ ఉత్పత్తిని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని కిషన్‌రెడ్డి తెలిపారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

## సంపాదకీయం

# పార్లమెంట్‌ను అపవిత్రం చేశారు !

తిలా పాపం తలా పిడికెడు అన్నట్లుగా.....పార్లమెంటు సమావేశాలు మట్టి కరవడానికి అందరూ బాధ్యులే. 19 రోజుల పాటు ఎవరికి వారే అన్నట్లుగా వ్యవహరించి ఎన్నుకున్న ప్రజలను అవామానానికి గురి చేశారు. ప్రజలు ఎంతో నమ్మకంతో వీరిని ఎన్నుకుని పంపితే చట్టసభలను చట్టుబండలు చేస్తున్నారు. సమస్యలను చర్చించకుండా..వ్యక్తిగత ఎజెండాలతో భ్రష్టు పట్టించారు. ఇలాంటి నేతలు ప్రజల సమస్యలు పరిష్కరిస్తా రని, వారి ఆశలను పరిశీలిస్తారని అనుకోవడం బుద్ధితక్కువ తప్ప మరోటి కాదు. చట్టసభల్లో సమస్యలు చర్చించాలి. సమస్యలకు సమాధానాలు రాబట్టాలి. చట్టాలను చేయాలి. కానీ ఇవేవీ జరగకుండా విపక్షాలు అడ్డుకుంటే..అధికార పక్షం చోద్యం చూసింది. దొందూ దొందే అన్నచందంగా సమావేశాలు సాగకుండా 19 రోజుల పాటు నానా రభస సృష్టించారు. చివరి రోజు గురువారం కూడా సభలు సజావుగా సాగక పోవడంతో ఉభయ సభలను నిరవధికంగా వాయిదా వేశారు. మొత్తంగా ఈ 19 రోజులు ప్రతిపక్ష సభ్యుల ఆందోళనల మధ్య ఎటువంటి కార్యకలాపాలు జరగకుండానే వాయిదాపడ్డాయి. దీంతో పార్లమెంటు సమావేశాలు మొదలైన జులై 20 నుంచి ఇప్పటిదాకా 19 రోజులు సభా కార్యకలాపాలు తుడిచిపెట్టుకుపోయాయి. అధికార, ప్రతిపక్షాలు పట్టు వీడకపోవడంతో ఆఖరి రోజూ సజావుగా సాగలేదు. విద్యార్థుల ఆందోళనపై చర్చకు సిద్ధమని బుధవారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సవాల్ విసిరారు. చర్చకు ప్రతిపక్షం అంగీకరిస్తే పార్లమెంటు సమావేశా లను పొడిగించడానికీ సిద్ధమని కేంద్రం తెలిపింది. అయితే ఆయన లెక్చర్ వినడానికి సిద్ధంగా లేమని ప్రతిపక్షం ఆ సవాల్‌ను తోసిపుచ్చింది. బుధవారం ఉదయం 11గంటలకు లోక్‌సభ సమావేశం కాగానే ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి వచ్చి నినాదాలు చేశారు. చర్చను ప్రారంభిద్దామని మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపాదించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో సభ నిరవధికంగా వాయిదా పడింది. ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉంటే ప్రతిపక్షం పారిపోవడం తొలిసారిగా చూస్తున్నా' అని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యానించారు. నిజయోకవర్గ సమస్యలను ఎలాగూ ప ట్టించుకోవడం లేదు. అలాగే దేశ సమస్యలపైనా బాధ్యత లేదు. ప్రతిపక్షం బలంగా గళం వినిపిస్తేనే ప్రభుత్వాలు తలవంచుతాయి. ఆందోళన చేయడం కూడా ఓ రకమైన నిరసన అని చెప్పుకుని తప్పించుకోవడం మినహా విపక్షం చేసిందేమీ లేదు. పార్లమెంట్ లోపాలా, బయటా ధర్నాలు చేయడం మినహా సాధించిందేమీ లేదు. దీనికోసం ప్రజలు ఎంపిలను ఎన్నుకోలేదు. విద్యార్థుల ఆందోళనలపై ప్రభుత్వం చర్చకు సిద్ధమని చెప్పడం.. అమిత్ షా ప్రతిష్ఠ అనే గాలి బుడగ పేలిపోయాక దానిలో గాలిని నింపడానికి చేసిన చివరి ప్రయత్నంగా రాహుల్ అభివర్ణించారు. అసలు తమపై పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరపడానికి ఎవరు ఆదేశించారో తెలుసుకోవాలని యువత కోరుకుంటున్నారని రాహుల్ పట్టుపడుతూ వచ్చారు. అమిత్ షా ఉపన్యాసం వినడానికి సిద్ధంగా లేమని తేల్చి చెప్పారు. విద్యార్థుల ఆందోళనలు, వాటికి సంబంధించిన అంశాలపై చర్చకు సిద్ధంగా ఉన్నానని అమిత్ షా తెలిపారు. ప్రతిపక్షాలు చర్చను కోరుతూ లోక్‌సభ స్పీకరుకు లేఖ ఇవ్వాలని, వారు అడిగే అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇస్తానని ఆయన స్పష్టం చేశారు. మొత్తం చర్చలో తాను పాల్గొంటానని తేల్చి చెప్పారు. చర్చ నుంచి తాను పారిపోతున్నా నన్న ప్రతిపక్షాల ఆరోపణలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన స్పీకర్‌కు లేఖ రాశారు. ప్రతిపక్షాలతో సంప్రదించి విద్యార్థుల ఆందోళనలపై చర్చ చేపట్టాలని కోరారు. కానీ విపక్షం చర్చకు సిద్ధంగా లేదని తేలిపోయింది. కేవలం బలప్రదర్శన వేదికగా వర్షాకాల సమావేశాలు నిలిచాయి. విపక్షాలు బలంగా ఉన్నాయని చాటి చెప్పడానికి ప్రయత్నించారు. ప్రధానంగా విదేశీ విరాళాల సవరణ బిల్లును అడ్డుకోవడం కోసం చేసిన ప్రయత్నం ఫలించింది. ప్రజలు ఇప్పుడు ఆలోచించాల్సిన సమయం వచ్చింది. ఉభయ సభలు ఈ వర్షాకాల సమావేశాల్లో సజావుగా జరగకూడదన్న విపక్షం ఎజెండా విజయం సాధించింది. పార్లమెంటులో విపక్షాల నినాదాలు, పోడియంలోకి దూసుకుని రావడం, స్పీకర్ ఓంబిర్లా వారించడం నిత్యకృత్యంగా మారాయి. దీంతో సమావేశాలను విపక్ష పార్టీలు కావాలనే స్తంభింపచేసాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే అధికార పార్టీ సభ్యులు కూడా ఈ సమావేశాల్లో మకరద్వారం వద్ద ప్రతిపక్షాలను నిలదీస్తూ 'రాహుల్ గాంధీ జవాబ్ దో..' అని నినాదాలు చేశారు. అయితే ఇవేవీ ప్రజలకు ఉపయోగపడే వ్యవహారాలు కావు. అటు అధికార పార్టీ, ఇటు విపక్ష పార్టీలు రెండూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయనడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదు. నినాదాలు చేస్తున్న పాలక, ప్రతిపక్ష సభ్యుల తీరును ప్రజలు గమనించారు. ఎవరేంటో తెలుసుకుంటున్నారు. వీరితీరుపైనా జెన్‌జీలు దృష్టి సారించాలి. బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న నాయకులను కనిపెట్టాలి. లేకుంటే పార్లమెంట్ సమావేశాలకు అర్థం లేకుండా పోతుంది. ఇలా 19 రోజులు సభలను వృధా చేసినందుకు నేతల జీతభత్యాలను కట్ చేయాలి. వారికి తగిన ఫైన్ వేయాలి. అప్పుడే నేతల్లో జవాబుదారీతనం వస్తుంది.

## ఆశా కార్యకర్తలపై వేధింపులు..

**- పీహెచ్‌సీ వైద్యాధికారిపై 31 మంది ఆశా వర్కర్లు ఫిర్యాదు!**

**- 20 ఏళ్లుగా సేవలందిస్తున్న తమను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆరోపణ**



గుండాల ఆగస్టు 13(విజన్ ఆంధ్ర): గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉన్నతాధికారులను ఆశ్రయించారు. పీహెచ్‌సీలో పనిచేస్తున్న 31 మంది ఆశా కార్యకర్తలు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ ఫిర్యాదు చేసినట్లు సమాచారం. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆశా కార్యకర్తలు కీలకపాత్ర పోషిస్తున్నారు. సుమారు 20 ఏళ్లుగా వైద్య ఆరోగ్యశాఖకు సేవలందిస్తున్న తమపై ప్రస్తుతం పని ఒత్తిడి, మానసిక వేధింపులు పెరిగాయని వారు ఆవేదన వ్యక్తం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

విధుల నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు

గుండాల పీహెచ్‌సీకి సంబంధించిన విధుల నిర్వహణలో తమకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు, తమపై ఒత్తిడి పెంచుతున్నారని ఆశా కార్యకర్తలు ఆరోపించారు. దీంతో విధులు నిర్వహించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.

ఉన్నతాధికారులు స్పందించాలి

తమ ఫిర్యాదుపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేపట్టి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఆశా కార్యకర్తలు కోరుతున్నారు. గ్రామీణ ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న తమ సమస్యలను పరిష్కరించి, విధులను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## సీఎం సభను విజయవంతం చేసేందుకు సమన్వయంతో పనిచేయాలి - కలెక్టర్ ప్రతీక్ జైన్



సంగారెడ్డి, డెస్క్ విజన్ ఆంధ్ర ఆగస్టు 13: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈ నెల 15న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్న నేపథ్యంలో, సంగారెడ్డి జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొనే బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. గురువారం సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియం, మున్సిపల్ కార్యాలయ పరిసరాల్లో సభ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐఎస్డబ్ల్యూఎస్ అధికారులు, ఇతర శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఈ నెల 15న సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నందున, కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సభకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, స్మార్ట్ రేషన్ కార్డుల లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నందున, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. సభా ప్రాంగణంలో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, సీటింగ్ ఏర్పాట్లు, పార్కింగ్, విద్యుత్, రాకపోకల మార్గాలు తదితర అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. శాఖల వారీగా అప్పగించిన విధులు, బాధ్యతలను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ప్రయాణించే రూట్‌తో పాటు సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ట్రాఫిక్ నిర్వహణ, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఐఎస్డబ్ల్యూ ఎస్పీ, డీఎస్పీ హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, సభా వేదిక, ముఖ్యమంత్రి ప్రయాణించే రూట్, రాకపోకల మార్గాలు, సభా ప్రాంగణం తదితర అంశాలలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన పూర్తయ్యే వరకు అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండి, పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, అడిషనల్ కలెక్టర్ పాండు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు, పోలీసు అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వరంగల్ టెక్స్ టైల్ పార్కులో ఇద్దరు మృతి



వరంగల్ న్యూస్ ( విజన్ ఆంధ్ర ) : వరంగల్ టెక్స్ టైల్ పార్కులో ప్రమాదవశాత్తు ఇద్దరు కార్మికులు మృతి చెందారు. గీసుకొండలోని కాకతీయ టెక్స్ టైల్లో బుధవారం అర్ధరాత్రి ప్రమాదం జరిగింది. గణేశా ఏకోపెట్ కంపెనీలో షార్ట్ సర్క్యూట్ తో బాయిలర్ పేలినట్లు సమాచారం. ప్రమాద సమయంలో లిఫ్టులో చిక్కుకున్న ఉత్తరప్రదేశ్ కు చెందిన సాంకేతిక నిపుణులు అభిలాష్ (30), సూర్య ప్రకాశ్ (31) మృతి చెందారు. గీసుకొండ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

## హర్ ఘర్ తిరంగా

### హైదర్‌నగర్‌లో బైక్ ర్యాలీ



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆగస్టు 13 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా హైదర్‌నగర్ డివిజన్‌లో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. డివిజన్ బీజేపీ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీని డివిజన్ ఇన్‌చార్జి ఏ.గోపాలరావు జాతీయ జెండా ఊపి ప్రారంభించారు. జాతీయ జెండాలను చేతబూనిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనాలపై ర్యాలీలో పాల్గొన్నారు. దేశభక్తి నినాదాలతో హైదర్‌నగర్ పరిసరాలు మారుమోగాయి. డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీల మీదుగా ర్యాలీ సాగగా.. పలుచోట్ల స్థానికులు స్వాగతం పలికారు. జాతీయ సమైక్యత, దేశభక్తి స్ఫూర్తిని ప్రజల్లో పెంపొందించడంతోపాటు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ప్రతి ఇంటికీ చేరువ చేయాలనే ఉద్దేశంతో ర్యాలీ నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శులు బాబు, కృష్ణ, రంగారెడ్డి జిల్లా అర్బన్ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు సీతారామరాజు, డివిజన్ ఉపాధ్యక్షులు నర్సింగ్‌రాజు, నీలకంఠ అంబాదాసు, బాలాజీ, జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు బద్రి, డివిజన్ కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు అందేలా చర్యలు తీసుకోవాలి

**- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



కొత్తకోట ఆగస్టు 13 (విజన్ ఆంధ్ర): కొత్తకోట: మడల పరిదిలోనిఅమడబాకులలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి గురువారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులు, విద్యా బోధన, నిర్వహణ తీరును ఆయన పరిశీలించారు. ముందుగా కళాశాలలోని స్టాక్ రూమ్‌ను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న నిత్యావసర సరుకుల నాణ్యత, నిల్వలు, సరఫరా వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేసిన ఆయన, సరుకులకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేసి నిర్వహించాలన్నారు. అనంతరం కళాశాలలోని భోజనశాలను సందర్శించిన కలెక్టర్, అక్కడి పరిశుభ్రత, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా చూడాలని, భోజనశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖిగా మాట్లాడి కళాశాలలో అందుతున్న విద్య, వసతులు, భోజనం, ఇతర సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు కళాశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించేలా స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కళాశాలలో నెలకొన్న విద్యుత్ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, విద్యార్థుల సౌకర్యార్థం ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, విద్యుత్ సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటుకు కూడా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థుల విద్యా ప్రగతితో పాటు వారి ఆరోగ్యం, భద్రత, సౌకర్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాయత్రి అనిల్ యాదవ్. ఈ డి ఎస్ సి కార్పొరేషన్ సిరాజుద్దీన్, ఇతర అధికారులు తదితరులు, కలెక్టర్ వెంట ఉన్నారు.

## మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

**- బి ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి**



కొత్తకోట ఆగస్టు 13 (విజన్ ఆంధ్ర): కొత్తకోట : రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తూ స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికంగా రాణించాలని ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి అన్నారు. గురువారం మండల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల మహిళా సమైక్య సర్వసభ్య సమావేశంలో ఇందిరా మహిళా శక్తి 23వ వార్షిక మహాసభ సమావేశంలో పాల్గొని దేవరకద్ర ఎమ్మెల్యే శ్రీ జి. మధుసూదన్ రెడ్డి మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా సంఘాలను కేవలం పొదుపు సంఘాలుగా చూడటం లేదని వారిని ఆర్థిక శక్తిగా, వ్యాపార శక్తిగా తీర్చిదిద్దాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలు సొంతంగా వ్యాపారాలు, ఉపాధి కార్యక్రమాలు చేపట్టి ఆర్థికంగా ఎదిగేలా ప్రోత్సహిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. మహిళా సంఘాలకు బ్యాంకు రుణ లింకేజీ, వడ్డీ లేని రుణాలు అందిస్తూ వారి ఆర్థిక అవసరాలకు అండగా నిలుస్తున్నామని, మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు మంచి మార్కెట్ లభించేలా నైపుణ్య శిక్షణ, బ్రాండింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ సదుపాయాలను కల్పిస్తున్నామని, మహిళలు వారి ఉత్పత్తులను అమ్ముకోవడానికి శిల్పారామంలో స్టాల్స్ ఏర్పాటు చేశామని వివరించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మినీ ఇండస్ట్రియల్ పార్కులు, కామన్ ప్రాసెసింగ్ సెంటర్లు ఏర్పాటు చేయడం ద్వారా మహిళలకు స్థానికంగానే ఉపాధి, ఆదాయ అవకాశాలు పెంచుతున్నామని అన్నారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు మహిళా శక్తి క్యాంటీన్లు, అలాగే అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణలో మహిళా సంఘాలను భాగస్వాములను చేశామని, పాఠశాల యూనిఫాంల కుట్టు పనులు కూడా మహిళా సంఘాలకు అప్పగించడం ద్వారా వారికి నిరంతర ఉపాధి కల్పిస్తున్నామని చెప్పారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలన్నదే మా ప్రభుత్వ ఆలోచనని అందుకే ఆర్టీసీ బస్సుల నిర్వహణ, యాజమాన్య అవకాశాలు కూడా మహిళా సంఘాలకు కల్పించామని, ఇందిరమ్మ ఇండ్లు కూడా మహిళల పేరు మీద ఇచ్చామని అన్నారు. మహిళా సంఘాల సభ్యులకు ప్రమాద బీమా, రుణ బీమా వంటి సామాజిక భద్రత కల్పించి వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. మహిళలు ఎదిగితే కుటుంబాలు ఎదుగుతాయని.. కుటుంబాలు ఎదిగితే గ్రామాలు, సమాజం అభివృద్ధి చెందుతాయని తెలిపారు, అందులో భాగంగానే కొత్తకోట మండలంలోని మిరాసి పల్లి వద్ద మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ప్రారంభించమని తెలిపారు. వి ఏ ఓ ల జీతాల పెంపుకు సంబంధించి అసెంబ్లీలో ప్రస్తావిస్తానని ఆయన తెలిపారు.

## సిరిసిల్ల నుంచి సర్ధాపూర్ గోదాంలోకి ఈవీఎంల తరలింపు

**- 2018 వేములవాడ ఎన్నికల కేసు ముగియడంతో ఈవీఎంల తరలింపు**

**- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో.. పటిష్ట పోలీస్ బందోబస్తు మధ్య ప్రక్రియ**



రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 13 (విజన్ ఆంధ్ర బ్యూరో): 2018 వేములవాడ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన కోర్టు కేసు కారణంగా ఇంతకాలం సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక భద్రతలో ఉంచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంల)ను గురువారం సర్ధాపూర్‌లోని ఈవీఎం గోదాంలోకి తరలించారు. కోర్టు కేసు ముగియడంతో రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి అనుమతులు లభించిన అనంతరం, ఎన్నికల నిబంధనలు, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఈవీఎంల తరలింపు ప్రక్రియ చేపట్టారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఈ ప్రక్రియను పరిశీలించి, ఈవీఎంల భద్రత, భద్రపరిచే విధానంపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 2018 వేములవాడ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన కోర్టు కేసు కారణంగా సంబంధిత ఈవీఎంలను సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేకంగా భద్రపరిచినట్లు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతుల మేరకు ప్రస్తుతం వాటిని సర్ధాపూర్ ఈవీఎం గోదాంలోకి తరలించినట్లు వెల్లడించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో, పటిష్టమైన పోలీస్ బందోబస్తు మధ్య తరలింపు ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, వేములవాడ ఆర్డీఓ కె.ఎస్.బి. కుమారి, తహసీల్దార్లు మహేష్ కుమార్, జయంత్, ఎన్నికల విభాగం నాయబ్ తహసీల్దార్ రెహమాన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏఐ యుగానికి అనుగుణంగా విద్యార్థులు సిద్ధం కావాలి

### సీఎంఆర్‌సీఈటీలో ఘనంగాద ప్రథమ సంవత్సరం ఓరియంటేషన్ కార్యక్రమం






మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆగస్టు 13 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల వేగవంతమైన అభివృద్ధికి అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని మల్లారెడ్డి సూచించారు. సీఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సి ఎం ఆర్ సి ఈ టి లో ప్రథమ సంవత్సరం బీటెక్ విద్యార్థుల కోసం గురువారం నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కళాశాలలో అడుగుపెడుతున్న విద్యార్థులకు విద్యా విధానం, క్యాంపస్ వాతావరణం, క్రమశిక్షణ, అందుబాటులో ఉన్న సదుపాయాలు, వివిధ విద్యా సహపాఠ్య అవకాశాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా నిలిచింది. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత ప్రపంచంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, ఇతర అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా విద్యార్థులు కొత్త సాంకేతిక పరిజ్ఞానాలను నిరంతరం నేర్చుకోవాలని సూచించారు. పరిశ్రమ అవసరాలను అర్థం చేసుకుని, సాంకేతిక నైపుణ్యాలతో పాటు సమస్య పరిష్కార సామర్థ్యం, సృజనాత్మక ఆలోచన, కమ్యూనికేషన్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థి జీవితంలో క్రమశిక్షణ, సమయపాలన, క్రమం తప్పకుండా తరగతులకు హాజరు కావడం, మంచి కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించుకోవడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. కళాశాలలో అందుబాటులో ఉన్న ప్రయోగశాలలు, గ్రంథాలయం, క్లబ్బులు, శిక్షణా కార్యక్రమాలు, ఇతర అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టీమ్‌వర్క్, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడం భవిష్యత్తు కెరీర్‌కు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్ రావు, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, కళాశాల నియమ నిబంధనలు, విద్యార్థుల బాధ్యతలను వివరించారు. క్రమశిక్షణతో కూడిన ప్రవర్తన, బాధ్యతాయుతమైన వైఖరి, మంచి హాజరు శాతం విద్యార్థుల విద్యా ప్రగతిలో కీలకమని అన్నారు. కళాశాల మార్గదర్శకాలను పాటిస్తూ, సానుకూలమైన విద్యా వాతావరణాన్ని నిర్మించడంలో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని సూచించారు. ప్రథమ సంవత్సరం హెచ్‌ఓడీ చంద్రశేఖర్, పరీక్షల విధానం, డ్రెస్ కోడ్, అకడమిక్ క్రెడిట్స్, విద్యా ప్రమాణాలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలను విద్యార్థులకు వివరించారు. మొదటి సంవత్సరం నుంచే విద్యార్థులు తమ అకడమిక్ ప్రగతిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పరీక్షల విధానం మరియు క్రెడిట్ సిస్టమ్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నిర్ణయించిన డ్రెస్ కోడ్‌ను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.

సాంకేతికతతో పాటు వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యం.

సీఎంఆర్‌సీఈటీలో విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను కూడా ఈ సందర్భంగా విద్యార్థులకు పరిచయం చేశారు. ఎన్ఎస్ఎస్ ఎన్ ఎస్ ఎస్, ఎన్‌సీసీ, వంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, టీమ్‌వర్క్, ఆత్మవిశ్వాసం, సామాజిక బాధ్యత వంటి గుణాలను పెంపొందించుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా సాంకేతిక, సాంస్కృతిక, క్రీడా, క్లబ్ కార్యకలాపాలు, ఇతర సహపాఠ్య కార్యక్రమాల్లో విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని నిర్వాహకులు సూచించారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు కళాశాల అందిస్తున్న అవకాశాలను వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

**విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకంగా ఓరియంటేషన్:**

ఈ ఓరియంటేషన్ కార్యక్రమం ద్వారా ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సీఎంఆర్‌సీఈటీలోని విద్యా విధానం, కళాశాల నియమ నిబంధనలు, అకడమిక్ బాధ్యతలు, క్యాంపస్‌లో అందుబాటులో ఉన్న అవకాశాలపై సమగ్ర అవగాహన ఏర్పడింది. ముఖ్య అతిథులు, ప్రిన్సిపాల్, హెచ్‌ఓడీ మరియు అధ్యాపకులు అందించిన మార్గదర్శకాలు విద్యార్థులకు తమ ఇంజినీరింగ్ విద్యా ప్రయాణాన్ని ఆత్మవిశ్వాసంతో ప్రారంభించేందుకు ప్రేరణగా నిలిచాయి. ఏఐ ఆధారిత భవిష్యత్తు ప్రపంచానికి విద్యార్థులను సిద్ధం చేయడంతో పాటు, విద్యా ప్రమాణాలు, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వడం ఈ ఓరియంటేషన్ కార్యక్రమం ప్రత్యేకతగా నిలిచింది.

# ఆయిల్ పామ్ సాగుతో రైతుల ఆదాయం పెంపునకు చర్యలు

**- కలెక్టర్ రాజర్షి షా**



ఆదిలాబాద్, ఆగస్టు 13 (విజన్ ఆంధ్ర): జిల్లాలో సాంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా అధిక లాభదాయకమైన పంటల సాగును ప్రోత్సహించేందుకు యంత్రాంగం చర్యలు ముమ్మరం చేసింది. పంట వైవిధ్యీకరణలో భాగంగా ఆయిల్ పామ్ సాగు విస్తరణపై జిల్లా కలెక్టర్ రాజర్షి షా గురువారం కలెక్టరేట్ ఛాంబర్‌లో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు భూగర్భ జలాల సంరక్షణకు అనుకూలమైన పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఆయిల్ పామ్ సాగుకు అనువైన మండలాల్లో నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా విస్తీర్ణాన్ని పెంచాలని స్పష్టం చేశారు. రైతులు ఈ సాగు వైపు మళ్లేలా గ్రామస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలు, దీర్ఘకాలిక ఆదాయ అవకాశాలను రైతులకు వివరించాలని చెప్పారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి తోటల స్థాపనను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, ఉద్యానవన శాఖ అధికారి జి. సందీప్ కుమార్, ఉద్యానవన అధికారులు క్రాంతి కుమార్, అలేఖ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బిజెపి నాయకులు అవగాహన లేకుండా ఆరోపణలు చేయడం సరైనది కాదు

**- టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు గాదే సత్యం**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి 13,(విజన్ ఆంధ్ర )ం: మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు పై భారతీయ జనతా పార్టీ నాయకులు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు గాదెసత్యం అన్నారు. గురువారం మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు మంచిర్యాల నియోజకవర్గంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని, ఆ అభివృద్ధిని బిజెపి నాయకులు జీర్ణించుకోలేక నిందారోపణలు చేయడం హాస్యాస్పదమన్నారు. మంచిర్యాల నియోజకవర్గ ప్రజలకు, రైతాంగానికి కష్టాలు వచ్చినప్పుడు ఏనాడైనా బిజెపి నాయకులు ఆదుకున్న పాపాన పోలేదని విమర్శించారు. ఆనాడు మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు హయంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి రఘునాథ్ అమెరికాలో ఉన్నారని, ఇక్కడ అభివృద్ధి సంక్షేమం తనకెలా తెలుస్తుంది అన్నారు. ఆనాడు ముల్కల నుండి చెల్లంపేట వరకు దివాకర్ రావు నేతృత్వంలో పాదయాత్ర చేయడం జరిగిందని, వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు కృషి వల్లనే ఎల్లంపల్లి ప్రాజెక్టు సాధించగలిగారని గుర్తు చేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు వల్ల తెలంగాణకే బ్రాండ్ అంబాసిడర్ సాధించిన ఘనత దివాకర్ రావుకే దక్కుతుంది అన్నారు. నియోజకవర్గం లో అభివృద్ధి సంక్షేమం పై బీజేపీ నాయకులకు అవగాహన లేకుండా వ్యాఖ్యలు చేయడం సబబు కాదన్నారు.అప్పటి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 20 టీఎంసీల సామర్థ్యం గల ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. బిజెపి నాయకులు ఆదానీ అంబానీకే వత్తాసు పలుకుతున్నారని, ఏది మాట్లాడిన భారత మాత కి జై, జై హింద్ అని అనడం ఒకటే తెలుసు అన్నారు. తామంతా భారతీయులమని, అంతేకాకుండా హిందూ భావజాలం కలిగిన వారమేనని అది బిజెపి నాయకులు సైతం గుర్తుంచుకోవాలన్నారు. బీజేపీ నాయకులు పూర్తిగా కాంగ్రెస్ నాయకులకు వత్తాసు పలికినట్లే ఉందని ఎద్దేవా చేశారు. 12 సంవత్సరాలుగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వమే అధికారంలో ఉందని కనీసం మంచిర్యాల నియోజకవర్గానికి ఎన్ని నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేశారో చూపాలని సవాలు విసిరారు.ఇప్పటికైన దివాకర్ రావుపై ఆరోపణలను చేయడం మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో టిఆర్ఎస్ నాయకులు గోవుల రవీందర్ రెడ్డి కార్పొరేటర్లు శ్రీనివాస్ అబ్దుల్ సత్తార్ తోట తిరుపతి పడాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సీసీఐ సాధన దీక్షలో మాజీ మంత్రి జోగు రామన్న సందడి.. మహిళలతో కలిసి బతుకమ్మ స్టెప్పులు



ఆదిలాబాద్, ఆగస్టు 13 (విజన్ ఆంధ్ర): ఆదిలాబాద్ సీసీఐ పరిశ్రమ పునర్ ప్రారంభం లక్ష్యంగా సీసీఐ సాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు ఐదో రోజుకు చేరుకున్నాయి. గురువారం మహిళా సంఘాల ప్రతినిధులు దీక్షా శిబిరంలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ దీక్షా శిబిరాన్ని సందర్శించిన మాజీ మంత్రి జోగు రామన్న.. మహిళలతో కలిసి బతుకమ్మ పాటలకు ఉత్సాహంగా అడుగులు వేస్తూ శిబిరంలో ఉద్యమ స్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదిలాబాద్ యువతకు స్థానికంగా ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో జరుగుతున్న ఈ ఉద్యమానికి ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని కోరారు. దీన్ని రాజకీయ కోణంలో చూడటం సరికాదన్నారు. కొందరి రాజకీయ కుట్రలను విడనాడి, సీసీఐ పునర్ ప్రారంభం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. పరిశ్రమ మళ్లీ తెరుచుకునే వరకు నిరసనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ మహిళా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విజయ డైరీ పునరుద్ధరణకు త్వరలో చర్యలు

**- పాడి రైతులకు అండగా నిలిచి, పాల ఉత్పత్తిని పెంచాలి**

**- కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**

**- రోజుకు 15 వేల లీటర్ల పాల సేకరణ లక్ష్యంగా కార్యాచరణ**



హనుమకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 13 ( విజన్ ఆంధ్ర ): విజయ డైరీ పునరుద్ధరణకు త్వరలోనే చర్యలు చేపడతామని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. రైతులు పశుపోషణపై దృష్టి సారించడం ద్వారా వ్యవసాయంతో పాటు నిరంతర ఆదాయాన్ని పొందవచ్చని, రైతులు తమ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన పశువులను స్వయంగా ఎంపిక చేసుకోవడం ద్వారా పాడి పరిశ్రమను మరింత అభివృద్ధి చేసుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ విజయ డైరీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పాల సేకరణ కేంద్రం, పాల శీతలీకరణ కేంద్రం, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు, పాలు పరీక్షించే ప్రయోగశాలను పరిశీలించి, అక్కడి కార్యకలాపాలు, పాల సేకరణ, నాణ్యతా ప్రమాణాలు, పాల ఉత్పత్తుల తయారీ తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాడి రైతుల సంక్షేమ సంఘం సభ్యులు, రైతులు, బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు పశువులను పోషించడం ద్వారా నిరంతర ఆదాయం పొందడంతో పాటు ప్రజలకు నాణ్యమైన, స్వచ్ఛమైన పాలను అందించడంలో భాగస్వాములు కావచ్చని అన్నారు. విజయ డైరీతో పశుసంవర్ధక శాఖను అనుసంధానం చేసి, పాడి రైతులకు ఆధునిక పశుపోషణ పద్ధతులు, పశువుల ఎంపిక, పశువైద్య సేవలు, పాల ఉత్పత్తి పెంపు తదితర అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇందుకోసం సంబంధిత శాఖల అధికారులతో త్వరలోనే సమన్వయ సమావేశం నిర్వహించి కార్యాచరణ రూపొందిస్తామని కలెక్టర్ తెలిపారు.ప్రజలకు మరింత నాణ్యమైన, స్వచ్ఛమైన పాలను అందించే దిశగా విజయ డైరీ కృషి చేయాలని సూచించారు. ఎలాంటి రసాయనాలు కలపకుండా స్వచ్ఛమైన పాలను అందించేందుకు విజయ డైరీ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. విజయ డైరీకి పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు పాలతోపాటు నెయ్యి, పన్నీరు తదితర ఇతర పాల ఉత్పత్తులను విస్తృతంగా తయారు చేసేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యంత్రాలు, మౌలిక వసతులను సమకూర్చేందుకు చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు.విజయ డైరీ డిప్యూటీ డైరెక్టర్ ధనరాజ్ మాట్లాడుతూ, ప్రస్తుతం రోజుకు సుమారు 6 వేల లీటర్ల పాలను ప్రాసెసింగ్ చేస్తున్నామని తెలిపారు. 26 సొసైటీల ద్వారా పాలను సేకరించి, పాలతోపాటు ఇతర పాల ఉత్పత్తులను విజయ డైరీ ద్వారా తయారు చేసి, డిస్ట్రిబ్యూటర్ల ద్వారా మార్కెట్‌లో విక్రయిస్తున్నామని వివరించారు.గతంలో విజయ డైరీ ద్వారా నెయ్యి, పన్నీరు తదితర పాల ఉత్పత్తులను విస్తృతంగా తయారు చేసి అందించేవారమని, పాల సేకరణ తగ్గిపోవడంతో ఉత్పత్తి సామర్థ్యం కూడా గణనీయంగా తగ్గిందని తెలిపారు. రైతులు పశుపోషణపై మరింత దృష్టి సారించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.విజయ డైరీ ద్వారా రోజుకు 15 వేల లీటర్ల పాల సేకరణ లక్ష్యాన్ని చేరుకునేలా రైతులను పాడి పరిశ్రమ వైపు ప్రోత్సహించేందుకు కార్యాచరణ చేపడుతున్నామని డిప్యూటీ డైరెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో కాకతీయ విజయ డైరీ సొసైటీ చైర్మన్ ఎరుపు దేవేందర్, కమిటీ సభ్యులు సమ్మయ్య, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ చైతన్య, యూనియన్ బ్యాంక్ మేనేజర్ సత్యసాయి, పాడి రైతులు, డిస్ట్రిబ్యూటర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యం ఆపాలి.. ఇందిరమ్మ ఇళ్లు, రోడ్లు నిర్మించాలి

**- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న**



ఉట్నూర్, ఆగస్టు 13 (విజన్ ఆంధ్ర): ఉట్నూర్ మండల కేంద్రంలోని హీరాపూర్ (జే) గ్రామపంచాయతీలో ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యాన్ని ఆపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న డిమాండ్ చేశారు. గురువారం ఆయా గ్రామాల్లో పర్యటించిన ఆయన మీడియాతో మాట్లాడారు. గ్రామస్తుల సంక్షేమం కోసం ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యంగా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. నిరుపేదలకు ఇళ్లు కట్టుకునే ఆర్థిక స్తోమత లేకపోవడంతో కాంట్రాక్టర్ల ద్వారా పనులు చేస్తుంటే అడ్డుకోవడం సరికాదన్నారు. అలాగే, గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేక వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం వ్యక్తం చేశారు. మంజూరైన రోడ్డు పనులను కూడా ఫారెస్ట్ అధికారులు నిలిపివేశారని తెలిపారు. వాగు ఉప్పొంగడంతో గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయని, వెంటనే ప్రభుత్వం చొరవ తీసుకొని ఇళ్ల నిర్మాణాలకు అనుమతినివ్వాలని, రోడ్లు, త్రీఫేస్ కరెంటు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ట్యాగ్స్ ఉట్నూర్ మండల నాయకులు మల్కు, బాదీరావు సుంగు, జంగు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి - ఎస్పీ డి.జానకి

**"సురక్షా కా తిరంగా అప్రమత్తంగా ఉండండి, అవగాహనతో ఉండండి, సైబర్ భద్రతగా ఉండండి"**






ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర,ఆగస్టు 13: సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు మహబూబ్‌నగర్ రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్.వి.డి.సి కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ సైబర్ భద్రతా బ్యూరో సంచాలకురాలు శ్రీమతి శిఖా గోయల్, ఐ.పి.ఎస్ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ శ్రీమతి డి.జానకి, ఐ.పి.ఎస్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో మొబైల్ ఫోన్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, సామాజిక మాధ్యమాలు, డిజిటల్ చెల్లింపుల వినియోగం పెరిగిందని తెలిపారు. ఇదే అదునుగా సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత సైబర్ నేరాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నకిలీ పెట్టుబడి పథకాలు, వాటా మార్కెట్ వ్యాపారం పేరుతో మోసాలు, పార్శిల్ మోసం, రుణ యాప్ మోసాలు, క్యూఆర్ కోడ్ మోసాలు, ఆన్‌లైన్ ఉద్యోగాల పేరుతో మోసాలు, సామాజిక మాధ్యమాల ద్వారా మోసాలు, "డిజిటల్ అరెస్ట్" వంటి సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అధిక లాభాలు వస్తాయని చెప్పే అనుమానాస్పద పెట్టుబడి పథకాలను నమ్మవద్దని తెలిపారు. ఏదైనా సంస్థ, యాప్ లేదా వ్యక్తి ద్వారా పెట్టుబడి ప్రతిపాదన వచ్చినప్పుడు, ఆ సంస్థకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా, అధికారిక వెబ్‌సైట్ లేదా యాప్ నిజమైనదేనా, సంబంధిత ఆర్థిక నియంత్రణ సంస్థల అనుమతులు ఉన్నాయా అనే విషయాలను ముందుగా నిర్ధారించుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పేవారిని నమ్మి డబ్బులు చెల్లించవద్దని, లాటరీ, బహుమతి, నగదు తిరిగి చెల్లింపు, వినియోగదారుల సేవా కేంద్రం పేర్లతో వచ్చే అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలు, లింకుల విషయంలో జాగ్రత్త వహించాలని సూచించారు. "డిజిటల్ అరెస్ట్" పేరుతో సైబర్ నేరగాళ్లు వీడియో కాల్స్ చేసి పోలీసులు, సి.బి.ఐ, ఇ.డి లేదా కోర్టు అధికారులమని చెప్పి భయపెట్టి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. పోలీసులు ఎప్పుడూ వీడియో కాల్ ద్వారా ఎవరినీ అరెస్ట్ చేయరని స్పష్టం చేశారు. ఇలాంటి కాల్స్ వస్తే భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని కోరారు. బ్యాంకు ఖాతా సంఖ్యలు, ఒకసారి మాత్రమే వినియోగించే సంకేత సంఖ్య, యు.పి.ఐ గుప్త సంకేతం, ఏటీఎం కార్డు వివరాలు, రహస్య సంకేతాలు వంటి వ్యక్తిగత మరియు ఆర్థిక సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. తెలియని లింకులపై క్లిక్ చేయవద్దని, అనుమానాస్పద యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దని విద్యార్థులకు సూచించారు. సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ సహాయ కేంద్రానికి ఫోన్ చేయాలని ఎస్పీ సూచించారు. అలాగే జాతీయ సైబర్ నేరాల ఫిర్యాదు పోర్టల్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయాలని తెలిపారు. మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన నగదును నిలిపివేసి తిరిగి పొందే అవకాశాలు పెరుగుతాయని వివరించారు. అనంతరం తెలంగాణ సైబర్ భద్రతా బ్యూరో రూపొందించిన సైబర్ భద్రత అవగాహన వీడియోలను విద్యార్థులకు ప్రదర్శించారు. సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న తాజా విధానాలు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైబర్ నేరం జరిగినప్పుడు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమం ముగింపులో "సురక్షా కా తిరంగా అప్రమత్తంగా ఉండండి, అవగాహనతో ఉండండి, సైబర్ భద్రతగా ఉండండి" అనే సందేశంతో కూడిన పోస్టర్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో రెండవ పట్టణ ఇన్‌స్పెక్టర్ ఇజాజ్‌ఉద్దీన్, సైబర్ నేరాల ఉప-పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్ కుమార్ తో పాటు ఇతర పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఉప్పల్‌లో రేణుక ఎల్లమ్మ బోనాల జాతరకు సర్వం సిద్ధం

**- ఈ నెల 16న వైభవంగా వేడుకలు**

**- భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలి: శ్రీధర్ గుప్తా**




కాప్రా/ఆగస్టు 13 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): ఉప్పల్‌లోని శ్రీ.శ్రీ. రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో ఈ నెల 16న(ఆదివారం ) బోనాల జాతరను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు బీజేపీ సీనియర్ నాయకులు శ్రీధర్ గుప్తా తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు, బోనాల సమర్పణ తదితర కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు.

**అమ్మవారి సేవలో భక్తులు**

బోనాల పండుగను పురస్కరించుకుని మహిళలు, భక్తులు సంప్రదాయబద్ధంగా బోనాలు సమర్పించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పరిసర కాలనీల ప్రజలు, భక్తులు కుటుంబ సమేతంగా హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని శ్రీధర్ గుప్తా కోరారు.

**భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు**

జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. బోనాల జాతరను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల జాతరను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# అభివృద్ధి పనులకు వేగం.. ట్రాఫిక్ కష్టాలకు చెక్!

- మహదేవపురం యానిమల్ కేర్ సెంటర్‌లో రక్షణ గోడ పనుల పరిశీలన

- వెటర్నరీ విభాగానికి కేటాయించిన 20 ఎకరాల అభివృద్ధిపై అధికారులతో సమీక్ష




కుత్బుల్లాపూర్, ఆగస్టు 13 (విజన్ ఆంధ్ర): మహదేవపురంలోని యానిమల్ కేర్ సెంటర్ వద్ద కొనసాగుతున్న కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జవీజ) జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ గురువారం పరిశీలించారు. వెటర్నరీ విభాగం అవసరాల కోసం ప్రభుత్వం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు కేటాయించిన 20 ఎకరాల భూమిలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**పనుల్లో నాణ్యత తప్పనిసరి**

రక్షణ గోడ నిర్మాణ పనులను పరిశీలించిన జోనల్ కమిషనర్.. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యానిమల్ కేర్ సెంటర్‌లో అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై కూడా అధికారులతో సమీక్షించారు.

**సిక్కు బస్తీగాజులరామారం రహదారి పరిశీలన**

అనంతరం సిక్కు బస్తీ నుంచి గాజులరామారం జంక్షన్ వరకు ఉన్న 100 అడుగుల రహదారిని పింకేష్ కుమార్ పరిశీలించారు. ఈ మార్గంలో ట్రాఫిక్ పరిస్థితి, వాహనాల రాకపోకలు, రహదారి విస్తరణకు ఉన్న అవకాశాలను అధికారులతో చర్చించారు.

**ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు చర్యలు**

ప్రాంతంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించి వాహనాల రాకపోకలను సులభతరం చేసేందుకు రహదారి విస్తరణ పనులను చేపట్టాల్సిన అవసరం ఉందని జోనల్ కమిషనర్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

**తక్షణమే డీపీఆర్ సిద్ధం చేయాలి**

సిక్కు బస్తీగాజులరామారం జంక్షన్ మధ్య రహదారి విస్తరణకు సంబంధించి లిలిడిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (ఞూ=)లిలిను తక్షణమే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రహదారి విస్తరణకు అవసరమైన సాంకేతిక అంశాలు, ప్రతిపాదిత పనులు, వ్యయ అంచనాలను సమగ్రంగా పొందుపరిచి డీపీఆర్ రూపొందించాలని సూచించారు.

**మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి**

మహదేవపురం నుంచి గాజులరామారం పరిధిలో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జోనల్ కమిషనర్ సూచించారు. రహదారి విస్తరణతో భవిష్యత్తులో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు మరింత సులభతరం అయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్‌తో పాటు డిప్యూటీ కమిషనర్ వెంకట్రాములు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోవర్ధన్, వెటర్నరీ విభాగం డిప్యూటీ డైరెక్టర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గురుకుల కళాశాల, హాస్టల్‌లో అదనపు కలెక్టర్ తనిఖీ



మహబూబ్నగర్ ఆగస్టు 13 విజన్ ఆంధ్ర ప్రతినిధి : దేవరకద్ర మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థ (TGSWRS) జూనియర్ కళాశాల, హాస్టల్‌ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల, హాస్టల్‌లోని వంటగది పరిశుభ్రత, విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, మౌలిక వసతులు, హాస్టల్‌లోని సౌకర్యాలను ఆయన పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాభ్యాసం, విద్యా ప్రమాణాలు, హాస్టల్‌లో అందుతున్న సౌకర్యాలు, సంక్షేమ కార్యక్రమాల అమలుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాలను తెలుసుకున్న అదనపు కలెక్టర్ వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, వారికి అందిస్తున్న ఆహారం నాణ్యతను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన ఆహారం అందించాలని, విద్యా, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో దేవరకద్ర ఎంపీఓ, కళాశాల ప్రిన్సిపాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రచయిత,గాయకుడు తిరుమల నాగేంద్ర రచించిన భరత మాత గీతం ఆవిష్కరణ చేసిన కలెక్టర్



మహబూబ్నగర్ ఆగస్టు 13 విజన్ ఆంధ్ర ప్రతినిధి : భావి భారత పౌరులు విద్యార్థులకు భరతమాత గురించి తెలుసుకోవాల్సిన ఆవశ్యకతను తెలుపుతూ రచయిత, గాయకుడు తిరుమల నాగేంద్ర రచించిన భరత మాత గీతాన్ని గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆవిష్కరించారు. రాబోయే భవిష్యత్ తరాలకు ఇది చాలా ఆదర్శంగా ఉంటుందని భావి భారత పౌరులైన విద్యార్థుల్లో జాతీయ సమైక్యత భావాన్ని, నైతిక విలువలను పెంపొందించే విధంగా ఈ గీతం ఉందని కలెక్టర్ గేయ రచయితని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఏ ఎం ఓ దుంకుడు శ్రీనివాస్ ,కవి, రచయిత, ఎం ఎన్ విజయకుమార్ ,స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నరసింహులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మహబూబ్‌నగర్‌లో తొలి 'ఎంసీసీ ఫ్రీడమ్ రైడ్'




మహబూబ్నగర్ ఆగస్టు 13 విజన్ ఆంధ్ర ప్రతినిధి : మహబూబ్‌నగర్ సైక్లింగ్ క్లబ్ (ఎంసీసీ) ఆధ్వర్యంలో ఆగస్టు 16న నిర్వహించనున్న 'ఎంసీసీ ఫ్రీడమ్ రైడ్2026' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా (ఐఏఎస్)ను క్లబ్ సభ్యులు గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలిసి ఆహ్వానించారు. ఈ ఆహ్వానంపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. సైక్లింగ్‌ను ప్రోత్సహించడంతో పాటు ప్రజల్లో ఆరోగ్యం, శారీరక దృఢత్వంపై అవగాహన కల్పించేందుకు ఎంసీసీ చేస్తున్న కృషిని ఆమె అభినందించారు. మహబూబ్‌నగర్‌లో తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ సైక్లింగ్ కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సైక్లింగ్ వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను, ఆనందాన్ని ఆస్వాదించాలని క్లబ్ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంసీసీ సభ్యులు వావిళ్ల వేణుగోపాల్‌రెడ్డి, ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, అనిరుధ్, శశాంక్, దిలీప్, శరత్ తదితరులు పాల్గొన్నారు.


## ఆరోగ్య పరీక్ష పరికరాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వినియోగించాలి

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 13,(విజన్ ఆంధ్ర): జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను రోగులకు ఆరోగ్య పరీక్ష పరికరాల ద్వారా పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని ఎన్ఐసి సమావేశ మందిరంలో స్క్రీనింగ్ పరికరాల వినియోగంపై ల్యాబ్ టెక్నీషియన్లు, స్టాఫ్ నర్సులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగేంద్ర తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యతలో భాగంగా హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఓమ్ని ఆక్టివ్ కేర్ ఫౌండేషన్ వారి సహకారంతో హెల్త్ ప్రాజెక్ట్ కాంట్రిబ్యూషన్ లో భాగంగా అందించిన హెల్త్ స్క్రీనింగ్ పరికరాలు, మల్టీ పారామెట్రిక్ డయాగ్నొస్టిక్ డివైస్ లను వినియోగించుకుని తమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చికిత్సల కోసం వచ్చే రోగులకు పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 8 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పరికరాలను అందించడం జరిగిందని, స్క్రీనింగ్ పరికరాల నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని, మారుమూల గ్రామాల ప్రజలకు ఉత్తమమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకాంక్షిత బ్లాక్ సమన్వయకర్త డా. బాలరాజు, స్టాఫ్ నర్సులు ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

### విధులలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు - జిల్లా కలెక్టర్ కె.హరిత..



అసిఫాబాద్ జిల్లా ప్రతిని ఆగస్టు13,(విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ కార్యాలయాలలో విధులు నిర్వహించే ఉద్యోగులు, సిబ్బంది తమ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ఉద్యోగులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేస్తున్న ఉద్యోగులు విధుల పట్ల సమయపాలన పాటించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. విధులలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలకు ఉపేక్షించేది లేదని, అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ తవ్వకాలు,రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి - జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను అరికట్టేందుకు తహసీల్దార్లు అప్రమత్తంగా వ్యవహరించి, సమాచారం అందిన వెంటనే క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు.ఁగురువారం తహసీల్దార్లతో నిర్వహించిన వెబెక్స్ సమీక్షలో అన్ని మండలాల తహసీల్దార్లతో అక్రమ ఇసుక తవ్వకాలపై, భూభారతి, సదాబైనమా, మీసేవ, ప్రజాపాలన, కుటుంబ రిజిస్ట్రేషన్ దరఖాస్తుల పై, ఆగస్టు 15 న స్వతంత్ర దినోత్సవం సందర్భంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ పై సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా కోయిల్‌కొండ, మూసాపేట, మిడ్జిల్, దేవరకద్ర, చిన్నచింతకుంట, జడ్చర్ల తదితర మండలాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు, తరలింపుపై వచ్చిన ఫిర్యాదులు, నివేదికలను కలెక్టర్ సమీక్షించారు. కోయిల్‌కొండ మండలం శివారం గ్రామంలో ఇసుక తవ్వకాల కారణంగా ప్రభుత్వ భూమికి నష్టం జరిగినట్లు వచ్చిన నివేదికపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్రమ తవ్వకాలు గుర్తించిన వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. మిడ్జిల్ మండలం లో సీజ్ చేసిన ఇసుక వేలం వెంటనే నిర్వహించాలని మైనింగ్ శాఖా అధికారులను, తహశీల్దారు ఆదేశించారు .క్షేత్రస్థాయిలో జరిగిన నష్టాన్ని సంబంధిత తహసీల్దార్లు స్వయంగా పరిశీలించి నివేదిక సమర్పించాలని, అక్రమంగా తరలించిన ఇసుక వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసి నిబంధనల ప్రకారం బాధ్యుల నుంచి రికవరీ చేయాలని సూచించారు. అవసరమైన చోట పోలీసులకు వెంటనే ఫిర్యాదు చేసి, అక్రమ తవ్వకాలను అడ్డుకునేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మీడియాలో ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించి వ్యతిరేక వార్తలు వచ్చినప్పుడు సంబంధిత తహసీల్దార్ స్పందించి క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించి, తీసుకున్న చర్యలను తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి మండలంలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయా లేదా అనే విషయాన్ని తహసీల్దార్లు నిరంతరం పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించి పరిస్థితిని స్వయంగా తెలుసుకోవాలని ఆదేశించారు. అధికారులు ఒకరిపై మరొకరు బాధ్యతలు బదిలీ చేసుకునే పరిస్థితి ఉండకూడదని, తమ పరిధిలో జరుగుతున్న ప్రతి అంశంపై తహసీల్దార్లకు పూర్తి అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. ఇసుక




అక్రమ తవ్వకాలు, రవాణాపై సమాచారం అందిన వెంటనే క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేయడం, ఇసుకను స్వాధీనం చేసుకోవడం, నష్టాన్ని అంచనా వేసి రికవరీ చర్యలు చేపట్టడం వంటి ప్రక్రియలను వేగవంతం చేయాలని కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. ఆగస్టు 15 స్వతంత్ర దినోత్సవం సందర్భంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేయనున్నట్లు,ఇందుకు సంబంధించి తహశీల్దార్లు ప్రతిమండలనుండి 10 నుండి 15 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి ఆ జాబితాను వెంటనే పంపాలని అన్నారు. అనంతరం జిల్లాలో గృహ నిర్మాణాల పురోగతి, లబ్ధిదారుల ఎంపిక, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై కలెక్టర్ ఖుష్బూ గుప్తా సమీక్ష నిర్వహించారు. టూ-బీహెచ్‌కే గృహాలకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేసి, పెండింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎల్-1 జాబితాలోని అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, వారి వివరాలను హౌసింగ్ పీడీ కార్యాలయానికి పంపించాలని సూచించారు. ప్రజాపాలన పోర్టల్‌లోని దరఖాస్తులను కూడా పరిగణనలోకి తీసుకుని అర్హులను ఎల్-1, ఎల్-2, ఎల్-3 కేటగిరీలుగా గుర్తించాలని తెలిపారు. గృహాల కేటాయింపులో ప్రభుత్వ మార్గదర్శకాలు, వర్గాల వారీ రిజర్వేషన్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న గృహాల ఎంపిక ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారుల జాబితాలను సంబంధిత హౌసింగ్ పీడీ కార్యాలయానికి పంపాలని కలెక్టర్ ఆదేశించారు. స్థానిక సమస్యలను ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పరిష్కరించి, గృహాల కేటాయింపు ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. భూభారతి, సాదాబైనమా, రీసర్వే, నక్షా సర్వే, మీసేవ, కుటుంబ రిజిస్ట్రేషన్ల పై తదితర రెవెన్యూ సేవలకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించి, ప్రతి పనిలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్ణీత గడువులో సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె సూచించారు. భూభారతి పోర్టల్‌లో 60 రోజులకుపైగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ తహశీల్దార్లకు ఆదేశించారు. సర్వేయర్ల కొరత, కోర్టు కేసులు, సాంకేతిక సమస్యల కారణంగా నిలిచిపోయిన దరఖాస్తులను ప్రత్యేకంగా పరిశీలించి సాధ్యమైన వాటిని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే సమస్యలు ఉన్న ప్రాంతాల్లో ల్యాండ్ యాప్‌లోని జీపీఎస్ కోఆర్డినేట్ల ఆధారంగా స్కెచ్‌లు సిద్ధం చేసి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. తహసీల్దార్లు తమ పరిధిలోని పెండింగ్ ఫైళ్లపై నిరంతరం ఫాలోఅప్ చేయడంతో పాటు, కోర్టు కేసులకు సంబంధించిన నివేదికలను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పూర్తి వివరాలతో పంపాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ పనులు కొనసాగుతున్నప్పటికీ భూభారతి దరఖాస్తుల పరిష్కారాన్ని నిర్లక్ష్యం చేయరాదని స్పష్టం చేశారు. సాదాబైనమా దరఖాస్తుల పరిష్కారాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన కేసులను లిఖితపూర్వకంగా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని, ప్రతి మండలంలో పెండింగ్ లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో చేపడుతున్న గ్రామాల రీసర్వే పనులను వేగవంతం చేస్తూ గ్రామ సరిహద్దుల నిర్ధారణ, ప్రభుత్వ భూముల డిమార్కేషన్‌ను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. కుటుంబ రిజిస్ట్రేషన్లకు సంబంధించి దరఖాస్తు లను కూడా వేగంగా పూర్తి చేయాలని అన్నారు. ఐతే చనిపోయిన వారి వివరణను జాగ్రత్తగా పరిశీలించి కుటుంబ రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలను జారీ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. ఎల్. బి హరిప్రియ, డి. ఆర్.ఓ ఎ.నిర్మల, ఆర్. డి.ఓ నవీన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏ. డి అశోక్, జిల్లా మైనింగ్ శాఖ అధికారులు, మండల తహశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షుడిగా భూక్య రాములు వరుసగా మూడోసారి ఏకగ్రీవ ఎన్నిక.



వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగష్టు13(విజన్ ఆంధ్ర);- పీఆర్‌టీయూ టీఎస్ పర్వతగిరి మండల శాఖ అధ్యక్షుడిగా భూక్య రాములు వరుసగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఏనుగల్లు జడ్పీహెచ్ఎస్‌లో మండల అధ్యక్షుడు భూక్య రాములు అధ్యక్షతన పీఆర్‌టీయూ టీఎస్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వరంగల్ జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నక్కిరెడ్డి మహేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పీఆర్‌టీయూ టీఎస్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. సెప్టెంబర్ 1న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి పర్వతగిరి మండలం నుంచి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పీఆర్‌టీయూ టీఎస్ పర్వతగిరి మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా భూక్య రాములు, ప్రధాన కార్యదర్శిగా మేడిది నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షులుగా సాంబారి అనిల్‌కుమార్, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా ఆర్. కల్పన, ఉపాధ్యక్షులుగా కే. దామోదర్‌రెడ్డి, ఎం. రమేష్, మహిళా ఉపాధ్యక్షులుగా వై. రాణి రుద్రమదేవి, కె. శ్వేత ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా ఆర్. రాజు, జి. రాజు, మహిళా కార్యదర్శులుగా కే. లలితాదేవి, ఎన్. ప్రశాంత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా గీసుకొండ మండల జనరల్ సెక్రెటరీ మార్త శ్రీను, దుగ్గొండి మండల అధ్యక్షుడు పొగాకు అచ్చయ్య, నల్లబెల్లి మండల ప్రధాన కార్యదర్శి బానోతు కృష్ణ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మాజీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎన్వీఆర్ రాజు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పొనుగోటి అశోక్‌రావు, ధీకొండ నరసింహారావు, బిల్లిపెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కటకం రఘుతో పాటు జిల్లా, మండల బాధ్యులు, ఉపాధ్యాయులు, పీఆర్‌టీయూ టీఎస్ ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు.

## ప్రతి అర్హత కలిగిన ఓటరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలి

**- డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్**



వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగష్టు13(విజన్ ఆంధ్ర); ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎన్యూమరేషన్ దశలో సేకరించబడనిగా గుర్తించబడిన ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పూర్తి వివరాలను అందించాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీమతి సత్య శారదలికి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, బిఎల్ఏ-1 మహమ్మద్ అయూబ్ వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ, ఎన్యూమరేషన్ ఫారమ్ సమర్పించలేదనే కారణంతో ఏ ఒక్క అర్హత కలిగిన ఓటరు కూడా మునాయిదా ఓటర్ల జాబితాలో చోటు కోల్పోకూడదని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హత కలిగిన పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు.జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ స్టేషన్ వారీగా సేకరించని ఎన్యూమరేషన్ ఫారమ్‌ల జాబితా, వాటిని గుర్తించడానికి గల కారణాలు, అలాగే నిబంధనలకు లోబడి అందుబాటులో ఉన్న ఓటర్ల సంప్రదింపు వివరాలను అందించాలని ఆయన కోరారు.ఈ వివరాల ఆధారంగా కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఏ లు), సమన్వయ బృందాలు క్షేత్రస్థాయిలో సంబంధిత ఓటర్లను గుర్తించి, వారికి అవసరమైన అవగాహన కల్పించి, క్లెయిమ్స్ మరియు ఆబ్జెక్షన్స్ ప్రక్రియలో తమ ఓటు హక్కును పరిరక్షించుకునేలా సహకారం అందిస్తాయని తెలిపారు.అర్హత కలిగిన ప్రతి ఓటరు ఓటర్ల జాబితాలో ఉండేలా, ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అనర్హతలు లేదా పొరపాట్లకు తావులేకుండా పారదర్శకమైన, సమగ్ర, ఖచ్చితమైన మరియు లోపరహిత ఓటర్ల జాబితా రూపొందించేందుకు ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ సహకారం అందిస్తుందని మహమ్మద్ అయూబ్ స్పష్టం చేశారు.

## మున్సిపల్ చైర్మన్ బహిరంగ క్షమాపణలు చెప్పాలి

**: వర్ధన్నపేటలో రజక కులస్థుల డిమాండ్**



వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగష్టు13(విజన్ ఆంధ్ర); రజకులను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి రజక కులస్థులకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా గురువారం పట్టణంలోని పోచమ్మ తల్లి ఆలయం ఎదుట చైర్మన్ వైఖరి పట్ల నిరసన చేపట్టగా పలు పార్టీల ప్రజాప్రతినిధులు రాజకీయ పార్టీల ప్రతినిధులు రజకులకు మద్దతు తెలిపారు.అనంతరం వారు మాట్లాడుతూ శ్రావణమాసంలో బోనాల సందర్భంగా ప్రతి సంవత్సరం రజక కులస్థులు శ్రావణమాసం అమావాస్యను పురస్కరించుకొని గుడిని శుద్ధిచేసి సున్నాలు వేసిన తర్వాతనే విశ్వబ్రాహ్మణులు బోనాలు సమర్పించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా విశ్వబ్రాహ్మణులు ,రజకులు,కుమ్మరి కులస్థులు ప్రధానంగా పోచమ్మ తల్లి గుడికి మొదటి నుంచి ఆనవాయితీగా ఈ మూడు కులాల ఐక్యతతో గ్రామస్థులు అందరి సహకారంతో ప్రతి సంవత్సరం ఘనంగా బోనాల పండుగ శ్రావణమాసంలో నిర్వహించడం జరుగుతుందన్నారు.ఏళ్ల తరబడి నుంచి వస్తున్న ఆచార సాంప్రదాయాలను తోసిపుచ్చి నేడు వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ రజక కులస్థులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఆషాడ మాసంలోనే ఆలయానికి పెయింటింగ్ వేయించడం జరిగిందని తెలిపారు.ఈ విషయం పై రజకులు కమ్మరి కులస్థులను సంప్రదించగా మున్సిపల్ చైర్మన్ వాళ్లకేంది చెప్పేది అని దురుసుగా వ్యాఖ్యలు చేసినట్టు ఆ కులానికి చెందిన కొందరు తెలిపారని వాపోయారు.రజకుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేసిన మున్సిపల్ చైర్మన్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని వర్ధన్నపేట రజక సంఘం నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలి

**- ప్రత్యేక అధికారి జాదవ్ అంబాజీ..**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 13( విజన్ ఆంధ్ర) : కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండల ప్రత్యేక అధికారి జాదవ్ అంబాజీ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు, ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి జాదవ్ అంబాజీ మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి తిర్యాని మండలానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని సూచించారు. మండల అభివృద్ధికి ప్రతి శాఖ తనవంతు బాధ్యతతో పనిచేయాలని అన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు జాగ్రత్తలు చేపట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రజల ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. మండలంలోని సమస్యలు, ప్రజలకు సంబంధించిన అంశాలపై ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. మండల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా అన్ని శాఖల అధికారులు సమష్టిగా పనిచేయాలని జాదవ్ అంబాజీ సూచించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు మండలంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై వివరాలను వెల్లడించారు. సర్పంచులు, ప్రజాప్రతినిధులు తమ గ్రామాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

## ప్రైవేట్ రంగ ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**- కలెక్టర్ రాజర్షి షా**




ఆదిలాబాద్, ఆగస్టు 13 (విజన్ ఆంధ్ర): ప్రభుత్వ ఉద్యోగాల కోసం మాత్రమే ఎదురుచూడకుండా, ప్రైవేట్ రంగంలో లభించే ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని యువత జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా నైపుణ్యాలు ఉన్న యువతకు ప్రైవేట్ రంగంలో అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రారంభంలో వేతనం తక్కువగా ఉన్నా, కష్టపడితే అనుభవంతో పాటు ఉన్నత పదోన్నతులు, అధిక వేతనాలు సాధించవచ్చని తెలిపారు. ఈ జాబ్ మేళాలో పలు ప్రముఖ బహుళజాతి సంస్థలు, స్థానిక పరిశ్రమల ప్రతినిధులు పాల్గొని అర్హులైన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వివిధ విభాగాల్లో ఎంపికైన అభ్యర్థులకు కలెక్టర్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఉద్యోగం సాధించిన యువత అంకితభావంతో పనిచేసి సంస్థలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారిణి మిల్కా, ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కంపెనీల ప్రతినిధులు, అధ్యాపకులు మరియు పెద్ద సంఖ్యలో యువతీ యువకులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే, ప్రభుత్వ లక్ష్యం, ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి





తెలకపల్లి, ఆగస్టు 13 ( విజన్ ఆంధ్ర) రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి అన్నారు గురువారం మండల పరిధిలోని చిన్న ముద్దునూరు గ్రామంలో తెలకపల్లి ప్రాథమిక వ్యవసాయ కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్వచ్ఛమైన నూనె మిల్లు, ఐదువేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల ధాన్యపు గోదాములు అదేవిధంగా వ్యవసాయ విక్రయ కేంద్రాలను ఎమ్మెల్యే కూచుకుళ్ళరాజేష్ రెడ్డి ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించడంతోపాటు వ్యవసాయ ఉత్పత్తులను స్థానికంగా విలువను పెంచే కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమని అన్నారు, రైతుల సంక్షేమం సహకార రంగ అభివృద్ధి గ్రామీణ అభివృద్ధి లక్ష్యంగా పిఎసిఎస్ తెలకపల్లి ఆధ్వర్యంలో మరిన్ని రైతు ప్రయోజనా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని సీఈఓ ధర్మదీర్ తెలిపారు ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, జాయింట్ రిజిస్టర్, పరిమళాదేవి, ఆర్ఎం శార్దూల్ జాదవ్, డిసిఓ రమేష్, సింగిల్ విండో వైస్ చైర్మన్ యాదయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య వేడుకల ముఖ్య అతిథిగా డాక్టర్ మహేందర్ రెడ్డి



వనపర్తి జిల్లా ప్రతినిధి,ఆగస్టు 13 (విజన్ ఆంధ్ర) : వనపర్తి జిల్లాలో ఆగస్టు 15న నిర్వహించనున్న 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జరిగే ప్రధాన వేడుకల్లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జిల్లా ప్రజలను ఉద్దేశించి సందేశాన్ని అందించనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా ఎస్పీతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారు.

# పాలిటెక్నిక్‌ల విలీన ప్రతిపాదన ఉపసంహరించుకోవాలి

**- కె.డి.ఆర్. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది డిమాండ్**



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 13 (విజన్ ఆంధ్ర)ది: పాలిటెక్నిక్ కళాశాలలను 'శక్తి' శాఖలో విలీనం చేసే ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని కె.డి.ఆర్. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది డిమాండ్ చేశారు. గురువారం కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో వారు మాట్లాడారు. తల్లిదండ్రులు, సిబ్బంది అభిప్రాయాలు సేకరించకుండా నిర్ణయం తీసుకోవడం సరికాదని పేర్కొన్నారు. విలీనంతో ఉద్యోగుల సర్వీసు, పదోన్నతులపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. కళాశాలలకు ఏఐసీటీఈ గుర్తింపు కొనసాగించాలని, విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా చూడాలన్నారు. అధ్యాపకులు, ఉద్యోగులు, తల్లిదండ్రులతో సమగ్రంగా చర్చించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

# మీసేవల్లో అదనపు రుసుములు వసూలు చేయొద్దు

**- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 13 (విజన్ ఆంధ్ర) : ప్రజలకు మీసేవ కేంద్రాల ద్వారా ప్రభుత్వ సేవలను పారదర్శకంగా, వేగంగా అందించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ సూచించారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాల మేరకు గురువారం మీసేవ కేంద్రాల నిర్వాహకులకు జిల్లా స్థాయి అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన రుసుముల కంటే ప్రజల నుంచి అదనంగా ఎలాంటి మొత్తం వసూలు చేయరాదు. ప్రతి సేవకు సంబంధించిన రుసుముల పట్టికను కేంద్రాల్లో ప్రదర్శించాలి. ప్రతీ లావాదేవీకి తప్పనిసరిగా రసీదు ఇవ్వాలి. కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుతూ, ప్రజలకు సౌకర్యవంతమైన వాతావరణంలో సేవలు అందించాలి. కార్యక్రమంలో వైకల్య గుర్తింపు కార్డులు (సదరమ్), జాతీయ కుటుంబ ప్రయోజన పథకం, కార్మిక శాఖ సేవలకు సంబంధించిన ఆన్‌లైన్ విధానం, అవసరమైన పత్రాలపై అధికారుల బృందం నిర్వాహకులకు శిక్షణ ఇచ్చింది. ఈ సమావేశంలో మీసేవ జిల్లా మేనేజర్ వెంకటేష్, జిల్లా కార్మిక అధికారి, ఈడీఎం, టీఎస్ ఆన్‌లైన్ ప్రతినిధులు, డీఆర్‌డీఏ బృందం మరియు మీసేవ నిర్వాహకులు పాల్గొన్నారు.

# అమ్మపల్లిని అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం

**- వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి**

**- నూతన గ్రామపంచాయతీ భవనం ప్రారంభం**

**- మహిళా సమైక్య భవనానికి భూమిపూజ**




వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 13 (విజన్ ఆంధ్ర) : గ్రామీణ ప్రాంతాల సర్వాంగీణ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అమ్మపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామంలో మహిళా సమైక్య భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన పంచాయతీ భవనంతో గ్రామీణ ప్రజలకు పాలనా సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయి. సమైక్య భవనాల నిర్మాణం ద్వారా మహిళా సంఘాల బలోపేతంతో పాటు స్వయం ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మాధవి వెంకటేశ్వర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు క్యామ నవనీత రాజు, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, మండల అధ్యక్షుడు వెంకటస్వామి, మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్, మాజీ సర్పంచ్ రమేష్ యాదవ్, పార్టీ నాయకులు ఐ. సత్యరెడ్డి, గట్టు యాదవ్, శ్రీనివాసులు, బాలు, ఇతర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల సాకారం - ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 13 (విజన్ ఆంధ్ర) : పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ రాజ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అమ్మపల్లి గ్రామంలో నిర్మాణం పూర్తిచేసుకున్న ఐదు ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ మహోత్సవంలో గురువారం ఆయన పాల్గొన్నారు. గృహప్రవేశం చేసిన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపి, నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. "ఇల్లు అనేది కేవలం నాలుగు గోడలు కాదు.. అది ఒక కుటుంబానికి భరోసా, ఆత్మగౌరవం మరియు భవిష్యత్తుకు పునాది" అని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరువ చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నో ఏళ్లుగా అద్దె ఇళ్లలో ఇబ్బందులు పడ్డామని, గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో కాలయాపన చేసిందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే తమ సొంతింటి కల నెరవేరిందని హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే మేఘారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మాధవి వెంకటేశ్వర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు క్యామ నవనీత రాజు, నాయకులు వెంకటస్వామి, రఘు ప్రసాద్, రమేష్ యాదవ్, ఐ. సత్యరెడ్డి, గట్టు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ కాలేజీల్లో అధిపతుల కొరత!!

**- కెప్టెన్ లేని ఓడ ప్రయాణం ఎటు వైపు**

**- ప్రిన్సిపల్స్ లేక విద్యా ప్రమాణాలు ఎలా?**

**- ఇన్‌ఛార్జ్‌లతోనే కళాశాలల నిర్వహణ**

**- విద్యార్థుల ఫలితాలపై ప్రభావం**

**- నాక్ గ్రేడింగ్‌కు నాయకత్వ లోపం**




హైదరాబాద్, ఆగస్టు 13:
ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం ఆ లక్ష్యానికి భిన్నంగా ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పూర్తిస్థాయి ప్రిన్సిపాళ్లు లేకపోవడం విద్యా వ్యవస్థపై ప్రభావం చూపుతోంది. కీలకమైన ప్రిన్సిపల్ పోస్టులు ఖాళీగా ఉండటంతో ఇన్‌ఛార్జ్‌లతోనే కళాశాలల నిర్వహణ కొనసాగుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.

## అధిపతి లేకుంటే.. పర్యవేక్షణ ఎలా?

**- కెప్టెన్ లేని ఓడ ప్రయాణం ఎటు వైపు**

కళాశాలకు ప్రిన్సిపాల్ అంటే కేవలం పరిపాలనా అధికారి మాత్రమే కాదు.. మొత్తం విద్యా వ్యవస్థకు దిశానిర్దేశం చేసే నాయకుడు. అధ్యాపకుల హాజరు, తరగతుల నిర్వహణ, సిలబస్ పూర్తి, విద్యార్థుల ఫలితాలు, పరీక్షల నిర్వహణ వంటి అంశాలపై నిరంతర పర్యవేక్షణ అవసరం. ఇన్‌ఛార్జ్‌లు ఒకవైపు బోధనా బాధ్యతలు నిర్వహిస్తూ.. మరోవైపు పరిపాలనా వ్యవహారాలను చూసుకోవాల్సి రావడంతో పూర్తి స్థాయి పర్యవేక్షణకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. దీంతో విద్యా ప్రమాణాలపై ప్రభావం పడకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

**- నాక్(ఎన్ఏఏసీ).. అభివృద్ధి నిధులు.. కీలకమే!!**

కళాశాలల విద్యా ప్రమాణాలను మెరుగుపర్చడంలో నాక్ వంటి నాణ్యతా మూల్యాంకన ప్రక్రియలు కీలక పాత్ర పోషిస్తాయి. కళాశాల అభివృద్ధి, అకడమిక్ ప్రణాళిక, మౌలిక వసతులు, రికార్డుల నిర్వహణ, విద్యార్థుల ప్రగతి వంటి అంశాల్లో సమర్థవంతమైన నాయకత్వం అవసరం. అలాగే ల్యాబ్‌లు, లైబ్రరీలు, డిజిటల్ సౌకర్యాలు, తరగతి గదులు, ఇతర మౌలిక వసతుల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుంది. నాయకత్వం బలహీనంగా ఉంటే అభివృద్ధి కార్యక్రమాలు ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవచ్చనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

**- ప్లేస్‌మెంట్స్‌పై కూడా ప్రభావం!!**

ప్రస్తుత పరిస్థితుల్లో డిగ్రీతో పాటు ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలు విద్యార్థులకు అందించడం అత్యవసరం. కంపెనీలను కళాశాలలకు ఆహ్వానించడం, క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లు నిర్వహించడం, కెరీర్ గైడెన్స్ అందించడం వంటి కార్యక్రమాలకు కళాశాల నాయకత్వం కీలకం. ప్రిన్సిపాల్ స్థాయిలో సమన్వయం లేకపోతే విద్యార్థులకు అందాల్సిన ఉద్యోగ, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు తగ్గే ప్రమాదం ఉందని విద్యావేత్తలు పేర్కొంటున్నారు.




**- "ఇన్‌ఛార్జ్ వ్యవస్థ తాత్కాలికమే"**

"ఒక ఓడకు కెప్టెన్ ఎంత ముఖ్యమో.. కళాశాలకు ప్రిన్సిపాల్ కూడా అంతే ముఖ్యం. ఇన్‌ఛార్జ్ వ్యవస్థ అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే తాత్కాలిక పరిష్కారం మాత్రమే. దీర్ఘకాలిక విద్యాభివృద్ధికి పూర్తిస్థాయి నాయకత్వం అవసరం" అని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

**- ఇకనైనా ప్రభుత్వం స్పందించాలి**

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను ఆశ్రయించే విద్యార్థుల్లో గ్రామీణ ప్రాంతాలు, మధ్యతరగతి, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన వారు అధికంగా ఉంటారు. వారికి నాణ్యమైన విద్య, నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలు అందించడం ప్రభుత్వ బాధ్యత. అందువల్ల ఖాళీగా ఉన్న ప్రిన్సిపాల్ పోస్టులను గుర్తించి నిబంధనల ప్రకారం నియామకాలు లేదా పదోన్నతుల ద్వారా వీలైనంత త్వరగా భర్తీ చేయాలి. ఇన్‌ఛార్జ్ వ్యవస్థను శాశ్వత పరిష్కారంగా కాకుండా తాత్కాలిక ఏర్పాటుగా మాత్రమే కొనసాగించాలి. కళాశాలకు భవనాలు, తరగతి గదులు, అధ్యాపకులు ఉన్నా.. దిశానిర్దేశం చేసే పూర్తిస్థాయి అధిపతి లేకపోతే విద్యా వ్యవస్థకు ఆశించిన ఫలితాలు ఎలా వస్తాయి? అన్న ప్రశ్న ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యా ప్రమాణాలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**- గడ్డం సంతోష్ రాజ్**

**స్పెషల్ కరస్పాండెంట్ (విజన్ ఆంధ్ర)**

# సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ టాప్!!

**- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి ఇలా**

**- ప్రధానమంత్రి కార్యాలయం 'ప్రగతి' ప్రశంసలు**

**- డిజిటల్ అరెస్ట్' అంటే నమ్మవద్దు**

**- ఆన్‌లైన్ టాస్క్ స్కామ్‌ల మాయలో పడకండి**

**- "ఏపీకే ఫైల్స్, ఓటిపి"ల పట్ల జాగ్రత్త అవసరం**

ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలంటే ఏం చేయాలి? ఒక్క చిన్న నిర్లక్ష్యం.. క్షణాల్లో ఖాతా ఖాళీ. సైబర్, ఆన్‌లైన్ మోసాలపై పూర్తి అవగాహన కోసం 'విజన్ ఆంధ్ర' ప్రత్యేక కథనం చదవండి. అప్రమత్తతే రక్షణ.....అవగాహనే సైబర్ మోసాలకు అడ్డుకట్ట







హైదరాబాద్, ఆగస్టు 13 (విజన్ ఆంధ్ర): పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టడంలో తెలంగాణ పోలీసులు జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంటున్నారు. ఇటీవల పిఎంఓ నిర్వహించిన 'ప్రగతి' సమీక్షలో తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో దేశంలోనే నెంబర్-1 స్థానంలో నిలిచింది. బాధితులకు వేగంగా నగదు రికవరీ చేయడం, ఈ-జీరో ఎఫ్ఐఆర్‌లు, మోసపూరిత కంటెంట్‌పై తక్షణ చర్యల్లో రాష్ట్రం ముందుంది. చట్టవిరుద్ధమైన కంటెంట్, మోసపూరిత వెబ్‌సైట్లను తొలగించడంలో అత్యంత వేగవంతమైన ప్రతిస్పందనను ప్రదర్శించారు. పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నా, నేరగాళ్లు కొత్త మార్గాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. ప్రజలు ఈ క్రింది జాగ్రత్తలు పాటించాలి:




ముఖ్యమైన సైబర్ మోసాలు జాగ్రత్తలు

డిజిటల్ అరెస్ట్ భయాలు: చట్టంలో ఎలాంటి 'డిజిటల్ అరెస్ట్' ఉండదు. పోలీస్ లేదా సీబీఐ అధికారులమని భయపెట్టి డబ్బులు అడిగితే నమ్మవద్దు. జాబ్/పార్ట్ టైమ్ స్కామ్‌లు: వీడియో లైక్‌లు కొడితే లేదా టెలిగ్రామ్ టాస్క్‌లు పూర్తి చేస్తే డబ్బులొస్తాయంటే నమ్మకండి. ముందస్తు పెట్టుబడులు పెట్టవద్దు. నకిలీ లింకులు, యాప్‌లు: అపరిచిత వ్యక్తులు పంపే ఏపీకే ఫైళ్లు, లింక్స్‌పై క్లిక్ చేయవద్దు. ఓటిపి లేదా పిన్ ఎవరికీ చెప్పవద్దు.

**మోసపోతే తక్షణమే చేయాల్సింది!**

**మీరు సైబర్ మోసానికి గురైతే మొదటి 1 గంట అత్యంత కీలకమైనది.**

**తక్షణ సైబర్ హెల్ప్‌లైన్: 1930**

డబ్బులు పోగొట్టుకున్న వెంటనే 1930 కి ఫోన్ చేస్తే, ఆ నగదును నేరగాళ్ల ఖాతాల్లోకి వెళ్లకుండా పోలీసులు ఫ్రీజ్ చేస్తారు. ఆన్‌లైన్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చు. ఉచిత సహాయం కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ 8712665600 నంబర్‌ను సంప్రదించవచ్చు. పోలీసుల వేగవంతమైన స్పందనతో పాటు, ప్రజల అప్రమత్తతే సైబర్ నేరాలకు అసలైన అడ్డుకట్ట.

**- గడ్డం సంతోష్ రాజ్**

**స్పెషల్ కరస్పాండెంట్ (విజన్ ఆంధ్ర)**

# ఆడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యువరాజ్ మర్మాట్...



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు,13(విజన్ ఆంధ్ర) : ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ గురువారం ఆసిఫాబాద్ మండలంలోని అడ గ్రామంలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,మరియు మండల పరిషత్ ఉప్పర్ ప్రైమరీ పాఠశాల, గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

**ప్రధాన తనిఖీ అంశాలు & ఆదేశాలు:**

ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ రిజిస్టర్లు, మందుల నిల్వలు మరియు రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

**పాఠశాల తనిఖీ:**

పాఠశాలలో విద్యార్థుల హాజరు, తరగతి గదులు మరియు మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు రుచికరమైన, పరిశుభ్రమైన భోజనం అందించాలని పాఠశాల నిర్వహణ కమిటీకి, ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలని కోరారు.

**గ్రామ పంచాయతీ కార్యాలయం తనిఖీ:**

గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించి, గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా మరియు ఇతర అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై పంచాయతీ కార్యదర్శి మరియు సిబ్బందితో సమీక్షించారు. వర్షాకాలం దృష్ట్యా గ్రామంలో పారిశుధ్య లోపం తలెత్తకుండా, దోమల నివారణకు క్రమం తప్పకుండా ఫాగింగ్, బ్లీచింగ్ పిచికారీ చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు మరియు ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు..




# వరి వద్దు.. ప్రత్యామ్నాయ మేలు

**- సాగునీటి కొరతపై రైతులకు అవగాహన కల్పించాలి**

**- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం**

వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 13 (విజన్ ఆంధ్ర) : జిల్లాలో సాగునీటి కొరత దృష్ట్యా రైతులు వరి సాగుకు దూరంగా ఉండి, తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎగువ నుంచి నీటి రాక పూర్తిగా వర్షాలపైనే ఆధారపడి ఉందని కలెక్టర్ తెలిపారు. నీటి లభ్యతపై స్పష్టత లేకుండా వరి సాగు చేస్తే పంట కీలక దశలో నీరందక రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని, ఈ విషయాన్ని రైతులకు ముందే వివరించాలని సూచించారు. జిల్లాలో నిర్దేశించిన 1.55 లక్షల ఎకరాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు లక్ష్యాన్ని తప్పనిసరిగా సాధించాలని స్పష్టం చేశారు. మండల వ్యవసాయ అధికారులు, ఏఈఓలు క్షేత్రస్థాయికి వెళ్లి రైతులతో నేరుగా మాట్లాడి మినుములు, కందులు, వేరుశెనగ పంటల సాగును ప్రోత్సహించాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రత్యామ్నాయ పంటల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు, ఏవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రకృతి ఒడిలో...

## బంజారా గుండెల్లో 'తీజ్' సంబరాలు

**- దూపతండ లో అంబరాన్నంటిన వేడుకలు**

**- తొమ్మిది రోజుల కఠిన నిష్ట, భక్తిభావంతో తీజ్ పండుగ**

వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగష్టు 13(విజన్ ఆంధ్ర); భారతీయ సంస్కృతిలో పండుగంటే కేవలం పిండివంటలు, కొత్త బట్టలు మాత్రమే కాదు.. అది ప్రకృతితో మమేకమయ్యే ఒక మహోత్సవం. అందులోనూ గిరిజన జీవన విధానం, వారి ఆచారాలు అడుగడుగునా ప్రకృతి ఆరాధననే చాటుతుంటాయి. బంజారుల (లంబాడీల) ఆత్మబంధానికి, అచ్చమైన సంస్కృతికి ప్రతీకగా నిలిచే పవిత్రమైన 'తీజ్' పండుగ వేడుకలు వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని దూప తండ లో అత్యంత కనులపండువగా, ఆధ్యాత్మిక శోభతో కొనసాగుతున్నాయి.

**తొమ్మిది రోజుల తపస్సు**

**మొలకల సాగు :** గిరిజన సాంప్రదాయంలో 'తీజ్' కేవలం ఒక పండుగ కాదు, ఇదొక పెద్ద తంతు. ప్రతి ఏటా శ్రావణ మాసంలో ఈ వేడుకలను అత్యంత నిష్టతో నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల్లో తండాలోని పెండ్లి కాని యువతులు ప్రధాన కర్తలుగా వ్యవహరిస్తారు. తొమ్మిది రోజుల పాటు సాగే ఈ పూజా కార్యక్రమంలో భాగంగా.. యువతులు స్వచ్ఛమైన మట్టిని సేకరించి, వెదురు బుట్టల్లో నవధాన్యాలను (ముఖ్యంగా గోధుమలను) విత్తుతారు. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో నిష్టతో నీరు పోస్తూ, ఆ మొలకలు (తీజ్) పచ్చగా ఎదిగేలా కంటికి రెప్పలా కాపాడుకుంటారు. ఈ తొమ్మిది రోజులూ తండాలోని యువతులు ఉపవాసాలు ఉంటూ, సేవ్‌లాల్ మహారాజ్‌ను భక్తిశ్రద్ధలతో కొలుస్తారు.



**కంక బుట్టల ప్రత్యేకత**

పెళ్లికాని యువతుల ఆకాంక్షలుతీజ్ ఉత్సవంలో ఏర్పాటు చేసే కంక బుట్టల సంఖ్య తండాలోని, అలాగే పండుగకు హాజరయ్యే బంధువుల పెళ్లికాని ఆడపడుచుల సంఖ్యకు సమానంగా ఉంటుంది. ప్రతి కంక బుట్టను ఒక పెళ్లికాని కన్యకు ప్రతిరూపంగా భావిస్తూ ఆమె శుభ భవిష్యత్తు, సౌభాగ్యం, కుటుంబ శ్రేయస్సు, బంజారా సమాజ సంక్షేమానికి ప్రతీకగా పూజిస్తారు. తొమ్మిది రోజుల తీజ్ వ్రతాన్ని ఆచరించే పెళ్లికాని ఆడపడుచులు తమకు మంచి జీవిత భాగస్వామి లభించాలని దేవతలను, ప్రకృతిని మనసారా ప్రార్థిస్తారు.

## న్యూ బంజారా కాలనీలో 30 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభం

**- మాజీ కార్పొరేటర్ రాజ్ జితేంద్ర నాథ్ డివిజన్**



అల్వాల్, ఆగస్ట్ 13,( విజన్ ఆంధ్ర): అన్ని కాలనీలలో అభివృద్దే తన ధ్యేయమని మచ్చ బొల్లారం డివిజన్ మాజీ కార్పొరేటర్ రాజ్ జితేంద్ర నాథ్ అన్నారు. గురువారం దతుర్కపల్లి డివిజన్లోని న్యూ బంజారా కాలనీలో 30 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆయన, ప్రారంభించారు. అనంతరంమాజీ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ మాట్లాడు తూ...దాదాపు అన్ని కాలనీలలో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులు పూర్తి కావస్తున్నాయని తెలిపారు. మిగిలిన పనులు కూడా అధికారులతో సంప్రదించి త్వరలోనే పూర్తి చేస్తానని చెప్పారు. అభివృద్ధియే లక్ష్యంగా ముందుకు వెళుతున్న తనకు కాలనీ ప్రజలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు లడ్డు రెడ్డి, కాలనీ ప్రెసిడెంట్ షమీంఖాన్, జె ఎస్ యాదవ్, నర్సింలు గుప్తా,రంగారెడ్డి, అండ్ జ్యూస్ అంద్ర్ స్, శర్మ మల్లికార్జున్, రమాదేవి, గాయత్రి, అంజమ్మ, మేరి, స్థానిక నాయకులు బొబ్బిలి సురేందర్ రెడ్డి, సర్వేశ్ యాదవ్, కొండల్ రెడ్డి, దేవేందర్, సురేందర్ రెడ్డి, సందీప్ రెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

## జోగినపల్లి శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించిన మల్కాజిగిరి గిరి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి



మల్కాజిగిరి, ఆగస్ట్ 13,(విజన్ ఆంధ్ర) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) మేనమామ జోగినపల్లి శ్రీనివాసరావు మృతి బాధాకరమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన, తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులతో కలిసి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జోగినపల్లి శ్రీనివాసరావు మృతి పట్ల ఎమ్మెల్యే తీవ్ర సంతాపం తెలిపారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని భగవంతుడు వారి కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి ప్రార్థించారు.

## అల్వాల్ లో ఘనంగా...'ఘర్ ఘర్ తిరంగ' ర్యాలీ



అల్వాల్, ఆగస్ట్ 13,(విజన్ ఆంధ్ర): ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపు మేరకు ఘర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గురువారం అల్వాల్ లో తిరంగా జండా ర్యాలీ నిర్వహించారు. ఈ సేవ నుండి బయలుదేరిన ఈ ర్యాలీ లో మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండా ఎగర వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఘర్ ఘర్ తిరంగ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరిలో దేశభక్తి భావన మరింత పెరుగు తుందన్నారు. జాతీయ జెండా భారతదేశఐక్యత, సమగ్రత, గౌరవం, దేశభక్తికి ప్రతీక అన్నారు.ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తి స్ఫూర్తిని చాటాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. మన జాతీయ జెండా స్ఫూర్తిని ప్రతి ఇంటికి చేర్చే ఉద్దేశంతో ఈ ర్యాలీ నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయ కులు ఉడుత నవీన్, మాణిక్య రెడ్డి, శ్రీనివాస్ వర్మ, మాధవ్, మల్లికార్జున గౌడ్, కార్తీక్ గౌడ్, అజయ్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, లక్ష్మణ్ ముదిరాజ్, మురళి, రామ్మోహన్ గౌడ్, వెంకటేష్, పద్మిని, కరుణశ్రీ, సుజాత, ఉషతో పాటుగా అధిక సంఖ్యలో యువకులు, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

## చెత్త సేకరణ ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షించాలి

**- రోడ్లపై పశువులు సంచరించకుండా చర్యలు చేపట్టాలి - కలెక్టర్ భవేష్ మిశ్రా**

**- డంపింగ్ యార్డు సందర్శన**



నిజామాబాద్, ఆగస్టు 13 : (విజన్ ఆంధ్ర )ఇంటింటికి తిరుగుతూ చెత్తను సేకరించే ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. రోడ్లపై ఎక్కడబడితే అక్కడ పశువులు సంచరించకుండా తక్షణ చర్యలు చేపట్టాలని నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ ను ఆదేశించారు. నాగారం శివారులోని డంపింగ్ యార్డును కలెక్టర్ గురువారం సందర్శించారు. నగర పాలక సంస్థ పరిధిలో రోజువారీగా ఇంటింటికీ తిరిగి సేకరించే చెత్తను డంపింగ్ యార్డు వద్ద నిలువ చేస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెత్తను ఆయా విభాగాల వారీగా వేరు చేస్తూ, ఎరువులు, ఇతర అవసరాల వినియోగం కోసం యంత్రాల సహాయంతో శుద్ధి చేస్తున్న విధానాన్ని పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు సగటున ఎంత పరిమాణంలో చెత్తను శుద్ధి చేస్తున్నారు, ఎరువును ఎవరికి అందజేస్తున్నారు తదితర వివరాలను ఆరా తీశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా బయో మైనింగ్ సులభం అవుతుందని అన్నారు. వ్యర్థాలను శుద్ధి చేస్తూ కంపోస్ట్ తయారీ కోసం ప్రతిపాదించిన మేరకు వేస్టేజ్ ప్రాసెస్సింగ్ యంత్రాల ద్వారా శుద్ధి ప్రక్రియ జరిపించాలన్నారు. కాగా, నగరంలో ప్రధాన మార్గాలలో రహదారులపై ఎక్కడబడితే అక్కడ ఆవులు, ఇతర పశువులు సంచరిస్తుండడం వల్ల ప్రజలు, ప్రత్యేకించి వాహన చోదకులు ప్రమాదాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని పశువులు రోడ్లపై సంచరించకుండా తగిన చర్యలు తీసుకోవాలని, రోడ్లపై తిరిగే పశువులను గోశాలకు తరలించాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇతర అధికారులు ఉన్నారు.

## అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ వ్యక్తిపై కేసు నమోదు



తెలకపల్లి ఆగస్టు 13 (విజన్ ఆంధ్ర) మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ అలీ అనే వ్యక్తి ఇంటి వద్ద అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉంచారన్న సమాచారం మేరకు సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్ హేమ్లా నాయక్, తెలకపల్లి ఎస్సై రమేష్ సమక్షంలో గురువారం ఘటనా స్థలానికి వెళ్లి తనిఖీలు చేపట్టారు ఈ తనిఖీల్లో ఇంటి కాంపౌండ్ నందు 12 ప్లాస్టిక్ బ్యాగులలో ఉన్న ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి పట్టుకొని సీజ్ చేశారు డిప్యూటీ తహసిల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించినట్లు ఎస్ఐ తెలిపారు

### యువతి యువకులకు ఉచిత పోలీస్ శిక్షణ తరగతులు ఎస్సై,సి హెచ్,సురేష్ కుమార్




లింగాపూర్ ఆగస్టు 13(విజన్ ఆంధ్ర )తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పోలీసు రిక్రూట్మెంట్ నోటిఫికేషన్ విడుదల చేసింది,జిల్లా ఎస్పీ ఆదేశాల అనుసారంగా దీనిని దృష్టిలో పెట్టుకొని లింగాపూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన యువతి యువకులకు ఉచిత పోలీస్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు లింగాపూర్ ఎస్సై సి హెచ్, సురేష్. కుమార్ గురువారం పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసక్తిగల యువతీ యువకులు ఇంటర్ విద్యార్హత కలిగిన ధ్రువీకరణ పత్రాలను తీసుకువచ్చి లింగాపూర్ పోలీస్ స్టేషన్ లో సమర్పించాలని పేర్కొన్నారు.

# వివాహేతర సంబంధం... డబ్బుల కోసం ప్రియురాలి దారుణ హత్య

**- కొట్ర గ్రామంలో కలకలం...**

**- డీజిల్ పోసి నిప్పంటించిన ఘరానా ప్రియుడు..**



మృతి చెందిన అనూష (ఫైల్ ఫోటో )...



ప్రియురాలు అనూషను హత్య చేసిన ప్రియుడు రాము... (ఫైల్ ఫోటో)

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర,ఆగస్ట్ 13: నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కొట్ర గ్రామంలో వివాహేతర సంబంధం కారణంగా దారుణ హత్య చోటుచేసుకుంది. ప్రియుడే ప్రియురాలిని హత్య చేసి మృతదేహాన్ని దహనం చేశాడు.

**- ఘటన వివరాలు ఇలా:**

కొట్ర గ్రామానికి చెందిన నారుమళ్ల అనూష(22) కల్వకుర్తి పట్టణంలోని ఓ లేడీస్ కార్నర్‌లో పనిచేస్తుంది. ఆమె భర్త చెన్నయ్య ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. వివాహమైనప్పటికీ అదే గ్రామానికి చెందిన రాముతో అనూషకు కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగుతుంది. ఈ క్రమంలో అనూష రాముకు పెద్ద మొత్తంలో డబ్బులు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆ డబ్బులు తిరిగి అడగడంతో ఇద్దరి మధ్య విభేదాలు వచ్చాయి.

**- 15-20 రోజులుగా ప్లాన్ చేసి హత్య**


అనూష మాటికీ డబ్బులు అడగడంతో డబ్బు ఇవ్వకుండా ఉండేందుకు రాము ముందుగానే స్కెచ్ వేశాడు. హత్య చేసేందుకు వీలుగా గ్రామ సమీపంలోని ఒడ్డనిరాళ్ల వద్ద కట్టెలు కూడా తెచ్చి పేర్చుకున్నట్లు సమాచారం. బుధవారం రాత్రి అనూషను మాటలతో ఒడ్డనిరాళ్ల వద్దకు తీసుకెళ్లిన రాము, సహచరుడి సహాయంతో ఆమెను గొంతు పిసికి హత్య చేశాడు. ఆధారాలు నాశనం చేసేందుకు డీజిల్ పోసి నిప్పంటించి పరారయ్యాడు.



రాళ్ళ మధ్యలో అనూష మృతదేహానికి నిప్పు పెట్టి చంపిన ఘటన స్థలం...

**- పోలీసుల దర్యాప్తు**

విషయం తెలుసుకున్న సీఐ రఘువీర్ రెడ్డి, ఎస్సై యుగంధర్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. అక్కడ మృతదేహ అవశేషాలు, మాంసపు ముద్రలు లభించాయి. ఈ కేసును ఇంచార్జి అచ్చంపేట డి.ఎస్.పి శ్రీనివాసులు స్వయంగా దర్యాప్తు చేపట్టారు. విచారణలో రాముతో పాటు మరో వ్యక్తి పాల్గొన్నట్లు తేలడంతో ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. గురువారం సాయంత్రం నిందితులను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి రిమాండ్ కు తరలించనున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొనడంతో కల్వకుర్తి సీఐ భీమ్ కుమార్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు...



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డి.ఎస్.పి శ్రీనివాసులు సిఐ రఘువీరారెడ్డి....

# రాష్ట్రీయ సైనిక్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

**- 400 మందికి ఉచిత వైద్య పరీక్షలు, మందులు పంపిణీ**

మల్కాజిగిరి, ఆగస్ట్ 13,(విజన్ ఆంధ్ర): రాష్ట్రీయ సైనిక్ సంస్థ తెలంగాణ అధ్యక్షులు మేజర్ జనరల్ ఎన్. శ్రీనివాసరావు, సంస్థ ఆర్గనైజింగ్ జనరల్ సెక్రటరీ గోపు రమణారెడ్డి ఆధ్వర్యంలో గురువారం కేంద్రీయ విద్యాలయ, ఆర్.కె. పురం పాఠశాలలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కేంద్రీయ విద్యాలయ ఆర్.కె. పురం ప్రిన్సిపల్ చంద్రశేఖర్ సహకారంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో సుమారు 400 మంది విద్యార్థులకు, ఉపా ధ్యాయులకు, సిబ్బందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో మెడికవర్ హాస్పిటల్స్ వైద్య బృందం, మ్యాక్స్ విజన్ ఐ హాస్పిటల్ వైద్య బృందం, ఆర్మీ కాలేజ్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ బృందం పాల్గొని ఉచితంగా నేత్ర, దంత, -సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహిం చారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ వైద్య సలహాలు అందజేశారు. ఈ వైద్య శిబిరాన్ని ఓపెన్ సంస్థ అధ్యక్షులు, ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రాల నిర్వహకులు గోపు రమణారెడ్డి ప్రత్యేకంగా పర్యవేక్షించి, వివిధ ఆసుపత్రుల వైద్య బృందాలను సమన్వయం చేసి, విద్యార్థులకు అవస రమైన మందులను ఉచి తంగా అందించేలా చర్యలు తీసుకున్నారు.




**- ప్రతి తరగతికి ఫస్ట్ ఎయిడ్ బాక్స్...**

ఈ సందర్భంగా రాష్ట్రీయ సైనిక్ సంస్థ తెలంగాణ అధ్యక్షులు మేజర్ జనరల్ ఎన్. శ్రీనివాసరావు మాట్లాడుతూ, కేంద్రీయ విద్యాలయ ఆర్.కె. పురం పాఠశాలలోని ప్రతి తరగతి గదికి ఒక ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌ను త్వరలో అందజే యడానికి రాష్ట్రీయ సైనిక్ సంస్థ సిద్ధంగా ఉందని తెలిపారు. అదే విధంగా విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే వికసిత్ భారత్, వ్యక్తిత్వ వికాసం, విద్య, ఆరోగ్యం, దేశ సేవ, కెరీర్‌కు సంబంధించిన అంశాలపై నిపుణులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు భవిష్యత్తులో నిర్వహిస్తామని ఆయన హామీనిచ్చారు.

**- పాఠశాల అభివృద్ధికి పూర్తి సహకారం**

రాష్ట్రీయ సైనిక్ సంస్థ ఆర్గనైజింగ్ జనరల్ సెక్రటరీ గోపు రమణారెడ్డి మాట్లా డుతూ, కేంద్రీయ విద్యాలయ ఆర్.కె. పురం పాఠశాల విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి రాష్ట్రీయ సైనిక్ సంస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు తమ సంస్థ సిద్ధంగా ఉందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలతో పాటుగా విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని చెప్పారు.

**- ప్రిన్సిపల్, సిబ్బంది అభినందనలు**

ఈ ఉచిత మెగా వైద్య శిబిరం పట్ల కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి వైద్య శిబిరాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన రాష్ట్రీయ సైనిక్ సంస్థకు మరియు వైద్య బృందాలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. సుమారు 400 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచిత మందులు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ కోఆర్డినేటర్ హరీష్ యాదవ్, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ చంద్రశేఖర్, వైద్య బృందం పాల్గొన్నారు

## గోవిందపేట్ బ్రిడ్జి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

**- ఆగి ఉన్న టూరిస్ట్ బస్సును ఢీకొన్న లారీ ఇద్దరు మహిళలు దుర్మరణం , మరో ఇద్దరికి తీవ్ర గాయాలు**

**- సంఘటన స్థలానికి పర్యవేక్షణ చేసిన పోలీస్ కమీషనర్**






నిజామాబాద్ ఆగస్టు13:( విజన్ ఆంధ్ర) : తీర్థయాత్రకు బయలుదేరిన భక్తులకు ఆర్మూర్ మండల పరిధిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. జాతీయ రహదారిపై టైర్ పంచర్ కావడంతో ఆగి ఉన్న టూరిస్ట్ బస్సును వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కిన్వట్ ప్రాంతానికి చెందిన భక్తులు హైదరాబాద్‌లోని చిన్న జీయర్ స్వామి దర్శనం కోసం రెండు టూరిస్ట్ బస్సుల్లో తీర్థయాత్రకు బయలుదేరారు. ఆర్మూర్ మండల పరిధిలోని గోవింద్‌పేట్ బ్రిడ్జి సమీపానికి చేరుకున్న సమయంలో ముందుగా వెళ్తున్న టూరిస్ట్ బస్సు ు+ 01 ు 1864 టైర్ పంచర్ కావడంతో రెండు+ 21 ు 2172 బస్సులను జాతీయ రహదారిపై నిలిపివేశారు. టైర్ పంచర్ కావడంతో బస్సులోని కొంతమంది ప్రయాణికులు కిందికి దిగి , రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌పై కూర్చుని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇదే సమయంలో వెనుక వైపు నుంచి వేగంగా వస్తున్న లారీ ు 27 ుఖీ 7482 డ్రైవర్ ఆగి ఉన్న టూరిస్ట్ బస్సును సకాలంలో గుర్తించకపోవడంతో బస్సును బలంగా ఢీకొట్టాడు. లారీ ఢీకొట్టడంతో ఆగి ఉన్న టూరిస్ట్ బస్సు ముందుకు కదిలి , డివైడర్ ప్రాంతంలో కూర్చున్న ప్రయాణికులపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో సుజాత ( 54 ) , మాధవి ( 47 ) అనే ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు ప్రయాణికులు సునీత , చిటక్క లకు తీవ్రంగా గాయపడటంతో వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులకు వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడ ఉన్న ఇతర ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా, పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

**- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీస్ కమిషనర్**

ఘటన సమాచారం అందుకున్న లినిజామాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ పి. సాయి చైతన్య, ఐ.పి.యస్., సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును సంబంధిత పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు , వాహనాలు ఏ విధంగా నిలిపి ఉన్నాయనే అంశాలతో పాటు లారీ ఢీకొన్న తీరును అధికారులు కమిషనర్‌కు వివరించారు. సంఘటనా స్థలంలో సహాయక చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ , క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించిన విధానం తదితర అంశాలను కమిషనర్ పరిశీలించారు. అనంతరం క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని , వారి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేలా చర్యలు చేపట్టారు. ప్రమాదాల నివారణకు ప్రత్యేక జాగ్రత్తలు అవసరం జాతీయ రహదారులపై వాహనాలు టైర్ పంచర్ కావడం, సాంకేతిక లోపాలు ఏర్పడటం వంటి సందర్భాల్లో వాహనాలను రహదారిపై నిలిపినప్పుడు అత్యంత జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచించారు. ముఖ్యంగా వాహనంలోని ప్రయాణికులు రహదారిపైకి వచ్చి డివైడర్లు లేదా రహదారి పక్కన కూర్చోవడం అత్యంత ప్రమాదకరమని తెలిపారు. వాహనం ఆగిపోయిన వెంటనే ప్రమాద హెచ్చరిక లైట్లు ఆన్ చేయడంతో పాటు, తగిన దూరంలో రిఫ్లెక్టివ్ వార్నింగ్ ట్రయాంగిల్స్ లేదా ఇతర హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రయాణికులు కూడా రహదారిపై కాకుండా సురక్షితమైన ప్రదేశంలో ఉండాలని పోలీసులు స్పష్టం చేశారు. ఈ ఘటనపై సంబంధిత పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల పూర్తి కారణాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించి లారీ డ్రైవర్ నిర్లక్ష్యం , అతివేగం తదితర అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్మూర్ ఎ.సి.పి శ్రీ వెంకటేశ్వర్ రెడ్డి , ఆర్మూర్ ఎస్హెచ్ఓ శ్రీ సత్యనారాయణ , ఆర్మూర్ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీ రాహుల్ కుమార్ , ఆర్మూర్ , జక్రాన్ పల్లి , బాల్కొండ ఎస్సైలు మరియు అసిస్టెంట్ ఎం.వి.ఐ తదితరులు పాల్గొనడం జరిగింది

# సీజనల్ వ్యాధులపై సమీక్షించిన డిఎంహెచ్వో

నిజామాబాద్ ఆగస్టు13:( విజన్ ఆంధ్ర) : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు, జీవనశైలి వ్యాధులు , క్షయ వ్యాధి,వ్యాధి నిరోధక టీకాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి రాజశ్రీ గారు సమీక్ష నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పరిసరాల పరిశుభ్రత, నీటి ట్యాంకులను వారానికోసారి తప్పకుండా శుభ్రం చేస్తూ ప్రతిరోజు బ్లీచింగ్ పౌడర్ కలిసిన క్లోరినేషన్ వాటర్ ని తాగాలని, నీటి నిల్వలను తొలగించాలని, కాలి ప్లాట్లు, మురికినీటి నిల్వల్లో ఆయిల్ బాల్స్ ను వదలాలని, డెంగీ వ్యాధి వచ్చిన ఇంటి చుట్టూ 50 ఇళ్లలో పైరత్నం స్ప్రే చేయాలని, 100 ఇళ్ల వరకు టెమిపాస్ స్ప్రే చేయాలనీ, ఇంటింటికి జర సర్వేను నిర్వహించి, ఉచిత ఆరోగ్య శిబిరాలను నిర్వహించాలన్నారు. ప్రతిరోజు రక్త పరీక్షలను నిర్వహించాలన్నారు. యాంటీ లార్వల్ స్ప్రేను, ఫాగింగ్ ను నిర్వహించాలన్నారు. డెంగీ సోకిన వారి దగ్గర అసలు ద్రవ ఆహారాలను తరచుగా తీసుకోవాలని, పారాసెటమాల్ మాత్రలు వేసుకుంటూ విశ్రాంతి తీసుకోవాలన్నారు, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే నిర్వహించాలని, సీజనల్ వ్యాధులపై ప్రజల్లో పాఠశాలలో, కళాశాలలో విస్తృతంగా అవగాహన కలిగించాలన్నారు. నీటి కాలుష్యం వల్ల వ్యాపించే వ్యాధులను నీటి పరీక్ష కిట్లను ఉపయోగించి నీటి నాణ్యతను పరీక్షించాలన్నారు తద్వారా టైఫాయిలు డయేరియా అతిసారా కలరా మొదలగు వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పడాలన్నారు, క్షయ వ్యాధిగ్రస్తుల కోసం నిర్వహించే క్షయ నిర్ధారణ పరీక్షలను ప్రజలు వినియోగించుకోనేలా చూడాలని, క్షయ వ్యాధిగ్రస్తులు 6 నెలల చికిత్స కోర్సును వాడాలన్నారు, జీవనశైలి వ్యాధుల్లో భాగంగా 30 సంవత్సరాల పైబడిన వారిని హైపర్ టెన్షన్ మధుమేహం క్యాన్సర్ కోసం నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలి అన్నారు, పరీక్షల కోసం పెండింగ్లో ఉన్న వారందరినీ పరీక్షించి ఎమ్మా లాగిన్ లో నమోదు చేయాలన్నారు. ఇప్పటికే చికిత్స తీసుకుంటున్న వారందరినీ లైన్ లిస్టు ద్వారా ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. వ్యాధి నిరోధక టీకాల ద్వారా నియంత్రించే వ్యాధులను టీకాలు తీసుకోవడం ద్వారా నియంత్రించవచ్చు అన్నారు. అనుమానిత కేసులైన ఏ ఎఫ్ పి, మీజిల్స్ శాంపుల్స్ ను సేకరించి పంపించాలన్నారు, ఇంకా ఈ కార్యక్రమంలో డిటిసి ఓ డాక్టర్ దేవి నాగేశ్వరి, పి ఓ డి టి డాక్టర్ అంజన, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ సికందర్ నాయక్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వెంకన్న, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ శ్రావ్య, డిస్టిక్ ఫార్మసీ సూపర్వైజర్ నారాయణ, హెచ్ఈఈవో జహీద్ ఆఫీస్, డిప్యూటీ డెమో దుర్గారావు, డి హెచ్ ఈ ఘన్పూర్ వెంకటేశ్వర్లు వివిధ పీహెచ్సీల సిహెచ్ ఓలు, హెచ్ ఈ లు, హెచ్ ఇ ఓ లు, సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



## 4లక్ష రూపాయల ఎల్ఓసి. లెటర్ ను అందజేసిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి



గద్వాల ఆగస్టు 13 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు గద్వాల మండలం పరిధిలోని సంగాల గ్రామానికి చెందిన టి. భారతి భర్త టి. సవారన్న మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయిన 4లక్ష రూపాయల ఎల్ఓసి. లెటర్ ను గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి చేతుల మీదుగా అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో నాయుకులు జగదీశ్వర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, మద్దిలేటి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భవిత కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

**- ప్రభుత్వ పాఠశాలల్లో శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి కలెక్టర్ చిత్రా మిశ్రా**



కరీంనగర్, ఆగస్టు 13 విజన్ ఆంధ్ర : ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చి.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా.. ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ధన్గర్ వాడీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న భవిత కేంద్రం, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. భవిత కేంద్రంలో గదులు కలియ తిరుగుతూ రిజిస్టర్ పరిశీలించారు. పిల్లలు, సిబ్బంది వివరాలు, చిన్నారులకు అందిస్తున్న ఫుడ్ వివరాలు, ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. జిల్లాలోని 16 భవిత కేంద్రాల్లో తాగునీరు(వాటర్ డిస్పెన్సరీలు ) ఏర్పాటు చేయాలన్నారు. ఇక్కడి ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు సైతం యూనిఫామ్, పుస్తకాలు అందించాలని అధికారులను ఆదేశించారు. భవిత కేంద్రంలో పేరెంట్స్ వెయిటింగ్ రూమ్, ప్రత్యేక వాష్ రూమ్, ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేక ప్లేట్లు, గ్లాసులు అందించాలన్నారు. ప్రతి భవిత కేంద్రంలో సరిపడా సిబ్బంది(సమ్మిళిత విద్యా బోధకులు) ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రానికి వెళ్లి గదులు పరిశీలించారు.. అందిస్తున్న సౌకర్యాలు తెలుసుకున్నారు. పాఠశాలలో వృధాగా ఫర్నిచర్, బెంచీలు ఉండటంపై అసహన వ్యక్తం చేశారు. ఏర్పాట్లు చేసి వినియోగంలోకి తేవాలని సూచించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నిరుపయోగంగా ఉన్న ఫర్నిచర్, బెంచీలను అవసరమైన పాఠశాలలకు తరలించాలని ఆదేశించారు. పిల్లలు కింద కూర్చోకుండా విధిగా బెంచీలు ఏర్పాటు చేయాలన్నారు. స్క్రాప్ ను తొలగించి పరిసరాలను శుభ్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఉన్న వనరులను వృధాగా ఉంచకుండా వినియోగంలోకి తీసుకురావాలని పేర్కొన్నారు.ఆ తర్వాత డాక్టర్ స్ట్రీట్ లో ఉన్న అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ ను కలెక్టర్ విద్యాశాఖ అధికారులతో కలిసి సందర్శించారు. స్కూల్ భవనం శిథిలావస్థకు చేరినందున.. మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. అప్పటివరకు తాత్కాలికంగా ముకరంపురలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్లోకి ఈ స్కూల్ ను తరలించాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. హై స్కూల్ తరగతి గదులు శిథిలావస్థకు చేరినందున తొలగించి.. పెద్ద భవనం నిర్మించాలన్నారు. భవనం చుట్టూ ప్రహరీ, అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. స్మార్ట్ సిటీ కింద ఏ పాఠశాలల్లో ఎన్ని నిధులు ఖర్చు చేశారో నివేదిక అందించాలని అధికారులకు సూచించారు.

## స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి...

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 13,(విజన్ ఆంధ్ర)ఈ నెల 15వ తేదీన 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేడుకలలో భాగంగా వేదిక అలంకరణ, ప్రముఖులు, మీడియా గ్యాలరీ, అధికారులు, ప్రజలు కూర్చుని గ్యాలరీలలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. షామియానాలు, కుర్చీలు, సౌండ్ సిస్టం, స్టాల్ ఏర్పాటు స్థలం, విద్యార్థుల నృత్య ప్రదర్శన స్థలాన్ని చదును చేయాలని అధికారులకు సూచించారు. ఎలాంటి అసౌకర్యం కలగకుండా త్రాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని తెలిపారు. అంతకుముందు పోలీస్ పరేడ్ మైదానానికి చేరుకున్న జిల్లా కలెక్టర్ పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు నదీమ్, సురేష్, సిద్దిక్, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నవాబుపేట్ ఐజేయూ అధ్యక్షుడి ఏకగ్రీవ ఎన్నిక


**"జర్నలిజం మా వృత్తి... సమాజ సేవ మా లక్ష్యం" అనే నినాదంతో ముందుకు**



నవాబుపేట్, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 13: ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ నవాబుపేట్ మండల నూతన పాలకవర్గం ఏకగ్రీవంగా ఏర్పడింది. గురువారం జరిగిన సమావేశంలో జర్నలిస్టులందరి ఆమోదంతో కొత్త కమిటీని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో నవాబుపేట్ మండల ఐజేయూ అధ్యక్షుడిగా వి.రాఘవేంద్ర చారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. "జర్నలిజం మా వృత్తి... సమాజ సేవ మా లక్ష్యం" అనే స్ఫూర్తితో కొత్త కమిటీ పనిచేస్తుందని పాలకవర్గ సభ్యులు తెలిపారు. నూతన అధ్యక్షుడి నాయకత్వంలో జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని, అదే సమయంలో మండలంలోని ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు పేర్కొన్నారు. ఐజేయూ మరింత బలోపేతంగా, ప్రజా గొంతుకగా ముందుకు సాగుతుందని ఆకాంక్షించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధ్యక్షుడు వి. రాఘవేంద్ర చారితో పాటు పాలకవర్గ సభ్యులకు మండలంలోని విలేకరులు, సీనియర్ జర్నలిస్టులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నవాబుపేట్ మండల ఐజేయూ నూతన పాలకవర్గ సభ్యులు, సీనియర్ జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటా

**- మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి**



అల్వాల్, ఆగస్ట్ 13,(విజన్ ఆంధ్ర): అల్వాల్ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తగిన చర్య లు తీసుకుంటానని మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం ఆమె, అల్వాల్ డివిజన్ పరిధిలోని రామ్ నగర్ కాలనీ, టెంపుల్ అల్వాల్ తదితర ప్రాంతాల్లో పర్య టించారు. ఈ సందర్భంగా ఆమె, స్థానిక ప్రజలను కలిసి వారు ఎదుర్కొంటు న్న స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దీనికి స్థానికులు మాట్లా డుతూ...డ్రైనేజీ మ్యాన్ హోల్స్ నిండి మురుగు నీరు రోడ్లపైకి చేరుతోందని తెలి పారు. తద్వారా పాదచా రులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని, ఈ సమ స్యను వెంటనే పరిష్కరిం చాలని ఆమెను కోరారు. విద్యుత్ స్తంభం కూడా ఒక సైడ్ కు వంగి ప్రమాదకరం గా మారిందని కాలనీ వాసులు తెలిపారు. దీనికి సానుకూలంగా స్పందించిన మాజీ కార్పొ రేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడు తూ...మీరు నాకు విన్న వించిన కాలనీ సమస్య లను సంబంధిత అధికా రుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తానని హామీని చ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు రాజశేఖర్, బాలసుబ్రహ్మణ్యం, కుమా ర్, స్థానిక నాయకులు లింగారెడ్డి, అరుణ్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల ఎన్నో ఏళ్ల కల ప్రజాపాలన సీఎం నాయకత్వంలో నెరవేరింది

**- ఇందిరమ్మ ఇల్లు ను ప్రారంభించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి**



గద్వాల ఆగస్టు 14 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం కేంద్రంలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు.ధరూర్ మండలం కేంద్రానికి చెందిన పరశురాముడు ఆహ్వానం మేరకు నూతన ఇందిరమ్మ గృహప్రవేశానికి ఎమ్మెల్యే రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు.నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేసిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే కానుకను అందజేశారు.ఎమ్మెల్యే కి లబ్ధిదారులు శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన ఇందిరమ్మ ఇల్లు ను ప్రారంభించిన లబ్ధిదారులకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్లు చేపట్టిన పథకం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి కావడం లబ్ధిదారులు నూతన గృహప్రవేశం చేయడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజలు ఎవరు కూడా ఆందోళన అపోహాలు పడాల్సిన అవసరం లేదని, ఇల్లు కట్టించుకుంటే డబ్బులు రావని అపోహాలు వద్దు ఇల్లు రానివారికి ఎవరు కూడా అపోహ పడవద్దండి. రెండో విడతలో త్వరలో కూడా అర్హులైన లబ్ధిదారులు కు మంజూరు ఏవిధంగా కృషి చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి నిర్మాణానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం. రేవంత్ రెడ్డి కి గృహనిర్మాణ శాఖ మంత్రివర్యులు పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి కి గద్వాల నియోజకవర్గ ప్రజలందరి తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళు గా మా సొంతింటి కల ప్రజాపాలన సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సారథ్యంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గ సహకారంతో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి మాకు చాలా సంతోషంగా ఉన్నదని మేము ఎల్లప్పుడూ సీఎం కి, మంత్రి కి, మా ఎమ్మెల్యే కి రుణపడి ఉంటామని వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మెన్ జంబు రామన్ గౌడ్, మాజీ ఎంపీపీ విజయ్, ధరూర్ సర్పంచ్ విజయ్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, కర్రెప్ప, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## "మిమిక్రీ అశోక్" ను వరించిన "ఇట్ క్లా - తెలుగు వెలుగు" పురస్కారం



హైదరాబాద్ ఆగష్టు 2026, విజన్ ఆంధ్ర ( ఆకెళ్ళ. విశ్వనాథ్ ): దేశ విదేశాలలో తెలుగు భాషా సంస్కృతి సంప్రదాయాలు నిత్య నూతనంగా వెలసిల్లే రీతిలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రముఖ సాంస్కృతిక సంస్థ "సమీకృత అంతర్జాతీయ తెలుగు సాంస్కృతిక సారస్వత సంస్థ "ఇట్ క్లా", వ్యవస్థాపక అధ్యక్షుడు సంస్కృతి రత్న, డాక్టర్. కె. ధర్మారావు నేతృత్వంలో నిర్వహించిన సంస్థ 32వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని వివిధ రంగాలలో విశేష సేవలు అందిస్తున్న ప్రముఖులను, కళాకారులను ఎంపిక చేసి వారికి "ఇట్ క్లా – తెలుగు వెలుగు" పురస్కారాల ప్రధానం కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. శనివారంనాడు త్యాగరాయ గానసభ, చిక్కడపల్లి, హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన "ఇట్ క్లా" పురస్కారాల ప్రధానోత్సవం కార్యక్రమంలో ప్రముఖుల మాటలను వడపోస్తూ, గత 30 సంవత్సరాలుగా తన అసాధారణమైన ప్రతిభా పాటవాలతో మిమిక్రీ చేస్తూ వేలాది ప్రముఖుల మాటలను అనుకరిస్తూ, ఆనందాన్ని పంచుతున్న బహుముఖ ప్రజ్ఞాశాలి, కళామతల్లి ముద్దుబిడ్డ, ప్రఖ్యాత మిమిక్రీ కళాకారుడు, స్వర సవ్య సాచి, "అశోక్ కుమార్ (మిమిక్రీ అశోక్)", తన ప్రదర్శనల ద్వారా లక్షలాది మందికి ఆనందాన్ని, మానసిక ప్రశాంతతను అందిస్తూ, అదేవిధంగా అటు హిందీలోనూ, ఇటు తెలుగులోనూ అత్యుత్తమమైన ప్రతిభతో మిమిక్రీ అలాగే టాకింగ్ డాల్ ద్వారా అర్జునుడులా ఆనంద బాణాలు విసురుతూ, ఎన్నో వేలాది కార్యక్రమాలలో ప్రేక్షకులను విశేషంగా అలరిస్తున్న స్వర సామ్రాట్ "మిమిక్రీ అశోక్ కుమార్ ", ప్రతిభ ను గుర్తించి ఈ కార్యక్రమంలో "ఇట్ క్లా – తెలుగు వెలుగు" పురస్కారాన్ని అతిథులు ఆయనకు ప్రధానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి ముఖ్య అతిథిగా హాజరై పురస్కార గ్రహీతలను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. విశిష్ట అతిథులుగా శ్రీ వెంకటేశ్వర విశ్వవి ద్యాలయం పూర్వ ఉపకు లపతి ఆచార్య కొలకలూరి ఇనాక్,యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం అర్చకులు లక్ష్మీ నరసిం హాచార్యులు, ఇట్ క్లా ఛైర్మన్ రేలంగి నరసింహారావు, కన్వీనర్ రామసత్య నారాయణ పాల్గొని మధుర గళ సంపన్నుడు మిమిక్రీ అశోక్ కుమార్ తోపాటు కామే శ్వరి, హనుమాం డ్ల భూమయ్య, టి. విజయబాబు, వనజాఉదయ్, జె. కె భారవి, డా. ఎన్. అనంతలక్ష్మి, కంచర్ల వెంకట రమణ, యాంకర్ గాంధీ, బింగి నరేందర్ గౌడ్, మారుతి ప్రసాద్, గౌతమ్ రాజు లకు "ఇట్ క్లా – తెలుగు వెలుగు" పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించి, ప్రశంశించి వారి ప్రతిభను కొనియాడారు. ఈ సంధర్భంగా తన అద్భుతమైన మిమిక్రీ ప్రదర్శనతో 'మిమిక్రీ అశోక్ కుమార్' అతిథులను, ప్రేక్షకులను అలరించారు.



ప్రముఖ కూచిపూడి నాట్య గురువు, పద్మశ్రీ, దీపికా రెడ్డి శిష్యురాలు కుమారి రూపశ్రీ బాలరాజు కూచిపూడి రంగప్రవేశం నేత్ర పర్వంగా జరిగింది. రవీంద్ర భారతి ప్రధాన మందిరంలో శనివారంనాడు కన్నుల పండుగగా నిర్వహించిన కుమారి రూపశ్రీ బాలరాజు నృత్య కార్యక్రమానికి అతిథులుగా ఎమ్మెల్యే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఎం. బుద్ధ ప్రసాద్, వ్యవస్థాపకురాలు అన్నమాచార్య భవవా వాహిని, డాక్టర్ శోభా రాజు, చిత్రకారుడు, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, ఆంధ్రనాట్యం ప్రదర్శన గురువు కళాకృష్ణ హాజరై కుమారి రూపశ్రీ ని, తీర్చిదిద్దిన గురువు దీపిక రెడ్డి ని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలి - మంత్రి సీతక్క



ములుగు ఆగస్ట్ 13, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు జిల్లాలో ఈ నెల 16వ తేదీనలి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. గురువారం మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్‌లతో కలిసి పైలాన్ నిర్మాణ పనులు, నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పైలాన్ పనుల్లో నాణ్యత పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని, కలెక్టరేట్‌లో పారిశుధ్యం, విద్యుత్, తాగునీరు, పార్కింగ్ వంటి మౌలిక సదుపాయాలు సిద్ధం చేయాలని సూచించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి పర్యటన వివరాలు: మధ్యాహ్నం మేడారం చేరుకుని సమ్మక్క–సారలమ్మ వనదేవతలకు ప్రత్యేక పూజలు చేస్తారు. అక్కడి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన వితంతు, ఒంటరి మహిళలకు పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఆగస్టు 31 వరకు దరఖాస్తు చేసుకున్న వారిని పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తామని తెలిపారు. అనంతరం గట్టమ్మ సమీపంలో రూ. 16 వేల కోట్ల హ్యామ్ రోడ్ల పనులకు పైలాన్ ఆవిష్కరిస్తారు. ఆ తర్వాత ములుగు నూతన కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి, సమీకృత కార్యాలయాల సముదాయాన్ని ప్రారంభిస్తారు. కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసే బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని మంత్రి సీతక్క ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవీందర్ చందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో నిర్లక్ష్యం వద్దు.

**- లక్ష్యాలు వంద శాతం సాధించాలి**

**- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు.**



ములుగు ఆగస్టు 13, విజన్ ఆంధ్ర ప్రతినిధి : జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి లిడాక్టర్ గోపాల్ రావులి హెచ్చరించారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం సాధించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఇంచార్జ్ వైద్యులు ప్రతి నెలా ఆరోగ్య సిబ్బందితో సమావేశమై కార్యక్రమాలను సమీక్షించాలన్నారు.

**– వర్షాకాల వ్యాధులపై ప్రత్యేక దృష్టి**

మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, డయేరియా వంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆశా కార్యకర్తలు ప్రతిరోజు ఇంటింటి సందర్శన చేసి ఇంట్లోని కంటైనర్లలో దోమల లార్వాను గుర్తించి తొలగించాలని ఆదేశించారు. జ్వరంతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి చికిత్స అందించాలన్నారు.

– హెచ్ పి వి వ్యాక్సిన్ ఉధృతం చేయాలి

పద్నాలుగు సంవత్సరాలు నిండిన బాలికలందరికీ హెచ్ పి వి వ్యాక్సిన్ ఇవ్వాలని, ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, గిరిజన సంక్షేమ పాఠశాలలను సందర్శించి వ్యాక్సిన్ పై ఉన్న అపోహలను తొలగించాలని వై ద్యా ధి కా ర ు ల క ు సూచించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కేంద్రాల్లో రోజువారి ఓపీ పెంచాలని, గర్భిణీ స్త్రీలను పన్నెండు వారాలలోపు నమోదు చేసి, రక్తహీనత ఉన్నవారికి ఐరన్ మాత్రలు అందించాలని తెలిపారు. క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో కేసుల నమోదు పెంచి, నిర్ధారణ అయిన వారికి చికిత్స, ఫాలోఅప్ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఐటిడిఏ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ క్రాంతి, జిల్లా కార్యక్రమ అధికారులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ రవితేజ, డాక్టర్ నాగన్నయ్య, మాస్ మీడియా అధికారి సంపత్, కమ్యూనిటీ హెల్త్ అధికారి దుర్గారావు, జిల్లా ప్రోగ్రాం పర్యవేక్షకులు వెంకట్ రెడ్డి, సురేష్ బాబు, భూపాల్ రెడ్డి తో పాటు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు వెంటనే యూనిఫామ్స్ ఇవ్వాలి

**- ఆలస్యంపై బీజేవైఎం నిరసన - కలెక్టరేట్ ముందు అర్ధనగ్న ప్రదర్శన**



ములుగు, ఆగస్టు13;విజన్ ఆంధ్ర ప్రతినిధి : విద్యా సంవత్సరం ప్రారంభమై నెలలు గడుస్తున్నా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇంకా యూనిఫామ్స్ అందకపోవడాన్ని నిరసిస్తూ లిభారతీయ జనతా యువ మోర్చాలి జిల్లా అధ్యక్షులు లిమేడుదుల మమన్ యాదవ్లి నేతృత్వంలో కలెక్టర్ కార్యాలయం ముందు అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. ఈ నిరసనకు ముఖ్య అతిథిగా హాజరైన లిబీజేపీ జిల్లా అధ్యక్షులులి మాట్లాడుతూ, యూనిఫామ్ అనేది కేవలం దుస్తులు కాదని, పేద ధనిక తేడా లేకుండా అందరినీ ఒకే బాటలో నడిపే సమానత్వానికి గుర్తు అని అన్నారు. యూనిఫామ్స్ లేకపోవడంతో పేద తల్లిదండ్రులు మళ్లీ కొత్త బట్టలు కొనాల్సి వస్తోందని, ఇది వారిపై అదనపు భారం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే చాలా ఆలస్యం జరిగిందని, దీనివల్ల విద్యార్థులు రకరకాల దుస్తులతో పాఠశాలకు వచ్చి చిన్నతనం ఫీలవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ఈ విషయంలో తక్షణం స్పందించాలని డిమాండ్ చేశారు. అనంతరం బీజేవైఎం నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలకు వెంటనే యూనిఫామ్స్ పంపిణీ చేయాలని, ఏ విద్యార్థి కూడా యూనిఫామ్ లేకుండా తరగతికి రాకుండా చూడాలని కోరారు. పుస్తకాలు, మౌలిక సదుపాయాల విషయంలో కూడా అధికారులు నిర్లక్ష్యం వదిలి సకాలంలో అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భూక్యా జవహర్లాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపు రమేష్, గిరిజన మోర్చా నాయకులు గుగులోత్ స్వరూప, పట్టణ అధ్యక్షుడు ఇమ్మడి రాకేష్ యాదవ్, భూక్యా సుధీర్ రాథోడ్, పోరిక జశ్వంత్, ఉప్పల శ్రీతన్, కలాలి నవనీత్, గున్నల శిరీష్, అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా రంగుల శంకర్ నేత నియామకం



జవహర్ నగర్, ఆగస్ట్ 13,(విజన్ ఆంధ్ర): భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా రంగుల శంకర్ నేత నియమితుల య్యారు. ఈ మేరకు ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధమల్ల ఆనంద్ గౌడ్ ఆయనకు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రంగుల శంకర్ నేత మాట్లాడుతూ...తనను రెండవ సారి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షులు గంధమల్ల ఆనంద్ గౌడ్ కు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలి యజేశారు. అలాగే తన నియామకానికి సహకరిం చిన తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావుకి, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ కి, బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ జేశారు. తనపై ఎంతో నమ్మకంతో ఈ కీలకమైన బాధ్యతను అప్పగించిన పార్టీ పెద్దలు అందరికీ హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ నాపై ఉంచిన నమ్మ కాన్ని నిలబెట్టుకుంటూ, ఓబీసీ వర్గాల సంక్షేమం కోసం, పార్టీ బలోపేతం కోసం నిబద్ధతతో, అంకిత భావంతో పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు.

## బోనాలు ఉత్సవాలు విజయవంతానికి సహకరించిన అధికారులకు ఘన సన్మానం



మల్కాజిగిరి, ఆగస్ట్ 13,(విజన్ ఆంధ్ర): మల్కాజిగిరిలో బోనాల ఉత్సవాలు విజయవంతానికి సహకరించిన అధికారులను కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి 183 డివిజన్ అధ్యక్షులు జీడి సంపత్ గౌడ్ సన్మానించారు. గురువారం ఆయన, కాంగ్రెస్ నాయకులతో కలిసి మల్కాజిగిరి ఏసీపి యాదగిరి రెడ్డి, సిఐ విజయ్ కుమార్, మల్కాజిగిరి సర్కిల్ డిప్యూటి కమిషనర్ జకియా సుల్తానా, విద్యుత్ శాఖ ఏఈ గోపాల్ లను శాలువాతో ఘనంగా సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జీడి సంపత్ గౌడ్ మాట్లాడుతూ, అధికారులు అందరి సహాయ సహకారంతో మల్కాజిగిరిలో చారిత్రాత్మక ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలను ఘనంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆలయాల వద్ద భక్తులు ఇబ్బందులు పడకుండా తగిన వసతులు కల్పించిన జీహెచ్ఎంసీ, గట్టి బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసు శాఖ అధికారుల కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజేష్ గౌడ్, గౌసుద్దీన్ బాయ్, మహేందర్ గౌడ్, భాస్కర్, నగేష్ గౌడ్, యూత్ కాంగ్రెస్ మల్కాజిగిరి అధ్యక్షులు జీడి చరణ్ జిత్ గౌడ్, సంజయ్, రవీందర్,కుమార్ గౌడ్, పార్థసారథి తదితరులు పాల్గొనారు.

## నిజామాబాద్ నగరానికి చెందిన అమీనా బేగం కుటుంబసభ్యులకు CMRF చెక్కు అందజేసిన షబ్బీర్ అలీ



నిజామాబాద్ ఆగస్టు13:( విజన్ ఆంధ్ర) : హైదరా బాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు శ్రీ షబ్బీర్ అలీ నిజామాబాద్ నగరానికి చెందిన సామీ గారికి ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) చెక్కును అందజేశారు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న అమీనా బేగం కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో శ్రీ షబ్బీర్ అలీ అందజేశారు.

# తనిఖీ కాదు.. బోధనకు చేయూత

- అకడమిక్ ప్యానల్ సందర్శనలు ఉపాధ్యాయులకు సహకరించాలి
- విద్యార్థుల అభ్యసన ఫలితాలే లక్ష్యం
- కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి ఆగస్టు-13(విజన్ ఆంధ్ర) : అకడమిక్ ప్యానల్ పాఠశాల సందర్శనలు తనిఖీలకే పరిమితం కాకుండా ఉపాధ్యాయులకు అవసరమైన అకడమిక్ సహకారం అందించేలా ఉండాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. తరగతి గది బోధనను బలోపేతం చేసి, విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచడమే లక్ష్యమన్నారు. గురువారం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లాలో అమలు చేస్తున్న అకడమిక్ ప్యానల్ విధానంపై కలెక్టర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పాఠశాల సందర్శనల్లో తరగతి గది పరిశీలనతో పాటు విద్యార్థుల స్పాట్ అసెస్‌మెంట్ నిర్వహించి, అభ్యసనలో వెనుకబడిన అంశాలను గుర్తించి పరిష్కార చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులకు ఫీడ్‌బ్యాక్ నిర్మాణాత్మకంగా ఉండాలని, వారి మంచి అంశాలను అభినందిస్తూ మెరుగుదలకు అవసరమైన సూచనలు ఇవ్వాలని అన్నారు. విద్యార్థుల్లో ప్రశ్నించడం, చర్చించడం, స్వతంత్ర అభ్యాసం పెరిగేలా బోధనా పద్ధతులను మార్చాలని సూచించారు. కాంప్లెక్స్ సమావేశాలు, సబ్జెక్ట్ ఫోరమ్‌లను బలోపేతం చేసి పాఠశాల సందర్శనల అనంతరం నిరంతర ఫాలోఅప్ నిర్వహించాలని తెలిపారు. అభ్యసన డేటాను విశ్లేషించి లక్ష్యిత అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అకడమిక్ ప్యానల్ ఉద్దేశం తప్పులు వెతకడం కాదని, ఉపాధ్యాయులకు సహకరించడం, బోధనను మెరుగుపరచడం, విద్యార్థుల అభ్యసన ఫలితాలను పెంచడమేనని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన మండల విద్యాధికారులు, జిల్లా విద్యాధికారులు, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, క్వాలిటీ కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# అయిజ బిజెపి ఆధ్వర్యంలో భారీగా తిరంగా బైక్ ర్యాలీ



అయిజ ఆగస్టు 13 (విజన్ ఆంధ్ర) : మన్య శ్రీ ప్రధాని నరేంద్రమోడీ జీ పిలుపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఆదేశాల, ఎంపీ డికె అరుణమ్మ సూచన మేరకు తిరంగా బైక్ ర్యాలీ,హర్ ఘర్ అభియాన్‌లో భాగంగా జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణ పుర వీదులగుండ బిజెపి శ్రేణులు జాతీయ పతాకాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు ఎస్ రామచంద్ర రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది హర్ ఘర్ తిరంగా అభియాన్‌ను, వందేమాతరం 150వ వార్షికోత్సవానికి అంకితం చేయడం ఎంతో విశేషం అని, భారతదేశ ఆత్మను ఎల్లప్పుడూ ఐక్యంగా నిలిపిన దేశభక్తి స్ఫూర్తిని మరింత బలోపేతం చేసుకోవడానికి ఈ సందర్భం మనందరికీ ప్రేరణనిస్తుందని సూచించారు.త్రివర్ణ పతాకం సగర్వంగా రెపరెపలాడాలిడ భారత్ ప్రగతి పథంలో నిరంతరం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.మన భారతావని ఐక్యతను, అపారమైన గర్వాన్ని కలసికట్టుగా చాటిచెబుదాం అని అన్నారు ఈ కార్యక్రమం లో పట్టణ అధ్యక్షులు తెలుగు నరసింహ,బీజేపీ నాయకులు కంపాటి భగత్ రెడ్డి, లక్ష్మణ్ గౌడ్,తూముకుంటఅంజి ,బెల్లంకొండ, రాజశేఖర్,భీమన్న,ప్రతిప్,సి.నరసింహ,రఘు ,బోయవెంకటేష్ ,లక్ష్మణ్ చారి ,నాగిరెడ్డి,శ్రీకాంత్,వర్మ చారి,జై సింహ,సాయి,అశ్విన్,వినయ్ తదితరులు పాలుగొన్నారు.

# విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా విద్యాబోధన చేపట్టాలి..

- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్, ఆగస్టు 13 విజన్ ఆంధ్ర : కరీంనగర్ ముక్రాంపురంలోని ఓల్డ్ హైస్కూల్ క్యాంపస్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ బాలుర హాస్టల్‌ను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా గురువారం పరిశీలించారు. అంతకుముందు డాక్టర్ స్ట్రీట్‌లోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆమె సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించారుఅర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో లీకేజీలు, కిచెన్ షెడ్డు, తాగునీరు, టాయిలెట్లు తదితర మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను గుర్తించిన కలెక్టర్.. వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరిచి విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం కల్పించాలని సూచించారు. మరమ్మతు పనులు పూర్తయ్యే వరకు అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులను ముక్రాంపురంలోని ఓల్డ్ హైస్కూల్ క్యాంపస్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌కు తరలించి, అక్కడే హాస్టల్ వసతితో పాటు తరగతుల నిర్వహణ, విద్యాబోధన కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. ఈ మేరకు ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను పరిశీలించిన కలెక్టర్ చిత్రా మిశ్రా.. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతి, భోజనం, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. కొద్దిరోజుల పాటు విద్యార్థులను జాగ్రత్తగా చూసుకుంటూ, తరగతులు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో మరమ్మతు పనులు పూర్తయిన వెంటనే విద్యార్థులను తిరిగి అక్కడికి తరలించాలని అధికారులకు ఆదేశించారు. విద్యార్థుల విద్యకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కోఆర్డినేటర్లు అశోక్‌రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# అల్జీమర్స్‌పై విస్తృత అవగాహన అవసరం

- నిమ్స్ న్యూరాలజీ విభాగాధిపతి ప్రొ.సూర్యప్రభ



హైదరాబాద్, ఆగస్ట్ 13 (విజన్ ఆంధ్ర) : అల్జీమర్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని నిమ్స్ న్యూరాలజీ విభాగాధిపతి ప్రొసూర్యప్రభ అన్నారు. వరల్డ్ అల్జీమర్స్ డే సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో న్యూరాలజీ నిపుణులు డా.ఫణి కుమార్ తోకలిసి ఆమె మాట్లాడారు. వయోభారం, జన్యుపరమైన కారణాలతో అల్జీమర్స్ కేసులు పెరుగుతున్నాయని తెలిపారు. ప్రారంభ దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స అందించవచ్చన్నారు. సీడీఆర్, ఎంఒసీఏ, ఎంఎంఎస్‌ఈ పరీక్షల ద్వారా వ్యాధిని గుర్తించవచ్చని, మతిమరుపు లక్షణాలు కనిపిస్తే న్యూరాలజిస్టులను సంప్రదించాలని సూచించారు. సమతుల్య ఆహారం, శారీరక వ్యాయామంతో వ్యాధి ముప్పును తగ్గించవచ్చని తెలిపారు. వృద్ధాశ్రమాల్లో అవగాహన కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

# తాడిచర్ల తహసీల్దార్ ఆఫీస్ కు 'గ్రహణం'!

- ఆరుగురితోనే నెట్టుకొస్తున్న వైనం
- కీలకమైన 5 పోస్టులు ఖాళీ.. పెరిగిన పనిభారం
- సర్వేయర్ పోస్టు పూర్తిగా 'వేకెంట్'..
- నిలిచిపోయిన భూముల కొలతలు
- సర్టిఫికేట్లు అందక విద్యార్థుల అవస్థలు..
- కలెక్టర్ స్పందించాలని మండల ప్రజల విజ్ఞప్తి

మల్హార్, ఆగస్టు 13 విజన్ ఆంధ్ర : మండల కేంద్రమైన తాడిచర్ల రెవెన్యూ కార్యాలయం తీవ్ర సిబ్బంది కొరతతో కొట్టుమిట్టాడుతోంది. మండల ప్రజలకు కీలకంగా మారిన ఈ కార్యాలయంలో పాలన పూర్తిగా కుంటుపడింది. కార్యాలయంలో మొత్తం సుమారు 18 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం కేవలం ఆరుగురు మాత్రమే విధులు నిర్వహిస్తుండటం గమనార్హం. కార్యాలయంలో అత్యంత కీలకమైన ఒక ఆర్ఐ , ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, ఒక అటెండర్ పోస్టులతో పాటు ఒక సర్వేయర్ పోస్టు కూడా పూర్తిగా వేకెంట్ (ఖాళీ)గా ఉంది. సర్వేయర్ పోస్టు ఖాళీగా ఉండటం వల్లే సర్వే పనులు అన్నీ నిలిచిపోయాయని తెలుస్తోంది. దీనికి తోడు మరికొందరు సిబ్బంది డెప్యుటేషన్ పై ఇతర ప్రాంతాలకు వెళ్లడం ఈ దుస్థితికి కారణమని స్థానికులు మండిపడుతున్నారు.

**- ఒకేసారి వంద పనులు.. పెరిగిన పనిభారం**

ఒకవైపు తాడిచర్ల బ్లాక్-01 ఓపెన్ కాస్ట్ గని విస్తరణలో భాగంగా డేంజర్ జోన్ లో ఉన్న ఇళ్ల గుర్తింపు, భూసేకరణకు సంబంధించిన అత్యవసర సర్వేలు నడుస్తున్నాయి. మరోవైపు ప్రతిష్టాత్మక 'భూభారతి' సాదబైనామ పనులు పెండింగ్ లో ఉన్నాయి. ఇంకోవైపు చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు భూ సేకరణ ప్రక్రియ నడుస్తోంది. ఈ భారీ ప్రాజెక్టుల బాధ్యతలతో పాటు రోజువారీ ఆఫీసు పనులను కూడా ఈ ఆరుగురు సిబ్బందే చూసుకోవాల్సి రావడంతో వారిపై మానసిక, శారీరక పనిభారం విపరీతంగా పెరిగిపోయింది. ముఖ్యంగా సర్వేయర్ పోస్టు వేకెంట్ గా ఉండటంతో భూముల సరిహద్దుల కొలతలు, వివాదాల పరిష్కారం ఏళ్ల తరబడి ముందుకు సాగడం లేదు.

**- కాస్ట్, ఇన్కమ్ సర్టిఫికేట్ల కోసం విద్యార్థుల పాట్లు**

సిబ్బంది కొరత ప్రభావం నేరుగా విద్యార్థులు, సామాన్య ప్రజలపై పడుతోంది. విద్యా సంవత్సరం ప్రారంభమై ప్రవేశాలు, స్కాలర్ షిప్ ల సమయం కావడంతో నిత్యం వందలాది మంది విద్యార్థులు కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల కోసం ఆఫీసు చుట్టూ తిరుగుతున్నారు.



దరఖాస్తులు పరిశీలించి, డిజిటల్ సంతకాలు చేసే సిబ్బంది లేకపోవడంతో సర్టిఫికేట్లు సకాలంలో అందడం లేదు. దీంతో గడువు దాటిపోతుందేమోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

**- కలెక్టర్ గారు.. చొరవ తీసుకోండి!**

సమస్యల వలయంలో చిక్కుకున్న తాడిచర్ల రెవెన్యూ ఆఫీసును జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా పరిశీలించాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఖాళీగా ఉన్న సర్వేయర్, ఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్లు, అటెండర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని లేదా కొత్త సిబ్బందిని నియమించి కార్యాలయాన్ని పూర్తిస్థాయిలో నడిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సర్టిఫికేట్ల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని తాడిచర్ల మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణి మృతి

-వైద్యుల నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తీవ్ర ఆగ్రహం

సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు :13(విజన్ ఆంధ్ర ) : సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణి అనిత మృతి ఘటనపై సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చౌటకూర్ మండలం బద్రిగూడెం గ్రామానికి చెందిన 33 ఏళ్ల అనిత ప్రసవం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. పెళ్లైన 12 ఏళ్ల తర్వాత గర్భం దాల్చిన అనితను కుటుంబ సభ్యులు ఎంతో ఆశతో ఆసుపత్రికి తీసుకువచ్చారని, అయితే చివరకు ఆమె మృతిచెందడం అత్యంత విషాదకరమని ఎమ్మెల్యే అన్నారు. అనిత ఆసుపత్రికి వచ్చిన సమయంలో పెద్దగా ఆరోగ్య సమస్యలు లేవని కుటుంబ సభ్యులు చెబుతున్నారని, ప్రసవ సమయంలో వైద్యులు సరైన సమయంలో స్పందించి అవసరమైన అత్యవసర వైద్యం అందించి ఉంటే పరిస్థితి ఇంత దారుణంగా మారేది కాదని ఎమ్మెల్యే ఆరోపించారు. ఒక గర్భిణి ప్రాణం కాపాడాల్సిన ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్యం అందక ప్రాణం పోవడం అత్యంత బాధాకరమైన విషయం అని అన్నారు.

**వైద్యుల నిర్లక్ష్యానికి పేదల ప్రాణాలే బలికావాలా?**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఆసుపత్రులపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఘాటుగా విమర్శించారు. ఆసుపత్రుల్లో మందుల కొరత, వైద్యుల నిర్లక్ష్యం, సిబ్బంది అందుబాటులో లేకపోవడం, అత్యవసర పరిస్థితుల్లో సరైన సమయంలో స్పందించకపోవడం వంటి సమస్యలు ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చేది పేద ప్రజలే. ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లే ఆర్థిక స్థోమత లేని కుటుంబాలే ప్రభుత్వ వైద్యంపై ఆధారపడతాయి. అలాంటి పేదల ప్రాణాల విషయంలో కూడా నిర్లక్ష్యం చేస్తే ఇక వారు ఎవరిని ఆశ్రయించాలి? అని ఎమ్మెల్యే ప్రశ్నించారు.

**"మళ్లీ సర్కారు దవాఖానకు రాము" అనే పరిస్థితి ఎందుకు వచ్చింది?**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరుగుతున్న పరిణామాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని ఎమ్మెల్యే అన్నారు. "ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్తే ఉచిత వైద్యం దొరుకుతుందనే నమ్మకం ఉండేది.. ఇప్పుడు ప్రాణాలతో తిరిగి వస్తామా లేదా అనే భయం ఏర్పడుతోంది" అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మందులు అందుబాటులో లేకపోవడం, వైద్యుల నిర్లక్ష్యం, సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రుల వైపు చూడటానికే భయపడే పరిస్థితి వచ్చిందని విమర్శించారు.

**నకిలీ వైద్యుల ఆరోపణలపై తనిఖీలు ఏవి?**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో అర్హతలు లేని వ్యక్తులు వైద్యం అందిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు కనీస తనిఖీలు నిర్వహించడం లేదని ఎమ్మెల్యే ఆరోపించారు. వైద్యం విషయంలో చిన్న నిర్లక్ష్యం కూడా ఒక మనిషి ప్రాణాన్ని బలితీసుకునే ప్రమాదం ఉంది. అలాంటి సున్నితమైన వ్యవస్థను అధికారులు ఇంత నిర్లక్ష్యంగా ఎలా నిర్వహిస్తారు? అని ప్రశ్నించారు.

**అనిత మృతిపై సమగ్ర విచారణ జరపాలి**

అనిత మృతి ఘటనపై ప్రభుత్వం వెంటనే సమగ్ర, నిష్పక్షపాత విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ డిమాండ్ చేశారు.



వైద్యుల నిర్లక్ష్యం నిజమని విచారణలో తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనిత కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు, ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర వైద్య సేవలు, వైద్యులు, మందులు, సిబ్బంది అందుబాటుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. "ప్రభుత్వ ఆసుపత్రి అంటే పేదలకు చివరి ఆశ. ఆ చివరి ఆశనే ప్రభుత్వం దూరం చేస్తే పేదల పరిస్థితి ఏమిటి? ఆసుపత్రుల్లో నిర్లక్ష్యానికి ఇకనైనా అడ్డుకట్ట వేయాలి. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడే వ్యవస్థను సహించేది లేదు" అని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ స్పష్టం చేశారు.

# గ్రామాల పంచాయతీల అభివృద్ధి కి ప్రణాళికలను రూపొందిచాలి

- 15వ ఆర్థిక సంఘం నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు

గద్వాల ఆగస్టు 13 (విజన్ ఆంధ్ర బ్యూరో) : గ్రామాల అవసరాలకు అనుగుణంగా పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి,ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు అధికారులను ఆదేశించారు.గురువారం ఐడీఓసి తమ ఛాంబర్ నందు 202627 ఆర్థిక సంవత్సరానికి జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై జిల్లా స్థాయి కార్యాచరణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణాభివృద్ధిని మరింత వేగవంతం చేయడంతో పాటు గ్రామస్థాయిలో సమగ్ర అభివృద్ధిని సాధించేందుకు పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు సమర్థవంతమైన సాధనమని అన్నారు.15వ ఆర్థిక సంఘం నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు గ్రామాల వాస్తవ అవసరాలను ప్రతిబింబించేలా



ఉండాలని స్పష్టం చేశారు.పేదరిక నిర్మూలన, జీవనోపాధి మెరుగుదల, ఆరోగ్యవంతమైన గ్రామాలు, బాలలకు అనుకూల వాతావరణం, నాణ్యమైన విద్య,తాగునీటి సౌకర్యం,పారిశుద్ధ్యం, పచ్చదనం, స్వయం సమృద్ధి మౌలిక సదుపాయాలు,సామాజిక న్యాయం, సుపరిపాలన, మహిళా సాధికారత వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.తమ శాఖలకు సంబంధించిన గణాంకాలు, భౌతిక,ఆర్థిక ప్రగతి,అవసరాల వివరాలను సకాలంలో అందించి ప్రణాళికల రూపకల్పనకు సహకరించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు,పాఠశాలల మౌలిక వసతుల అభివృద్ధి వంటి ప్రాజెక్టులను ప్రాధాన్యతగా పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల్లో చేర్చాలని సూచించారు.అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి తమ శాఖల పథకాలు, నిధులు,వనరులను సమీకరిస్తూ ఫండ్ కన్వర్జెన్స్ ద్వారా గ్రామాల అవసరాలకు అనుగుణంగా సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలు రూపొందించాలని ఆదేశించారు. గ్రామసభల ద్వారా ప్రజల అభిప్రాయాలను సేకరించి, గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో గుర్తించాలని తెలిపారు. రూపొందించే ప్రణాళికలు గ్రామాల సమగ్రాభివృద్ధికి దోహదపడటంతో పాటు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ఆదర్శంగా నిలవాలని అన్నారు.ప్రతి శాఖ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి నిర్దేశిత గడువులోగా ప్రతిపాదనలు సమర్పించాలని, శాఖల మధ్య సమన్వయంతో నాణ్యమైన జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగేంద్రం, డీఆర్డిఓ ముషాయిదా బేగం, డీపీఓ శ్రీకాంత్, డీడబ్లుఓ సునంద, డియంహెచ్ఓ సంధ్య కిరణ్మయి,మత్స్య శాఖ అధికారి షకీలా భాను, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు భద్రత టీయూడబ్ల్యూజే (ఐజేయు)తోనే సాధ్యం

-జిల్లా అధ్యక్షుడు యాదగిరి ని అభినందించిన రాష్ట్ర అధ్యక్షుడు
-నియోజకవర్గం కమిటీల ఏర్పాటుపై హర్షం
-త్వరలో ప్రతి జర్నలిస్టుకు హెల్త్ కార్డు





సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు :13(విజన్ ఆంధ్ర ) : తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు ( టీయూడబ్ల్యూజే- ఐజేయు) ద్వారానే జర్నలిస్టుల కు భద్రత సాధ్యమని రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తో ఇప్పటికే అనేక దఫాలుగా చర్చలు జరిగాయని, త్వరలో హెల్త్ కార్డు లు వస్తాయని తెలిపారు. సంగారెడ్డి జిల్లా నూతన కమిటీ, పటాన్ చేరు నియోజకవర్గం నూతన కమిటీలు జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి ఆధ్వర్యంలో గురువారం హైదరాబాదులోని రాష్ట్ర యూనియన్ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ ని మర్యాద పూర్వకంగా కలిశారు. గజమాలతో , శాలువా తో సత్కరించారు. ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా మహాసభను క్రమశిక్షణతో భారీ ఎత్తున నిర్వహించినందుకు జిల్లా కమిటీని అభినందించారు. రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు బండారు యాదగిరికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అదేవిధంగా పటాన్చెరు నియోజకవర్గ కమిటీ ఏర్పాటుపై హర్షం వెలిబుచ్చారు. టి యు డబ్ల్యూ జె-ఐ జే యు మొక్కుబడి యూనియన్ కాదు అని, 70 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన సంఘం అని పేర్కొన్నారు. జర్నలిస్టుల కోసం నిరంతరం పనిచేస్తున్న ఏకైక సంఘం అని చెప్పారు. అక్రిడేషన్ కార్డులు ఇప్పటికే చాలా మందికి వచ్చాయని, మిగిలిన వారికి కూడా త్వరలో వస్తాయని చెప్పారు.అంతే కాకుండా అర్హులైన వారికి ఇంటి స్థలాలకు సంబంధించి త్వరలో ప్రభుత్వం ఒక పాలసీని తెస్తుందని తద్వారా అందరికీ ఇట్టి స్థలాలు వస్తాయని వివరించారు. పాత్రికేయులలో వృత్తి నైపుణ్యాన్ని పెంచేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి మాట్లాడుతూ జిల్లా మహాసభను అందరి సహకారంతో నిర్వహించినట్లు చెప్పారు. ప్రతి ఒక్క రిపోర్టర్ కూడా తమ సొంత ఫంక్షన్ లాగా భావించి జిల్లా మహాసభకు తరలివచ్చారని పేర్కొన్నారు. జిల్లాలో అర్హులైన జర్నలిస్టుల సంక్షేమానికి పకడ్బందీ ప్రణాళికతో పనిచేస్తామని చెప్పారు. పటాన్చెరు మాదిరిగానే జిల్లాలో ని మిగతా ప్రాంతాల్లో కూడా త్వరలో కమిటీలు వేయనున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల ఐక్యతను సాధించడం ద్వారా హక్కులను పొందడమే తమ ముందున్న కర్తవ్యం అని చెప్పారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైసల్ సూచనలు సలహాలతో జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేస్తున్నామని వివరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ మాట్లాడుతూ సంఘం తలపెట్టిన కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని సూచించారు. సమన్వయం చేసుకోవడం ద్వారా సంఘం కార్యక్రమాలకు ఎక్కువ మంది హాజరవుతారని తెలిపారు. రాష్ట్ర నాయకుడు బాసిత్ మాట్లాడుతూ జర్నలిస్టులకు ప్రతి విషయంలో టియుడబ్ల్యూజేఐజేయు అండగా నిలిచిందని అన్నారు. సంఘం పిలుపును పూచే తప్పకుండా పాటిస్తామని చెప్పారు. జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర నాయకత్వం జిల్లా నాయకత్వం ఇచ్చిన కార్యక్రమాలను సమిష్టిగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి బసవేశ్వర్ మాట్లాడుతూ యూనియన్ కార్యక్రమాల వల్ల ప్రతి జర్నలిస్టుకు ఉత్సాహం కలుగుతోందని చెప్పారు. చిన్న మధ్య తరహా పత్రికల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ చౌహాన్ మాట్లాడుతూ ప్రతి జర్నలిస్టు కూడా పోరాట పటిమ ను సాధించాలంటే టీయూడబ్ల్యూజేఐజేయు చరిత్ర తెలుసుకుంటే సరిపోతుందన్నారు. అందరి సంక్షేమమే లక్ష్యంగా టియుడబ్ల్యూజే పని చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. పటాన్చెరు నియోజకవర్గం అధ్యక్షుడు పత్తి నరసింహ మాట్లాడుతూ ప్రతి జర్నలిస్టు గర్వపడే విధంగా పటాన్చెరు నియోజకవర్గ సమావేశాన్ని నిర్వహించామని చెప్పారు. ఈ సందర్భంగా పాలువురు జర్నలిస్టులు జిల్లా అధ్యక్షుడు యాదగిరికి పూలమాలవేసి శాలువాతో సత్కరించారు. జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ విల్సన్,జిల్లా సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, , జిల్లా నాయకులు భూపాల్ రెడ్డి, హిమాయత్, పటాన్చెరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి యాదగిరి, కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి ఇతర నేతలు పాల్గొన్నారు

# ఇజ్రాయెల్‌లో కేర్ గివర్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

**- జిల్లా ఉపాధి కల్పనాధికారి ప్రశాంతి**

గద్వాల ఆగస్టు 13 (విజన్ ఆంధ్ర బ్యూరో) : తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ఆధ్వర్యంలో ఇజ్రాయెల్‌లో గృహ ఆధారిత సంరక్షకుడు/సంరక్షకురాళ్లు (హోమ్ బేస్డ్ కేర్ గివర్స్) ఉద్యోగాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ వివరాలు ఇజ్రాయెల్‌లో కేర్ గివింగ్ ఉద్యోగాలకు మహిళలు 90%, పురుషులు 10% చొప్పున అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థుల వయస్సు 25 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండాలి. ఏఎన్ఎం, జిఎన్ఎం,ఎంపిఎచ్ డబ్ల్యూ , డిప్లొమా ఇన్ పేషెంట్ కేర్ లేదా బి.ఎస్ సి. నర్సింగ్ విద్యార్హత కలిగి ఉండాలి. అంతేకాకుండా ఇంటర్మీడియట్ లో ఆంగ్ల భాషా నైపుణ్యం ఉండటంతో పాటు, గుర్తింపు పొందిన భారతీయ అధికార సంస్థ నుంచి నర్సింగ్‌లో గుర్తింపు పొందిన లేదా పర్యవేక్షణలో ఉన్న డిప్లొమా శిక్షణ సర్టిఫికెట్ కలిగి ఉండాలి. రిజిస్ట్రేషన్ అనంతరం కనీసం రెండు సంవత్సరాల నర్సింగ్ అనుభవం కలిగి ఉండాలి.ఎంపికైన అభ్యర్థులకు నెలకు సుమారుగా 5,880.02 ఎన్ఐఎస్ , అంటే సుమారు రూ.1,86,000 వరకు జీతం లభిస్తుందని తెలిపారు. ప్రారంభ ఉద్యోగ ఒప్పంద కాలం రెండు సంవత్సరాలు ఉంటుందని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు సంబంధిత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. మరిన్ని వివరాలకు 0835524946 నంబర్‌ను సంప్రదించవచ్చని, అలాగే అభ్యర్థులు తమ సివి.లను tomcomglobal@gmail.comకు పంపవచ్చని తెలిపారు.

# మేడిపల్లి ఏసీపీ కార్యాలయంలో సీపీ సుమతి ఆకస్మిక తనిఖీ

**- కేసులు, పెండింగ్ దర్యాప్తులపై ఉప్పల్ డీసీపీ, ఏసీపీలతో సుదీర్ఘ సమీక్ష**



బోడుప్పల్, ఆగస్టు 13 (విజన్ ఆంధ్ర): మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసు అధికారుల పనితీరును పరిశీలిస్తున్న సీపీ సుమతి గురువారం మేడిపల్లి ఏసీపీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయానికి చేరుకున్న సీపీకి పోలీసు సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటారు. ఉప్పల్ డీసీపీ సురేష్‌కుమార్‌తో కలిసి మేడిపల్లి ఏసీపీ మోహన్‌కుమార్ పరిధిలోని ఇన్‌స్పెక్టర్లతో సీపీ సమీక్ష నిర్వహించారు. నమోదైన కేసులు, పెండింగ్ దర్యాప్తులు, సిబ్బంది వివరాలు, పోలీస్‌స్టేషన్లలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని, నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సీపీ సూచించారు. విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ ప్రజల సమస్యలపై త్వరితగతిన స్పందించాలని అధికారులను ఆదేశించారు.

# నెహ్రూ, రాజీవ్ గాంధీ విగ్రహాలను ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి

**- జగ్గారెడ్డి, నిర్మల**




సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు :13( విజన్ ఆంధ్ర ) : ఈనెల 15 న సంగారెడ్డి పట్టణానికి సీఎం రేవంత్ రెడ్డి రానున్న విషయం తెలిసిందే. సంగారెడ్డి పట్టణం లోని ఐబీ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన మాజీ ప్రధానులు జవహర్ లాల్ నెహ్రూ, రాజీవ్ గాంధీ గార్ల విగ్రహాలను ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్నారు. గురువారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, డిసిసి అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డిలు విగ్రహాలు నెలకొల్పిన స్థలాన్ని అధికారులు,నాయకులతో కలిసి పరిశీలించారు. సీఎం చేతులమీదుగా విగ్రహ ఆవిష్కరణ జరుగుతున్న నేపథ్యం లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, ఏర్పాట్లను అధికారులకు సూచించారు. విగ్రహ ఆవిష్కరణ సమయం లో సీఎం తో పాటు ఎవరెవరు పాల్గొంటారో అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నియోజకవర్గ కన్వీనర్ జూలకంటి అంజనేయులు, సిడిసి చైర్మన్ రామ్ రెడ్డి, నాయకులు రఘు గౌడ్,జార్జ్, కూన సంతోష్,కిరణ్ గౌడ్, మహేష్, శ్రీకాంత్, ప్రవీణ్ , సందీప్ రెడ్డి, మొగులయ్య, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పేర్ పిఎచ్ సి.ని సందర్శించిన జిల్లా ఉప వైద్యాధికారి డా.అస్గర్ అలీ



ధరూర్ ఆగస్టు 13 (విజన్ ఆంధ్ర కరస్పాండెంట్) : జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. సంధ్య కిరణ్మై ఆదేశానుసారం గురువారం ఉప్పేర్ పిఎచ్ సి.ని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్. అస్గర్ అలీ సందర్శించి ఆరోగ్య కార్యక్రమాలను సమీక్షించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవనశైలి వ్యాధుల నియంత్రణతో పాటు ఐదేళ్ల లోపు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు పోలియో, మీజిల్స్ వంటి మొదలగు వ్యాధులను నివారించడానికి టీక కార్యక్రమాన్ని సమర్థవంతంగ అమలు చేయాలని తెలిపారు. 14 సంవత్సరాల నుండి 15 సంవత్సరాలలోపు బాలికలందరికి ముందస్తు జాగ్రత్తగ క్యాన్సర్ వ్యాధి రాకుండ తమకు నిర్దేశించిన టార్గెట్ ప్రకారం ఎచ్ పి వి.వ్యాక్సిన్ చేయాలని అన్నారు. అదేవిధంగ ఆశ కార్యకర్తలకు,ఏఎన్ఎం. లకు పీర్ ఎడ్యుకేటర్ శిక్షణ ఇచ్చి ప్రతి ఆశ కార్యకర్త 10 నుండి 19 ఏళ్ల వయస్సుగల ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలను పీర్ ఎడ్యుకేటర్లుగ ఎంపిక చేయాలన్నారు. వీరు నెలలో 4 సార్లు సమావేశాలు నిర్వహించి రక్తహీనత మానసిక ఆరోగ్యం రుతుస్రావ పరిశుభ్రతపై మాదకద్రవ్యాల నివారణపై యుక్త వయస్సుల వారిని కనిసము 20 మందితో సముహాలు (గ్రూపులుగ) ఏర్పాటు చేసుకొని అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. అన్ని జాతీయ, రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాలను ఎప్పటికప్పుడు నిర్దేశించిన గడువులోగ శత శాతం పూర్తి చేసి ప్రతి గర్భిణిలకు ప్రభుత్వ ఆసుపత్రిలోనె ప్రసవాలు జరిగేల ప్రోత్సహించి ప్రభుత్వ ప్రసవాల సంఖ్య పెంచాలని, సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని సిబ్బంది అప్రమత్తంగ అందుబాటులో ఉంటు సమయం పాటించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని లేనిచో చర్యలు తప్పవని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డా.భరత్,ఆయుష్ వైద్యాదికారి డా. జ్ఞాని,ఎంపిఎచ్ఈఓ. రవిచందర్,పిఎచ్ఎన్. నర్సమ్మ, సూపర్వైజర్లు శ్యాంసుందర్,లక్ష్మి తదితర సిబ్బంది, జిల్లా ఇన్చార్జి మాస్ మీడియ ఆఫీసర్ హిర్య నాయక్ పాల్గొన్నారు.

# ములుగు జిల్లా బిడ్డకు ఐకానిక్ ఉమెన్ సైంటిస్ట్ అవార్డు.



ములుగు ఆగస్ట్ 13, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు జిల్లా మంగపేట మండల రమణక్కపేట కు చెందిన లిడాక్టర్ సుమతి పోలెబోయినలి శాస్త్రీయ పరిశోధనల్లో విశేష కృషికి గాను బిఐకానిక్ ఉమెన్ సైంటిస్ట్ అవార్డుబి అందుకున్నారు. ఛత్తీస్‌గఢ్ బిలాస్‌పూర్ గురు ఘాసీదాస్ కేంద్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆమె నానోఫార్మకాలజీ, మధుమేహం, ఆస్టియోపోరోసిస్, గట్–బ్రెయిన్ పరిశోధనల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 8 ఏళ్ల పరిశోధన అనుభవం, 3 పేటెంట్లు, పలు జాతీయ ఫెలోషిప్‌లు కలిగిన డాక్టర్ సుమతి ఈ అవార్డును భర్త లికొమరం మోహన్ రావులి కు అంకితమిచ్చారు. మారుమూల గ్రామం నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన ఆమె విజయంపై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# ఏడాది నిండని కార్పొరేషన్‌ను చిదిమేయకండి

**- రూ.9.60 కోట్ల అవినీతి ప్రచారం అవాస్తవం**
**- డీపీఆర్ టెండర్లలో పూర్తి పారదర్శకత..**
**ఆన్‌లైన్ విధానంతో అనుమానాలకు చెక్**
**- కొత్తగూడెం కార్పొరేషన్‌కు అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా**
**రూ.600 కోట్ల నిధుల సమీకరణకు ప్రయత్నం**



కొత్తగూడెం బ్యూరో ఆగస్టు 14(విజన్ ఆంధ్ర): ఏడాది కూడా నిండని కొత్తగూడెం నగరపాలక సంస్థను పురిటిలోనే చిదిమేయాలని కుట్రలు చేయొద్దని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా పట్టణ అభివృద్ధికి నిధులు సమీకరించే ప్రక్రియలో భాగంగా చేపట్టిన డీపీఆర్ టెండర్లపై కొందరు తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజల్లో అనుమానాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. గురువారం కొత్తగూడెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కూనంనేని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పట్టణాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు సమకూరనున్నాయని తెలిపారు. పథకం నిబంధనల ప్రకారం కేంద్ర గ్రాంట్లు, రాష్ట్ర వాటా, బ్యాంకు రుణాల ద్వారా నిధుల సమీకరణ జరుగుతుందని వివరించారు. దేశవ్యాప్తంగా ఈ పథకం కింద కేంద్ర సహాయం అందుతుందని, 25 శాతం కేంద్రం, 25 శాతం రాష్ట్రం, 50 శాతం బ్యాంకు రుణాల ద్వారా నిధులు సమకూరే విధానం ఉందన్నారు. ఇందులో భాగంగా 26 మున్సిపాలిటీలకు నిధులు వచ్చే అవకాశం ఉందని, ఖమ్మం కార్పొరేషన్‌కు సుమారు రూ.2,670 కోట్ల రుణం రానుండగా, కొత్తగూడెం కార్పొరేషన్‌కు రూ.600 కోట్ల రుణం కోరినట్లు తెలిపారు.

**- రూ.9.60 కోట్ల అవినీతి ఎలా జరుగుతుంది?**

రూ.600 కోట్ల అభివృద్ధి పనులకు సంబంధించిన డీపీఆర్ తయారీకి 1.6 శాతం చొప్పున టెండర్ ఒప్పందం జరిగిందని, దీనిని ఆధారంగా చేసుకుని రూ.9.60 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించడం అజ్ఞానానికి నిదర్శనమని కూనంనేని అన్నారు. అసలు అభివృద్ధి నిధులు విడుదల కాకముందే డీపీఆర్ ఫీజులో కోట్ల రూపాయల అవినీతి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు.రాష్ట్రంలోని ఇతర నగరాలు, మున్సిపాలిటీల్లోనూ ఇదే తరహాలో డీపీఆర్ టెండర్లు జరిగాయని తెలిపారు. నల్గొండలో 1.6 శాతం, మహబూబ్‌నగర్‌లో రూ.1,000 కోట్ల పనులకు 1.5 శాతం చొప్పున డీపీఆర్ ఒప్పందాలు జరిగాయని పేర్కొన్నారు. అక్కడ లేని అవినీతి కొత్తగూడెంలోనే ఎలా జరుగుతుందని ప్రశ్నించారు.

**- అనుమానాల నివృత్తికే ఆన్‌లైన్ టెండర్లు**

డీపీఆర్ టెండర్లపై ప్రజల్లో ఏర్పడిన అనుమానాలను నివృత్తి చేయడానికే ఆఫ్‌లైన్ విధానాన్ని రద్దు చేసి ఆన్‌లైన్ టెండర్లకు ఆదేశాలు ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. 0.5 శాతం లేదా అంతకంటే తక్కువకు డీపీఆర్ తయారు చేసేందుకు సామర్థ్యం ఉన్న సంస్థలు ఆన్‌లైన్ టెండర్లలో పాల్గొనవచ్చన్నారు. ప్రక్రియ మొత్తం పారదర్శకంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కొత్తగూడెం కార్పొరేషన్‌కు అభివృద్ధి నిధులు తీసుకురావడానికి తాను కృషి చేస్తున్నానని, రోడ్లు, డ్రైనేజీలు, విద్యా సంస్థలు, క్రీడా ప్రాంగణాలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు.

**- తప్పు చేస్తే క్రిమినల్ కేసులు**

ప్రజాప్రతినిధులు లేదా అధికారులు ఎవరైనా అక్రమాలకు పాల్పడినా, పేదలను మోసం చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేయించేందుకు వెనుకాడబోమని కూనంనేని హెచ్చరించారు. అయితే ఆధారాలు లేకుండా తప్పుడు ఆరోపణలు చేసి ప్రజల్లో అపోహలు సృష్టించడం సరికాదన్నారు. చుంచుపల్లి ఉమ్మడి పంచాయతీ 45 ఏళ్లుగా సీపీఐ ఆధీనంలో ఉందని, ప్రజాదరణ లేకపోతే ఎన్నికల్లో విజయం సాధ్యమయ్యేదా అని ప్రశ్నించారు. గతంలో ప్రపంచ బ్యాంకు రుణ విధానాన్ని తాము వ్యతిరేకించిన విషయాన్ని కూడా గుర్తుచేశారు. విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య, నాయకులు ఎండీ యూసుఫ్, మునిగడప వెంకటేశ్వర్లు, పలువురు కార్పొరేటర్లు, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

# మహిళా సంఘాలకు నా మిల్లు అప్పగించేందుకు సిద్ధం

**- వట్టే జానయ్య యాదవ్**
**- సీఎంఆర్ వ్యవహారంలో మిల్లర్లను నేరస్తులుగా చూడటం సరికాదు**
**- కుటుంబ సభ్యులపై కేసులు రాజకీయ కక్షలో భాగమేనని ఆరోపణ**
**- బియ్యం రికవరీపై సీఎం, పౌరసరఫరాల మంత్రి సమక్షంలోనైనా బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్**



సూర్యాపేట, ఆగస్టు 13 (విజన్ ఆంధ్ర) : మహిళా సంఘాలకు రైస్ మిల్లులను అప్పగించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తాను స్వాగతిస్తున్నానని, అవసరమైతే తన వజ్రా రైస్ మిల్లును కూడా మహిళా సంఘాలకు అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నానని వజ్రా రైస్ మిల్ నిర్వాహకులు వట్టే జానయ్య యాదవ్ ప్రకటించారు.గురువారం సూర్యాపేటలోని వజ్రా రైస్ మిల్లు ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.వజ్రా రైస్ మిల్ ప్రారంభమైనప్పటి నుంచి సీఎంఆర్‌కు సంబంధించి ప్రభుత్వం నుంచి ఒక్కసారి కూడా నోటీసు తీసుకునే పరిస్థితి రాకుండానే చెల్లింపులు పూర్తి చేస్తూ వచ్చామని జానయ్య తెలిపారు. అయినప్పటికీ రాజకీయ ఒత్తిళ్లకు లోనైన అధికారులు తమ మిల్లును లక్ష్యంగా చేసుకుని దాడులు చేశారని ఆరోపించారు. రైస్ మిల్లుల వ్యవహారంలో వర్తించాల్సిన చట్టపరమైన నిబంధనలకు భిన్నంగా అనేక క్రిమినల్ కేసులు నమోదు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ప్రభుత్వంతో సీఎంఆర్‌కు సంబంధించి ఒప్పందం చేసుకున్న వ్యక్తులపైనే చట్టపరమైన బాధ్యత ఉంటుందని, ఏదైనా ఉల్లంఘన జరిగితే వారిపైనే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. కానీ అందుకు భిన్నంగా తన కుటుంబ సభ్యులను కూడా కేసుల్లో చేర్చారని ఆరోపించారు. కర్ణాటకలో ఎంబీబీఎస్ చదువుతున్న తన చిన్న కుమారుడిని సైతం అరెస్టు చేయడం రాజకీయ కక్ష, కుట్రలో భాగమేనని జానయ్య పేర్కొన్నారు.

**రైస్ ఇండస్ట్రీని నేరస్తులుగా చూడొద్దు**

రాష్ట్రంలో రైస్ మిల్లింగ్ పరిశ్రమను, మిల్లర్లను నేరస్తులుగా చిత్రీకరించే విధానం సరికాదని జానయ్య అన్నారు. ధాన్యం మిల్లింగ్‌లో వాస్తవంగా ఎంత బియ్యం వస్తుందన్న అంశాన్ని శాస్త్రీయంగా, సాంకేతికంగా పరిశీలించాలని కోరారు.ఒక క్వింటా ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తే వాస్తవ పరిస్థితుల్లో వచ్చే బియ్యం, ప్రభుత్వం నిర్దేశిస్తున్న రికవరీ మధ్య వ్యత్యాసం ఉంటుందని ఆయన వాదించారు. ఒక క్వింటా ధాన్యానికి 67 కిలోల బియ్యం ఇవ్వాలనే నిబంధన కారణంగా మిల్లర్లపై షార్ట్‌ఫాల్ భారం పడుతోందన్నారు. ధాన్యం నాణ్యత, తేమ శాతం, మిల్లింగ్ పరిస్థితులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా మొత్తం బాధ్యతను మిల్లర్లపైనే మోపడం సమంజసం కాదన్నారు.

ఈ అంశంపై తన వాదన తప్పని ప్రభుత్వం భావిస్తే బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. ముఖ్యమంత్రి స్థాయిలోనైనా, పౌరసరఫరాల శాఖ మంత్రి ఆధ్వర్యంలోనైనా, సంబంధిత ఉన్నతాధికారులు, నిపుణుల సమక్షంలోనైనా చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ధాన్యాన్ని ప్రత్యక్షంగా మిల్లింగ్ చేసి ఎంత బియ్యం వస్తుందో ప్రజల ముందే నిరూపించేందుకు కూడా సిద్ధమన్నారు.

**పోలీసుల చర్యలు రాజ్యాంగ విరుద్ధం**

తన మిల్లుపై జరిగిన దాడులు, తన కుటుంబ సభ్యులపై నమోదు చేసిన కేసులు రాజ్యాంగ, చట్ట నిబంధనలకు విరుద్ధమని జానయ్య ఆరోపించారు. అధికారులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని వ్యవహరించారని విమర్శించారు. తాను మాత్రం న్యాయవ్యవస్థపై విశ్వాసంతో హైకోర్టును ఆశ్రయించి బెయిల్ పొందానని తెలిపారు.మిల్లును తిరిగి నిర్వహించుకునేందుకు అవసరమైన అన్ని చట్టబద్ధ అనుమతులు పొందిన తర్వాతే సూర్యాపేటకు వచ్చానని చెప్పారు. తాను చట్టానికి లోబడి వ్యాపారం చేస్తానని, తనపై ఏవైనా ఆరోపణలు ఉంటే వాటిని చట్టబద్ధంగానే నిరూపించాలని అన్నారు. పోలీసులే చట్ట పరిధిని దాటి వ్యవహరించారని ఆయన తీవ్రంగా విమర్శించారు.రాజకీయ కక్షలతో వ్యాపార సంస్థలు, కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకోవడం ప్రజాస్వామ్య సమాజానికి మంచిది కాదన్నారు. ఇటువంటి చర్యలను సభ్య సమాజం గమనించాలని, చట్టవిరుద్ధమైన పోలీసు పద్ధతులను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని విజ్ఞప్తి చేశారు. వజ్రా రైస్ మిల్లు నిర్వహణలో ఎలాంటి అవకతవకలు, మోసాలు జరగలేదని తాను నిరూపించగలనని జానయ్య స్పష్టం చేశారు. ప్రభుత్వం, అధికారులు తమ వద్ద ఉన్న ఆధారాలతో రావాలని, తాను తన వద్ద ఉన్న రికార్డులు, లెక్కలతో వస్తానని పేర్కొన్నారు. “ఎక్కడైనా, ఎవరి సమక్షంలోనైనా బహిరంగ చర్చకు నేను సిద్ధం. వాస్తవాలు ప్రజల ముందుకు రావాలని వట్టే జానయ్య యాదవ్ సవాల్ చేశారు.

# ప్రైవేటు స్మార్ట్ వైష్ణవి హై స్కూల్ యజమానంపై కఠినమైన చర్యలు తీసుకోవాలి


***అసిస్టెంట్ డైరెక్టర్ కి వినతి పత్రం అందజేసిన బీఆర్ఎస్వి జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య, పిడిఎస్యు జిల్లా అధ్యక్షుడు హలీమ్ పాషా***



గద్వాల ఆగస్టు 13 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ కి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రైవేటు స్మార్ట్ వైష్ణవి హై స్కూల్ యజమానంపై కఠినమైన చర్యలు తీసుకొవాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోయిన అకాడమీ ఇయర్ కు సంబంధించి 22 మంది విద్యార్థులకు మెమోలు ఇవ్వకుండా తీవ్రమైన ఇబ్బందులకు గురి చేస్తూ విద్యను వ్యాపారం చేస్తూ ఆ విద్యార్థుల యొక్క అకాడమిక్ ఇయర్ ను లాస్ చేయడం జరిగిందని అన్నారు.స్వయంగా అందులో ఒక విద్యార్థి జూన్ 3వ తేదీన అలంపూర్ చౌరస్తాలోని ప్రజావాణిలో డీఈవో కి ఫిర్యాదు చేయడం జరిగింది. అయినా కూడా జిల్లా విద్యాధికారులు చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గం అని అన్నారు. తక్షణమే ఆ విద్యార్థుల జీవితాన్ని నాశనం చేసిన యజమానం పైన క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకొని ఆ స్కూల్ యొక్క గుర్తింపును రద్దు చేయాలని,జిల్లా కలెక్టర్, డీఈఓ తక్షణమే చర్యలు తీసుకోవాలి లేని పక్షంలో భవిష్యత్ కార్యాచరణ చేపడతామని డిమాండ్ చేశారు. పర్మిషన్ లేకుండా హాస్టల్ ను నడుపుతున్నారు.వైష్ణవి హైస్కూల్లో భయంకరమైన ఫీజులు దోపిడీ, బుక్కుల, దుస్తుల దోపిడి. ఫీజుల పట్టిక చూపియండి అని అడిగితే చూపించడం లేదు నోటీస్ బోర్డు లో కూడా ఫీజులు పట్టిక పెట్టలేదు.విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించకుండా తక్కు జీతాలు ఇస్తూ విద్యాను బోధిస్తున్నారు స్కూల్ లో హాస్టల్ కు పర్మిషన్ లేదు అంతస్తుల మీద అంతస్తు నిర్మిస్తున్నారు వాటికి పర్మిషన్ లేదు, ఆటస్థలం లేదు, కేవలం డబ్బుల కోసం హాస్టల్ రన్ చేస్తూ వేలలో విద్యాను వ్యాపారం చేస్తున్నారని అన్నారు. తక్షణమే ప్రవేటు వైష్ణవి హై స్కూల్ పైన చర్యలు తీసుకుని ఆ పాఠశాల యొక్క గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమములో పిడిఎస్ యు.చిరంజీవి, తదితరులు పాల్గోన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి


**- సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం**
**- జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్**



గద్వాల ఆగస్టు 13 (విజన్ ఆంధ్ర బ్యూరో) : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధు మోహన్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ తమ ఛాంబర్ నందు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గద్వాల పోలీస్ పరేడ్ మైదానంలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుక సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు సూచనలను ఇచ్చారు.ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అట్టహాసంగా వేడుకలు జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ముఖ్య అతిథిలు ప్రజాప్రతినిధులు,అధికారులు, ఆహ్వానితులందరికీ ఆహ్వానాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు,ప్రజలకు అవసరమైన సౌకర్యాలు పకడ్బందీగా కల్పించాలన్నారు. పతాకావిష్కరణ కార్యక్రమంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ లో వేదిక,సీటింగ్ ఏర్పాట్లను పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ కు ఆదేశించారు.వేడుకల ప్రాంగణంలో తాగునీరు,పారిశుద్ధ్య ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చికిత్స అందించేలా వైద్య బృందాన్ని వేడుక వద్ద అందుబాటులో ఉంచాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. వివిధ సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా వివిధ శాఖల స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు.ప్రదర్శన స్టాళ్లను ఆకర్షణీయంగా, వినూత్నంగా ఏర్పాటు చేసిన ఉత్తమ శాఖలకు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా దేశభక్తిని చాటేలా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని విద్యా శాఖ అధికారులకు సూచించారు. జిలాల్లో సమర్ధవంతంగా విధులు నిర్వహించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేయాలన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రోటోకాల్ ను పాటిస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు,ఆర్డీవో శ్రీనివాస రావు,కలెక్టరేట్ ఏ.ఓ మంజుల, గద్వాల్ తహసీల్దార్ హరి కృష్ణ, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# చెంగిచెర్ల శ్మశానవాటికలో మౌలిక వసతులపై పరిశీలన...

**- ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, డిప్యూటీ కమిషనర్ శైలజ పర్యటన**



బోడుప్పల్,ఆగస్టు 13 (విజన్ ఆంధ్ర): బోడు ప్పల్ సర్కిల్ పరిధిలోని చెంగిచెర్ల 12వ డివిజ న్‌లో ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, డిప్యూటీ కమిషనర్ శైలజ,మాజీ కార్పొరేటర్ కొత్త చందర్‌గౌడ్,కొత్త సుశాంత్‌గౌడ్‌లతో కలిసి గురువారం పర్యటించారు. చెంగిచెర్లలోని శ్మశానవాటికను పరిశీలించి అక్కడ కల్పించాల్సిన మౌలిక వసతులపై అధికారులతో చర్చించారు.శ్మశానవాటికలో సీసీ రోడ్డు నిర్మాణం, హైమాస్ట్ లైట్ల ఏర్పాటు, శివుని విగ్రహానికి రంగులు వేయించడం, నాయీబ్రాహ్మణుల కళ్యాణకట్ట కోసం షెడ్డు నిర్మాణం వంటి పనులను చేపట్టే అంశాలను పరిశీలించారు. శ్మశానవాటిక ఆవరణ మొత్తం పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉండేలా గార్డెన్ ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కుర్రి శివశంకర్,మేకల యాదగిరి,జి.చేతన్ తదితరులు పాల్గన్నారు.

# సింగరేణి ఉత్తమ ఉద్యోగులకు ఆగస్టు 15న సన్మానం





భూపాలపల్లి జిల్లా, ఆగస్టు 13 (విజన్ ఆంధ్ర): 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని భూపాలపల్లి ఏరియాలోని సింగరేణి గనుల్లో వివిధ విభాగాల్లో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను ఆగస్టు 15న సన్మానించనున్నారు. ప్రతి ఏటా కొనసాగుతున్న ఆనవాయితీలో భాగంగా ఈ ఏడాది ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేశారు. కేటీకే-1 ఇంక్లైన్ గనికి చెందిన చెరుకూరి కిశోర్ (సీనియర్ మైనింగ్ సర్దార్), రావుల రాజయ్య (కోల్ కట్టర్), కేటీకే-5 ఇంక్లైన్‌కు చెందిన బండారి తిరుపతి (హాలేజ్ ఆపరేటర్), భూక్యా మీరాలాల్ (సపోర్ట్ మెన్), కేటీకే-6 ఇంక్లైన్‌కు చెందిన తాతగట్టు స్వామి (కోల్ కట్టర్), భూక్యా రాములు (ఎస్డీఎల్ ఆపరేటర్) ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికయ్యారు. అలాగే కేటీకే-8 ఇంక్లైన్‌కు చెందిన కొలను రవీందర్ (ఫిట్టర్), కక్కెర్ల శ్రీనివాస్ (హెడ్ ఓవర్), కేటీకే-ఓసీ-3కి చెందిన గద్దర తిరుపతయ్య (హెడ్ ఓవర్‌మెన్), మేరుగు ప్రవీణ్‌కుమార్ (సీనియర్ అసిస్టెంట్), కేటీకే-ఓసీ-2కి చెందిన మేక సుధాకర్ (జనరల్ అసిస్టెంట్), బండ బాపు (ఎంవీ డ్రైవర్)లను కూడా ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేశారు.

సామ కృష్ణకు 'బెస్ట్ సింగరేణీయన్' అవార్డు

కేటీకే-ఓసీపీ-2కు చెందిన సామ కృష్ణ (ఈపీ ఆపరేటర్)ను 'బెస్ట్ సింగరేణీయన్'గా ఎంపిక చేశారు. ఆయనకు కొత్తగూడెంలో సింగరేణి సీఎండీ చేతుల మీదుగా ప్రత్యేక సన్మానం చేయనున్నారు. విధుల్లో నైపుణ్యం, క్రమశిక్షణ, అంకితభావంతో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించినందుకు వీరిని ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. ఆగస్టు 15న జనరల్ మేనేజర్ కార్యాలయంలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఏరియా జనరల్ మేనేజర్ ఏ. రాజేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా ఉద్యోగులకు సన్మానం జరగనుంది. ఎంపికైన ఉద్యోగులను ఏరియా జనరల్ మేనేజర్ ఏ. రాజేశ్వర్ రెడ్డి, ఎస్ఓటు జీఎం, పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్ తదితర అధికారులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## భూత్పూర్ MRO కార్యాలయంలో రికార్డు విభాగం సమస్యలు






మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 13 (విజన్ ఆంధ్ర): భూత్పూర్ మండల తహసీల్దార్ (వీ=ూ) కార్యాలయంలోని రికార్డు విభాగం తగిన సౌకర్యాల లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సమాచారం. చిన్న గదిలో పనిచేయాల్సి రావడం, సరైన వెంటిలేషన్ లేకపోవడం వల్ల సిబ్బంది సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలుస్తోంది. రికార్డు విభాగంలో ప్రభుత్వానికి సంబంధించిన పాత రికార్డులు, దస్తావేజులు, ఫైళ్లు అనేక సంవత్సరాలుగా భద్రపరచబడి ఉన్నాయి. అయితే ఈ విభాగానికి అవసరమైన స్థలం, గాలి, వెలుతురు వంటి కనీస సౌకర్యాలు లేకపోవడంపై సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. అలాగే, కొన్ని సంవత్సరాలుగా నిల్వ ఉంచిన పాత రికార్డుల కారణంగా అక్కడ దుర్వాసన (స్మెల్) ఏర్పడే అవకాశం ఉండటంతో పాటు, బాక్టీరియా కూడా పెరిగే ప్రమాదం ఉందని సిబ్బంది చెబుతున్నారు. దీనివల్ల అక్కడ పనిచేస్తున్న ఉద్యోగుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా శ్వాస సంబంధిత సమస్యలు, అలర్జీలు వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వారు పేర్కొంటున్నారు. చిన్న గదిలో ఎక్కువసేపు పని చేయాల్సి రావడం, గాలి ప్రసరణ సరిగా లేకపోవడం వల్ల పని నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. రికార్డులను సక్రమంగా అమర్చేందుకు తగిన స్థలం లేకపోవడం కూడా సమస్యగా మారిందని తెలుస్తోంది. ఈ సమస్యపై సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించి రికార్డు విభాగాన్ని పరిశీలించి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సిబ్బంది కోరుతున్నారు. భూత్పూర్ వీ=ూ కార్యాలయంలో రికార్డు విభాగం పరిస్థితిపై అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారా? అనేది వేచి చూడాలి.

# ఘనంగా ఆస్పైర్ సమ్మిట్ 3.ఓ

**- ముఖ్య అతిధిగా నారాయణ విద్య సంస్థల డైరెక్టర్ పి రమ నారాయణ,జి ఎం గోపాల్ రెడ్డి**



**- డి జి ఎం రిజ్వానాఇమ్రాన్**

హన్మకొండ బ్యూరో ఛిఫ్ ఆగస్టు 13(విజన్ ఆంధ్ర ) : నారాయణ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తెలంగాణ రాజధాని అయిన హైదరాబాద్ స్మార్ట్ సిటీ సమీపన శిల్ప కల క్షేత్ర వేదికగా ఏర్పాటు చేసిన క్షేత్రంలో అత్యంత వైభవంగా2025-2026 ఆస్పిర్ సమ్మిట్ 3.ఓ ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపల్ రాజశేఖర్ ప్రకటనలో తెలిపారు, నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పి రమ నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2025 26 విద్యా సంవత్సరం గాను తెలంగాణ రాష్ట్రంలో నారాయణ స్కూల్ విభాగంలో విద్యాసంస్థలు అన్ని విద్య సంస్థల కంటే ముందు ఉన్నాయని సంతోషించారు,ఈ సందర్భంగా వరంగల్ జోనల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రిజ్వానా ఇమ్రాన్ మాట్లాడుతూ...జోన్లో స్కూల్ విభాగంలో, వరంగల్ ఓ ఎన్ సి ఎస్ హై స్కూల్, కాజిపేట్ ఈ ఎన్ సి ఎస్ హై స్కూల్,హంటర్ రోడ్ ఎస్చా టీ ఆర్ స్కూల్ విశేష ప్రతిభ చూపించినందుకుగాను పాఠశాలకు సంబంధించి విశేష పత్రంతో పాటు క్యాష్ ప్రైస్ ప్రత్యేక బహుమతులు లభించాయాన్నారు, తమకు నిరంతరం మార్గదర్శనం చేస్తూ ప్రోత్సహిస్తున్న డైరెక్టర్ పి రమ నారాయణ, అదేవిదంగా జి ఎం




గోపాల్ రెడ్డి కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లొ బ్రాంచ్ ప్రిన్సిపల్స్ రాజశేఖర్, అనిత, మమత, కోఆర్డినేటర్స్ సాయి కృష్ణ శ్యామల శిరీష ఏ ఓస్, ఆదిల్ చేరాలు,హరీష్ అకాడమీడింగ్స్ వంశీకృష్ణ చారి, వైస్ ప్రిన్సిపల్ అనూష కర్ణ శ్రీ, అనూష మౌనిక, పాజిలత్ సబిత, తదితర ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

# మోగిన గజ్జెలు మార్మోగిన దరువులు

**- తెలంగాణ మట్టి వాసనను మోసుకొచ్చిన బోనాల జాతర**

**- కళాబిద్దల భారీ ప్రదర్శనతో కుత్బుల్లాపూర్‌లో పండుగ సందడి**

విజన్ ఆంధ్ర (13) హైదరాబాద్ : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల జాతర కుత్బుల్లాపూర్‌లో ఘనంగా జరిగింది, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పద్మావతి కన్వెన్షన్‌లో నిర్వహించిన ఈ వేడుకల్లో తెలంగాణ పల్లె సంస్కృతి, జానపద కళల వైభవం ప్రతిబింబించింది. డప్పుల దరువులు, జానపద గీతాలు, నృత్య ప్రదర్శనలతో ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది,

**- కళాకారుల భారీ ప్రదర్శన:**

బోనాల పండుగలో భాగంగా పలువురు కవి గాయకులు, జానపద కళాకారులు, సంప్రదాయ కళారూపాల ప్రదర్శకులు పాల్గొన్నారు. డప్పు దరువులకు అనుగుణంగా కళాకారుల ఆటపాటలు, నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి, అమ్మవారికి బోనం సమర్పించే సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా నిర్వహించిన ప్రత్యేక ప్రదర్శనలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి,

**- మట్టి వాసనను మోసుకొచ్చిన కళాబిద్దలు:**

తెలంగాణ మట్టి వాసన, పల్లె జీవనశైలి, జానపద సంస్కృతి ఈ కార్యక్రమంలో స్పష్టంగా కనిపించింది. డప్పు దరువులు, జానపద గీతాలు, సంప్రదాయ నృత్యాలతో కళాకారులు పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చారు. కళాకారుల ప్రదర్శనలకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది.



**- తెలంగాణ కళలకు పెద్దపీట:**

స్థానిక కళాకారులను ప్రోత్సహించడంతో పాటు తెలంగాణ జానపద కళలు, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు పరిచయం చేయడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు, పల్లె కళలకు వేదిక కల్పించడం ద్వారా కళాకారులను ప్రోత్సహిస్తూ తెలంగాణ సంస్కృతిని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**- మరపురాని సాంస్కృతిక వేడుక:**

ఆటపాటలు, డప్పు దరువులు, జానపద నృత్యాలు, సంప్రదాయ కళారూపాలతో సాయంత్రం వరకు సాగిన కార్యక్రమం ప్రేక్షకులను అలరించింది. అమ్మవారి భక్తి, తెలంగాణ జానపద కళల శక్తి, కళాకారుల ఆటపాటల సందడి కలగలిసి కుత్బుల్లాపూర్ బోనాల జాతరను ఓ మరపురాని సాంస్కృతిక వేడుకగా నిలిపాయి, ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మహిళా అధ్యక్షురాలు స్వప్తక్క, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సిరెడ్డి భూపతిరెడ్డి, జర్నలిస్టు నేతలు విరహత్ అలీ, మరుకి సాగర్, బాలరాజు, సుగ్రీవ్ ముదిరాజ్, బీఆర్ఎస్ నేతలు తెలంగాణ సాయి, పుప్పల భాస్కర్, మన్నే రాజు, సామాజిక నేత ముఖేష్, చైతన్య యాదగిరి, తెలంగాణ ప్రైవేటు ఉద్యోగుల సంఘం నేత గంధం రాములు, అంబల మహేష్, జర్నలిస్టు లక్ష్మణ్, భాషా సంస్థ తెలంగాణ ప్రభుత్వం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ విజయ్ కుమార్, దినకర్, తెలంగాణ సాంస్కృతిక శాఖ సలహా మండలి సభ్యులు దరువు ఎల్లన్న, అంతడుపుల నాగరాజ్, కాజా పాషా, కుత్బుల్లాపూర్ కళాకారుల సంఘం సభ్యులు దరువు అంజన్న, ఎంవీ మల్లేష్, దుద్దు రాహుల్, డప్పు రామస్వామి, జోగు వెంకట్, కరాటే శంకర్, మా పల్లె శంకర్, సాల్మన్ రాజ్, అమృతయ (సన్నీ), బాలరాజ్, హేమంత్, భాస్కర చారి, సాయిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## 100 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ దేశభక్తి నినాదాలు చేసినా విద్యార్థులు

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 13( విజన్ ఆంధ్ర ): మహబూబాబాద్ జిల్లాలో హర్ ఘర్ తిరంగ్ యాత్ర జిల్లాలోని పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమములో స్వచ్ఛంద సంస్థలు లాయర్లు పాఠశాల విద్యార్థులు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. 80 వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ నిర్మాణంలో ఉండాలని జాతీయ భావం పెంపొందించుకోవాలని విద్యార్థులు స్వచ్ఛంద సంస్థల నాయకులు పాల్గొన్నారు. విద్యార్థులు నాయకులు వందేమాతరం నినాదాలు చేసుకుంటూ దేశ సమైక్యత ప్రతి పౌరుడు దేశాభివృద్ధిలో తన వంతు పాత్ర పోషించాలని తెలియజేసుకుంటూ ముందుకు సాగారు. దేశ స్వాతంత్రం కోసం పోరాడిన సమరయోధుల త్యాగాలు గురించి స్మరించుకుంటూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి శ్రీధర్ మాట్లాడుతూ భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ హర్ ఘర్ తిరంగా, హర్ మన్ తిరంగా" అనే సందేశంతో ప్రతి భారతీయుడి హృదయంలో దేశభక్తి భావాన్ని మరింత బలపర్చాలని అన్నారు ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడం అనేది కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదు, దేశం పట్ల మనకున్న గౌరవం, ప్రేమ, బాధ్యతను వ్యక్తపరిచే ఒక గొప్ప అవకాశం అని ఆయన వివరించారు. బిజెపి మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు వల్లపు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటి మీద, గ్రామంలో, ప్రతి గల్లీలో పట్టణాలలో మన జాతీయ పతాకం రెపరెపలాడాలని, ప్రతి భారతీయుడు త్రివర్ణ పతాకంతో వ్యక్తిగత అనుబంధాన్ని పెంపొందించుకోవాలని ప్రధాని పిలుపును మనం పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమం దేశ ఐక్యత, సమగ్రత,




దేశభక్తికి ప్రతీకగా మారిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పట్టణాలలో దేశ రాజధానిలో ప్రజలంతా ఒక పండుగ వాతావరణంలో పాల్గొని త్రివర్ణ పతాకాన్ని ఎగరవేలని అన్నారు. భారత పౌరులుగాఈ మహత్తర కార్యక్రమంలో భాగస్వామి కావడం మన అదృష్టంగా భావించాలని అన్నారు. మన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ అభివృద్ధికి మన వంతు బాధ్యతను నిర్వర్తిస్తామని సంకల్పిద్దాం అన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు వద్దిరాజు రామచంద్రరావు తిరంగా యాత్ర జిల్లా కన్వీనర్ ఇందు భారతి జిల్లా కార్యదర్శి గడ్డం అశోక్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్యామ్ శర్మ వార్డు కౌన్సిలర్ భూక్య శ్రీదేవి బాలునాయక్ లాయర్ తుంపెల్లి శ్రీనివాస్ జిల్లా మాజీ కార్యదర్శి చిట్టిమల్ల శ్రీను మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షురాలు రేష్మ టౌన్ ఉపాధ్యక్షులు మధ్యబోయిన రవి యాదవ్ స్వచ్ఛంద సంస్థ నాయకులు లాయర్లు ప్రజలు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## లైన్స్ క్లబ్ సిద్దిపేట మరియు ప్రీమియం లీగ్ సిద్దిపేట ఆధ్వర్యంలో క్రీడా సామగ్రి వితరణ




దుబ్బాక విజన్ ఆంధ్ర : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ధర్మాజీపేట లో పనిచేయుచున్న జూనియర్ అసిస్టెంట్ చీకోటి చంద్రశేఖర్ గారి ప్రోత్సాహంతో లైన్స్ క్లబ్ సిద్దిపేట మరియు ప్రీమియం లీగ్ సిద్దిపేట సంయుక్త ఆధ్వర్యంలో దుబ్బాక మునిసిపాలిటీ ధర్మాజీపేట వార్డులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు క్రీడా సామగ్రిని విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల క్రీడా అభివృద్ధికి ఉపయోగపడే వాలీబాల్ నెట్, టెన్నికాయిట్ నెట్ మరియు క్రీడా వస్తువులు మరియు స్టీల్ గ్లాసులను పాఠశాలకు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ బి. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రతిభ కనబరచాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే శ్రీ వినోద్ మోదని మరియు వారి బృంద సభ్యులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పాఠశాలల విద్యార్థులకు అవసరమైన క్రీడా సదుపాయాలను అందించడం తమ సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ధర్మాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు గ్రామ ప్రజలు లైన్స్ క్లబ్ సిద్దిపేట, ప్రీమియం లీగ్ సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ విరాళం ద్వారా విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి మరింత పెరిగి, పాఠశాల క్రీడా కార్యకలాపాలకు ప్రోత్సాహం లభించనుందని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎస్ పి ఎల్ బృందం ఆకుల పాండురంగం ,రాజు బహుదూర్ రెడ్డి, పొద్దుటూరు సిద్ధులు, బిఎల్ శ్రీనివాస్ ,గ్యాదరి కుమార్ మరియు పాఠశాల ఉపాధ్యాయులు మహమ్మద్ సాదత్ అలీ, పల్లె శ్రీనివాస్ గౌడ్ , కె. వెంకట కృష్ణమాచారి, ఆర్ శ్రీనివాస్ రెడ్డి, కె .శ్రీకాంత్, పి. బాలకృష్ణ, ఆర్ పద్మావతి, వి శైలజ పి డి ,ఎస్. దినేష్, ఎస్ డి వహీద్, ఏ రేణుక ,సి ఆర్ పి టి.నవీన్ కుమార్ పాల్గొన్నారు.

## 23వ వార్డులో సీసీ రోడ్ల నిర్మాణం శంకుస్థాపన కార్యక్రమం

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 13 ( విజన్ ఆంధ్ర): మహబూబాబాద్ మున్సిపాలిటీ 23వ వార్డులో సీసీ రోడ్ల నిర్మాణం శంకుస్థాపన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ గూగులోత్ జ్యోతి రమేష్ పాల్గొని ఆమె మాట్లాడుతూ గతంలో సిసి రోడ్లు వేయకుండా కాలయాపన చేశారని ఇప్పుడు మా ప్రభుత్వం సిసి రోడ్లకు ఎంతో ప్రాధాన్యత ఇస్తూ నిర్మించడం జరుగుతుందని ఆమె అన్నారు అదేవిధంగా డిసిసి అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మురళి నాయక్ ఆధ్వర్యంలో యుడిఎఫ్ నిధుల నుండి వివిధ ప్రాంతాలను కలుపుకుంటూ సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా ఖాళీలలో వర్షం వస్తే బురదమయంతో ఉన్న ప్రాంతాలైన భద్రన్న కాలనీ జర్నలిస్ట్ కాలనీ ఎన్జీవోస్ కాలనీలో రోడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కోల సత్యం మాట్లాడుతూ గతంలో మా 23వ వార్డు అభివృద్ధికి నోచుకోకుండా ఉన్నదని, దానిని అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. నాజర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత



ఎంతో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని రోడ్ల నిర్మాణం డ్రైనేజీల నిర్మాణం ఇందిరా ఇండ్ల నిర్మాణం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో 23వ వార్డు కౌన్సిలర్ బద్దెపూరి ఐశ్వర్య గోపీనాథ్ 24 వ వార్డు కౌన్సిలర్ దిలీప్ పద్మం ప్రవీణ్ శ్రీహరి ఫారుక్ మోతిలాల్ సురేష్, శ్రీను నరేష్ ఉస్మాన్ వాహిని శివ ఆశయ రాము ,తదితరులు పాల్గొన్నారు.

## నాకు వందల ఎకరాలు ఉన్న మాట అవాస్తవం

**- ఇందారపు మొగిలి నాపై తప్పుడు ఆరోపణలు చేసినందుకు క్షమాపణ చెప్పాలి... తాండ్ర మార్క్**



భూపాలపల్లి జిల్లా 13 ఆగస్టు (విజన్ ఆంధ్ర) : గత కొద్ది రోజుల క్రితం నా పేరు బదనం చేయాలని ఉద్దేశంతో కొంతమంది వ్యక్తులు పనిగొట్టుకొని నాకు లేని భూములు వందల ఎకరాలంటూ సృష్టించి నన్ను బదనాం చేస్తున్నారు. నాపై కొన్ని పత్రికల్లో, చానల్లో అవస్తవాలు చెప్తున్నారు. ముఖ్యంగా ఇందారపు మొగిలి తండ్రి బద్దయ్య తాడిచర్ల గ్రామ వాసి నాకు, నా కుటుంబ సభ్యులకు సంబంధించిన భూముల విషయంలో 13 ఎకరాల 36 గుంటలు ఉన్నవని ఆరోపించినడు. నా కుటుంబ సభ్యుల పేరు మీద వందల ఎకరాలు అంటున్న ఈ విషయాలు కేవలం కల్పితం మాత్రమే అసలు నాకున్న భూములు 8 ఎకరాల 26 గుంటలు దీనిలో జెన్కోలో పోయినయి 1 ఎకరం 36 గుంటలు పోయినవి దానికి డబ్బులు కూడా తీసుకున్నాను. నాకు ప్రస్తుతం కేవలం కాపురం శివారు సర్వేనెంబర్ 92లో 4 ఎకరాలు, తాడిచర్ల శివారు 917 లో 1ఎకరం.30 గుంటలు, 770 లో ఒక ఎకరం భూమి మొత్తంగా 6 ఎకరాల 30 గుంటలు మాత్రమే ఉన్నవి. అందులో 1 ఎకరం లో ప్రభుత్వం అంతిమపట్ట ఇచ్చినది. వీటి కంటే ఎక్కువ భూమి ఉన్నచో నేను స్వయంగా ప్రభుత్వానికే రాసి ఇస్తాను. లేని పక్షంలో ఇందారపు మొగిలి కి ఉన్నటువంటి భూమిని ప్రభుత్వానికి రాసి ఇస్తాడా అని నేను సవాల్ చేస్తున్నాను. ఈ సవాల్ తప్పకుండా స్వీకరించాలి లేని పక్షంలో ప్రభుత్వం నా భూములపై మరియు అతని భూములపై కూడా న్యాయ విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా నేను ప్రభుత్వాన్ని విన్నవించుకుంటున్నాను. అలాగే నాపై తప్పుడు ఆరోపణలు చేసిన ఇందాక మొగిలి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నేను ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను.

## విలీన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు..

సూర్యాపేట ఆగస్టు 13:(విజన్ ఆంధ్ర) : మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేసి, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రం 12 వార్డు పిల్లలమర్రి లో 36 లక్షల నూతన డబుల్ లైన్ బ్రిడ్జి ని రిబ్బను కటింగ్ చేసి మున్సిపాలిటీ ఐదు లక్షల వ్యాయామంతో నిర్మించనున్న సిసి రోడ్డు కల్వర్టు నిర్మాణానికి వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలమర్రి అభివృద్ధే లక్ష్యంగా ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తున్నామని అన్నారు. విలీన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు. రహదారులు, డ్రైనేజీ, కల్వర్టులు తదితర మౌలిక వసతులను అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు.విలీన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారులు, మౌలిక సదుపాయాలు అందుబాటులోకి



తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్, స్థానిక కౌన్సిలర్ కోడి నాగరాజు,సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ చింతమళ్ల రమేష్, మున్సిపల్ కౌన్సిలర్ చిలుముల సునీల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ఎడ్ల గంగాభవాని, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఎలిమినేటి అభినయ్, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నాగెల్లి అరుణ్‌కుమార్, నరేందర్ నాయుడు, 11వ వార్డు అధ్యక్షుడు చందా సైదులు, మాజీ ఎంపీటీసీ రాపర్తి శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ వెంకట్‌లాల్, దేవాలయ చైర్మన్ కొండ వెంకన్న, నాయకులు చింత సైదులు, చిలుక ఆనంద్, లంజపెల్లి సురేష్, చేరుకుపల్లి సంజీవ, కృష్ణయ్య, మంగపండ్ల మల్లేష్, బట్టు నాగరాజు, సురారపు సైదులు, రాపర్తి శంకర్, పోకల ఉపేందర్, కిట్టు, ముదిరాజ్ సంఘం నాయకులు తుటిపల్లి శ్రీనివాస్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం అభినందనీయం



సూర్యాపేట ఆగస్టు 13:(విజన్ ఆంధ్ర) : వార్డు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యం శిబిరం అభినందనీయం అని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత అన్నారు.గురువారం జిల్లా కేంద్రం1వ వార్డు కౌన్సిలర్ బానోతు సైదులు నాయక్ ఆధ్వర్యంలో వాసన్ లేజర్ కంటి ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమాజ సేవా దృక్పథంతో ఈ క్యాంప్ ఏర్పాటు చేసిన కౌన్సిలర్ సైదులు నాయక్, వాసన్ లేజర్ కంటి ఆసుపత్రి యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. నేత్ర పరీక్షలపై నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని, 40 సంవత్సరాలు దాటిన వారు పరీక్షలు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమార్ కుంట్ల వేణు గోపాల్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ జెడ్పిటిసి చింతమళ్ల రమేష్, మున్సిపల్ కౌన్సిలర్లు సయ్యద్ తన్వీర్ హుస్సేన్, చిలుముల సునీల్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఎలిమినేటి అభినయ్, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నరేందర్ నాయుడు, గుర్రం ప్రకాష్ రెడ్డి, బూర సైదులు గౌడ్, బానోతు సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

- తిరుమల మేడోస్,సాయికృష్ణ లేఅవుట్ స్థలంపై పక్కా పథకం?
- బయటకు తెలిసింది 300 గజాలు.. ఎసరు పెట్టింది1000 గజాలు.....
- పూజలు అందుకుంటున్న గుడి స్థలానికీ విక్రయ యత్నాలు...
- కాలనీవాసుల ఫిర్యాదుతో బట్టబయలైన వ్యవహారం..
- అమ్మిన వారిపై కేసు.. కొనుగోలుదారులపై చర్యలెక్కడని నిలదీత..
- పత్రాల్లో కొనుగోలుదారులు కాలనీవాసులే.. రాజకీయ ఒత్తిళ్లతో తప్పించారంటూ ఆరోపణలు..
- గుడి,పార్కు స్థలాన్ని కాపాడుకునే వరకు వెనక్కి తగ్గం - కాలనీవాసులు

# మైసమ్మ గుడి..
## పార్కు స్థలానికే ఎసరు పెట్టిన
# ఇంటి దొంగలు




*కాలనీ లేఅవుట్‌లో గుడి, పార్కు కోసం కేటాయించిన స్థలానికే కొందరి కన్ను పడిందన్న ఆరోపణలు తిరుమల మేడోస్ కాలనీలో తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఏళ్లుగా స్థానికులు పూజలు నిర్వహిస్తున్న మైసమ్మ గుడి ఉన్న స్థలంతో పాటు పార్కు కోసం కేటాయించిన భూమిపై విక్రయ లావాదేవీలు జరిగాయన్న ఆరోపణలు వెలుగులోకి రావడంతో కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థలం విక్రయ వ్యవహారంపై కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో అధికారులు స్పందించి విక్రయించిన వారిపై కేసు నమోదు చేసినట్లు వారు చెబుతున్నారు. అయితే అదే సమయంలో కొనుగోలు చేసిన వ్యక్తులు కూడా తిరుమల మేడోస్ కాలనీకి చెందినవారే కావడం ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. లేఅవుట్ స్వరూపం, గుడి ఉనికి, పార్కు స్థలం వంటి విషయాలు తెలిసినప్పటికీ కొనుగోలు చేశారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.*





**మేడ్చల్ జిల్లా,ఆగస్ట్ 13(విజన్ ఆంధ్ర ప్రతినిధి):**

**- ఏళ్లుగా పూజలు.. మైసమ్మ గుడిగా గుర్తింపు**

తిరుమల మేడోస్ పరిధిలోని ఈ గుడిలో కొన్ని సంవత్సరాలుగా గ్రామస్థులు, స్థానికులు పూజలు నిర్వహిస్తున్నారని కాలనీవాసులు చెబుతున్నారు. స్థానికుల ఆచారాలు, పూజా కార్యక్రమాలతో కొనసాగుతున్న ఈ స్థలాన్ని మైసమ్మ గుడిగా గుర్తించి పూజలు నిర్వహిస్తున్నామని వారు పేర్కొంటున్నారు. అలాంటి స్థలాన్ని వ్యక్తిగత క్రయవిక్రయాలకు గురిచేయడం ఎలా సాధ్యమైందని వారు ప్రశ్నిస్తున్నారు. గుడి ఉన్న విషయం తెలిసినప్పటికీ స్థలాన్ని కొనుగోలు చేయడానికి ఎవరైనా ముందుకు వచ్చారా? వారి వెనుక ఎవరున్నారు? అనే అంశాలపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**- లేఅవుట్‌లో గుడి.. పార్కు అని స్పష్టంగా ఉన్నా!**

కాలనీ లేఅవుట్ పత్రాల్లో గుడి, పార్కు కోసం స్థల కేటాయింపులు ఉన్నాయని కాలనీవాసులు చెబుతున్నారు. దీనికి సంబంధించిన పత్రాలు తమ వద్ద ఉన్నాయని, అవసరమైన సమయంలో అధికారులకు సమర్పించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొంటున్నారు. ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాన్ని వ్యక్తిగత వ్యక్తుల క్రయవిక్రయాలకు ఎలా అనుమతించారు? రిజిస్ట్రేషన్ జరిగితే ఏ పత్రాల ఆధారంగా జరిగింది? అనే ప్రశ్నలు ఇప్పుడు అధికారుల ముందున్నాయి.

**- పక్కా పథకమా.......?**


గుడి, పార్కు స్థలం కావడంతో భవిష్యత్‌లో విలువ పెరుగుతుందని భావించి ముందస్తు ప్రణాళికతోనే స్థలాన్ని దక్కించుకునే ప్రయత్నం జరిగిందన్న ఆరోపణలు కాలనీలో వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించిన పూర్తి వాస్తవాలు అధికారిక దర్యాప్తులోనే తేలాల్సి ఉంది. కాలనీవాసులు మాత్రం ఇది సాధారణ స్థల లావాదేవీ కాదని, ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాన్ని వ్యక్తిగత ప్రయోజనాలకు మార్చే ప్రయత్నంగా భావిస్తున్నారు.

**- కొనుగోలుదారులు కూడా కాలనీవాసులే!**

ఈ వ్యవహారంలో మరో కీలక అంశం కొనుగోలుదారులుగా ఉన్న వ్యక్తులు అదే కాలనీకి చెందినవారేనని స్థానికులు చెబుతుండటం. కాలనీలో ఏళ్లుగా ఉన్న గుడి, దాని వద్ద జరిగే పూజలు, లేఅవుట్‌లోని పార్కు స్థలం గురించి వారికి తెలియకుండా ఉండే అవకాశమేంటని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. తెలిసి కొనుగోలు చేశారా? తెలియక కొనుగోలు చేశారా? అనే విషయాన్ని అధికారులు పత్రాలు, సాక్ష్యాలు, లావాదేవీల ఆధారంగా నిర్ధారించాలని కోరుతున్నారు.

**- బయటపడింది 300 గజాలు.. అసలు 1,000 గజాలా?**

300 గజాల వ్యవహారం బయటపడడంతో పెద్దల సమక్షంలో వాటిని రద్దు చేసుకుంటామని చెప్పినట్లు సమాచారం. అయితే మిగిలిన సుమారు 700 గజాలను బంధువుల పేర్లపైకి మార్చుకుని, తాము లక్షల్లో నష్టపోయామని చెబుతూ వ్యవహారాన్ని వదిలేయాలని పెద్దలను ఆశ్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అమ్మిన వారిపై కేసు.. కొనుగోలుదారుల సంగతేంటి? కాలనీవాసుల ఫిర్యాదుతో విక్రయించిన వారిపై కేసు నమోదు చేసినప్పటికీ, కొనుగోలుదారులపై సమాన స్థాయిలో విచారణ జరగకపోవడంపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఒక లావాదేవీలో విక్రేత, కొనుగోలుదారు ఇద్దరి పాత్రను పరిశీలించాల్సి ఉంటుందని, కేవలం ఒక వర్గంపై చర్యలు తీసుకుని మరొక వర్గాన్ని వదిలేయడం వల్ల అనుమానాలు మరింత పెరుగుతున్నాయని అంటున్నారు.




**- రాజకీయ ఒత్తిళ్ల ఆరోపణలు....!!**

కొనుగోలుదారులపై చర్యలు తీసుకోకుండా వదిలేయడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. వ్యవహారం బయటపడిన తర్వాత కొందరు రాజకీయ నాయకుల వద్దకు వెళ్లి తమకు అనుకూలంగా చర్యలు తీసుకునేలా ప్రయత్నించారన్న విమర్శలు ఉన్నాయి. అయితే రాజకీయ నాయకుల ప్రమేయంపై వస్తున్న ఆరోపణలు నిజమా కాదా అన్నది కూడా దర్యాప్తులో తేలాల్సి ఉంది. అధికారులపై ఎవరైనా ఒత్తిడి తెచ్చారా? చర్యలు ఎందుకు ఒక దశలో ఆగిపోయాయి? అనే అంశాలపై ఉన్నతాధికారులు విచారణ చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

**- గుడి, పార్కు స్థలం కాపాడేదెవరు?**

లేఅవుట్‌లో గుడి, పార్కు కోసం కేటాయించిన స్థలం వ్యక్తిగత వ్యక్తుల చేతుల్లోకి వెళ్లితే కాలనీ ప్రజల సామూహిక ప్రయోజనం దెబ్బతింటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఏళ్లుగా స్థానికులు పూజలు నిర్వహిస్తున్న మైసమ్మ గుడి స్థలానికి సంబంధించి ఎలాంటి వివాదాస్పద లావాదేవీలు జరగకుండా అధికారులు తక్షణమే రికార్డులను పరిశీలించి స్థలాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

**- పత్రాలన్నీ బయటపెట్టాలి**

ఈ వ్యవహారానికి సంబంధించి తమ వద్ద ఉన్న లేఅవుట్ పత్రాలు, స్థల కేటాయింపు వివరాలు, విక్రయకొనుగోలు పత్రాలు, రిజిస్ట్రేషన్ వివరాలు తదితర ఆధారాలను అధికారుల ముందు ఉంచేందుకు సిద్ధంగా ఉన్నామని కాలనీవాసులు చెబుతున్నారు. స్థలం ఎవరి పేరుపై ఉంది? లేఅవుట్‌లో దాని కేటాయింపు ఏమిటి? విక్రయానికి ఎవరు ప్రయత్నించారు? కొనుగోలుదారులు ఎవరు? మధ్యవర్తులెవరు? డబ్బు లావాదేవీలు ఎలా జరిగాయి? రిజిస్ట్రేషన్ జరిగిందా? వంటి ప్రతి అంశాన్ని దర్యాప్తులో పరిశీలించాలని కోరుతున్నారు.



**"ఎవరినీ వదిలే ప్రసక్తే లేదు"**

మైసమ్మ గుడి, పార్కు స్థలాన్ని కాపాడుకునే విషయంలో వెనక్కి తగ్గేది లేదని కాలనీవాసులు స్పష్టం చేస్తున్నారు. ఏళ్లుగా పూజలు జరుగుతున్న గుడి స్థలాన్ని వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించుకునే ప్రయత్నాలను సహించబోమని అంటున్నారు. "ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు, కాలనీ సామూహిక అవసరాలకు సంబంధించిన స్థలాన్ని కాపాడుకోవడం మా బాధ్యత. ఈ వ్యవహారంలో ఎవరి పాత్ర ఉన్నా.. ఆధారాలతో బయటపెడతాం. తప్పు చేసిన వారిని వదిలే ప్రసక్తే లేదు" అని కాలనీవాసులు హెచ్చరిస్తున్నారు.

**- ఉన్నతస్థాయి దర్యాప్తే పరిష్కారం**

ఈ వివాదాన్ని స్థానిక స్థాయిలోనే ముగించకుండా ఉన్నతాధికారులు పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. లేఅవుట్ రికార్డుల నుంచి మొదలుకొని రిజిస్ట్రేషన్ పత్రాలు, కొనుగోలువిక్రయ లావాదేవీలు, కొనుగోలుదారుల పాత్ర, మధ్యవర్తుల వ్యవహారం, రాజకీయ జోక్యం, అధికారుల చర్యలు.. ఇలా ప్రతి కోణాన్ని పరిశీలించాలని కోరుతున్నారు. మైసమ్మ గుడి, పార్కు కోసం కేటాయించిన స్థలాన్ని పరిరక్షించడంతో పాటు.. ఈ వ్యవహారం వెనుక ఉన్న అసలు వ్యక్తులు, లావాదేవీల పూర్తి వివరాలు వెలుగులోకి రావాలంటే సమగ్ర దర్యాప్తు తప్పనిసరి అని కాలనీవాసులు స్పష్టం చేస్తున్నారు. ఎంతటి వారినైన వదిలిపెట్టొద్దు – మీసాల క్రిష్ణ బీఆర్ఎస్ ప్రదాన కార్యదర్శి : గుడి స్థలాన్ని కబ్జాచేయడం సిగ్గుచేటు,దేవుడి భూమినే కబ్జా చేస్తున్నారంటె ప్రజల స్థలాలకు రక్షణ లేకుండా పోతుంది.గుడి,పార్కు స్థలాన్ని అమ్మిన వారిపై కొనుగోలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

## జనావాసాల మధ్య డంపింగ్ యార్డ్ ను తలపిస్తున్న వేస్టేజ్ చెత్త








కాప్రా / ఆగష్టు 13 ( విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : మేడ్చల్ జిల్లా నాచారం సర్కిల్ పరిధిలోని 19వ డివిజన్ మీర్పేట్ హెచ్.బి. కాలనీ కృష్ణానగర్ రోడ్ నెంబర్ 1–డీ లో రెసిడెన్షియల్ ఏరియా చెట్లతో పచ్చని చెట్లతో ప్రశాంతంగా ఉండే కాలనీలో ఖాళీగా ఉన్న ఓపెన్ ప్లాట్ నెంబర్ 33,34 లో జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ను తలపించేలా వేస్టేజ్ చెత్త కనిపిస్తుంది. ఇండ్లలో నుండి చెత్తను సేకరించే వారు పొడి చెత్తను ఇక్కడ డంపింగ్ చేయడం జరుగుతుంది. దీనివల్ల ఈ ప్రాంతంలో క్రిమి కీటకాలు పాములు పందికొక్కులు ఎలుకలు జెర్రీలు సంచరిస్తుండడంతో భయాందోళనకు గురి కావడం జరుగుతుంది.పిల్లలు ఈ రోడ్డుపైన ఆడుకుంటు బాలు ఆ చెత్త లోపల పడడంతో పిల్లల అటు వెతకడానికి వెళ్లడంతో ప్రమాదాలకు గురయ్యా అవకాశం ఉందని చెప్పారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాచారం సర్కిల్ ఉప కమిషనర్, పారిశుద్ధ విభాగపు అధికారులు వెంటనే స్పందించి ఈ జనవాసాల మధ్య నుండి చెత్తాచెదారాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. ముందే వర్షాకాలం ఆ వేస్టేజ్ చెత్త నుండి మురుగు వాసన వెదజల్లడం, చిన్న చిన్న దోమలతో పిల్లలు కాలనీవాసులు డెంగ్యూ తదితర ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది తక్షణమే నాచారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్, పారిశుద్ధ విభాగపు అధికారులు స్పందించి వేస్టేజ్ చెత్తను తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

## ఇంటికి వచ్చిన ముత్తైదువుకు బొట్టు పెట్టడంలోని విశేషం

### "అతిథి దేవో భవ" - స్త్రీలోని లక్ష్మీ స్వరూపాన్ని గౌరవించే సంప్రదాయం

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 13: మన సనాతన భారతీయ సంస్కృతిలో అతిథిని దేవుని స్వరూపంగా భావించి గౌరవించడం ఒక గొప్ప ధర్మం. ముఖ్యంగా ఇంటికి వచ్చిన ముత్తైదువును లక్ష్మీదేవి, పార్వతీదేవి, పరాశక్తి స్వరూపిణిగా భావించి పసుపు, కుంకుమ, తాంబూలాలతో సత్కరించడం అనాదిగా వస్తున్న పవిత్రమైన ఆచారం. ఇది కేవలం సంప్రదాయం మాత్రమే కాదు, స్త్రీకి మన సంస్కృతి ఇచ్చిన అత్యున్నత గౌరవానికి ప్రతీక. వివాహిత స్త్రీని "గృహలక్ష్మి" అని పిలుస్తారు. ఆమె అడుగుపెట్టిన చోట మంగళం, శుభం, ఐశ్వర్యం నిలుస్తాయని మన పెద్దలు విశ్వసించారు. అందుకే ఇంటికి వచ్చిన ముత్తైదువుకు నుదుటిపై కుంకుమ బొట్టు పెట్టి, పసుపు, కుంకుమ, తాంబూలం సమర్పించడం ద్వారా ఆమెలోని దైవత్వాన్ని ఆరాధించినట్లుగా భావిస్తారు. యోగశాస్త్రంలో నుదుటి మధ్య భాగాన్ని ఆజ్ఞా చక్ర స్థానం అని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో కుంకుమ ధరించడం మంగళానికి, శక్తికి, సౌభాగ్యానికి సంకేతం. పసుపు లక్ష్మీ కటాక్షానికి, పవిత్రతకు ప్రతీక. కుంకుమ ఆదిపరాశక్తి స్వరూపాన్ని సూచిస్తుంది. తాంబూలం గౌరవానికి, సంపూర్ణ ఆతిథ్యానికి చిహ్నం. ఈ మూడింటిని కలిసి సమర్పించడం ఒక మంగళకరమైన ఆచారంగా కొనసాగుతోంది. ఈ ఆచారం ద్వారా ఇంటికి వచ్చిన స్త్రీని గౌరవించడమే కాకుండా, కుటుంబంలో ప్రేమ, పరస్పర గౌరవం, ఐకమత్యం, మంగళం పెంపొందుతాయని మన సంప్రదాయం చెబుతోంది. ఇంటిలో లక్ష్మీ కటాక్షం నిలవాలని, కుటుంబ సభ్యులందరూ సుఖశాంతులతో జీవించాలనే సంకల్పంతో ఈ సత్కారాన్ని చేస్తారు. శుక్రవారాలు, శ్రావణమాసం, వరలక్ష్మీ వ్రతం, నవరాత్రులు, దీపావళి, వివాహాలు, వ్రతాల ఉద్యాపనలు వంటి శుభసందర్భాల్లో ముత్తైదువులను ఆహ్వానించి పసుపుకుంకుమలు సమర్పించడం నేటికీ అనేక ప్రాంతాల్లో కొనసాగుతోంది. ధర్మశాస్త్రాలు, గృహ్యసూత్రాలు, దేవీ ఉపాసనా సంప్రదాయాల్లో సువాసినీ పూజకు విశిష్ట స్థానం ఉంది. అయితే సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉన్న కొన్ని శ్లోకాలు నిజంగా స్కాంద పురాణం, దేవీ భాగవతం లేదా పద్మ పురాణంలోని యథాతథ శ్లోకాలేనా అనే విషయాన్ని ప్రామాణిక గ్రంథాల ఆధారంగా



పరిశీలించి పేర్కొనడం సముచితం. కాబట్టి మన ఇంటికి వచ్చే ప్రతి స్త్రీని గౌరవిద్దాం. ఆమెను గృహలక్ష్మిగా భావించి పసుపు, కుంకుమలతో సత్కరిద్దాం. సనాతన భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని మనమే ఆచరిస్తూ, భావితరాలకు అందిద్దాం.

## ఎయిడ్స్ నియంత్రణపై విస్తృత అవగాహన కల్పించాలి

### - బాధితులకు నిరంతర కౌన్సెలింగ్, మెరుగైన వైద్యం అందించాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్




రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 13 (విజన్ ఆంధ్ర బ్యూరో): ఎయిడ్స్ నియంత్రణపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఎయిడ్స్‌పై ప్రజల్లో అపోహలు తొలగించి, వ్యాధి నివారణ, ముందస్తు నిర్ధారణపై అవగాహన పెంచాలని సూచించారు. ఎయిడ్స్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా సంక్షేమ శాఖ, విద్య, యువజన క్రీడల శాఖ, జడ్పీ సీఈవో తదితర అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుతం ఎన్ని పాజిటివ్ కేసులు ఉన్నాయి, బాధితులు ఎక్కడ వైద్య సేవలు పొందుతున్నారు, మందులు, కౌన్సెలింగ్ తదితర సేవలు ఎలా అందుతున్నాయనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 1,283 ఎయిడ్స్ పాజిటివ్ కేసులు ఉన్నాయని, బాధితులకు ప్రతి నెలా అవసరమైన మందులు అందిస్తున్నామని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎయిడ్స్ నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాజిటివ్ కేసులు గుర్తించిన ప్రాంతాల్లో మరింత పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. బాధితులకు నిరంతరం వైద్యం, మందులు, కౌన్సెలింగ్ అందిస్తూ వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలని తెలిపారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, వేములవాడ ఏరియా ఆసుపత్రి, అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేక షెడ్యూల్ రూపొందించి దాని ప్రకారం రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. యువత, విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు అవగాహన సమావేశాలు, వ్యాసరచన, క్విజ్ తదితర పోటీలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. వ్యాధి నియంత్రణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రవీణ్ కుమార్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, యువజన క్రీడల శాఖ అధికారి రాందాస్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED, AND OWNED BY J. NARENDER. PRINTED AT: SREE SESHASAI ENTERPRISES, 3-88, CHANDRA THEATRE MAIN ROAD, GOSALA, KRISHNA, ANDHRA PRADESH - 521151 AT J.N. PUBLICATION, 76-6-01, BHATSING ROAD, CHAITANYA APTS, NEAR SWATHI CENTER, BHAVANIPURAM, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH – 521137. RNI NO.: APTEL/26/A0313 EDITOR: J. NARENDER CELL NO.: 9440897445 EMAIL: visionandhra1999@gmail.com